
# కుమార సంభవం




మాస్టర్ పార్వతీకుమార్

# కుమార సంభవం

సంకలనము :

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 2018 గురుపూజలు

ప్రతులు : 1,000

© **ధనిష్ఠ**

వెల : రూ॥ **70-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-78-4

ముద్రణ :

**వంశీ కృష్ణ ప్రింటర్స్**

విశాఖపట్నం-530 016.

☏ 0891 - 6617988

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 33 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు

సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

విజయవాడ సోదరబృందం వారు ఎల్లప్పుడు మాస్టరుగారిని పౌరాణికమగు ఉపాఖ్యానములను రహస్యార్థములతో కూడి వివరించమని కోరుతూ ఉంటారు. మాస్టరుగారు కూడ యోగ సాధనకు అన్వయిస్తూ, పౌరాణిక ఉపాఖ్యానాలు విజయవాడలో నిర్వర్తిస్తుంటారు. మాస్టరుగారి ప్రసంగములను భక్తిశ్రద్ధలతో తరచు వినుచుండుటయే గాక, చాలామంది సోదరసోదరీమణులు లేఖనం కూడ చేస్తూ ఉంటారు. అవి ప్రచురణకూడ అవుతూ వస్తున్నాయి. అలా *'అంబరీషుడు', 'రుక్మిణీ కళ్యాణం'* గ్రంథస్థమై చదువరులకు స్ఫూర్తి నిస్తున్నాయి.

*'కుమార సంభవం'* కూడ అట్లే సోదరబృందం కోరుట వలన మాస్టరుగారు అనేకానేక సాధనా రహస్యములను, సంకేతములను ఉపాఖ్యానము లాధారముగ తెలియపరచినారు. కుమార తత్త్వము యొక్క విశిష్టత, ఆ తత్త్వదర్శనమునకు చేయవలసిన సాధన, ఉపాఖ్యానముతో పాటు వివరించినారు. అతి సూక్ష్మమగు విషయ ములను సులభమగు పద్ధతులలో వివరించుటలో మాస్టరుగారు

సిద్ధహస్తులు. కనుకనే వారి ప్రసంగములను వినుటకు దశాబ్దముల తరబడి శ్రోతలు అన్ని ఖండములయందు ఏర్పడియున్నారు.

ఈ కుమార సంభవ ప్రసంగములను విజయవాడ పూర్వ గణపతి శ్రీ జి.వి.వి. **నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు శ్రీమతి శశికళ, చి॥సౌ॥ మైత్రేయి, చి॥ కృష్ణచరణ్** లిఖించ పూనిరి. వ్రాతప్రతిని శ్రమకోర్చి తయారుచేసి అందించిరి. అంతేకాక ముద్రణా వ్యయమును కూడ తామే సమర్పింతుమని ధనిష్ఠను పదే పదే కోరి సమర్పించిరి. వారి కుటుంబమునకు మాస్టరుగారే పెద్దగ దశాబ్దముల నుండి భావించుటయేగాక, శాసనముగ గూడ వారి గృహమున వెల్లడించుకొనిరి. వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములు మాస్టరుగారు ప్రసాదింతురుగాక!

విజయవాడలో మాస్టరుగారు రెట్టించిన ఉత్సాహముతో మూడు దశాబ్దములకుపైగా గురుపూజలు నిర్వర్తించుచు, అనేకానేక యోగసాధనా రహస్యములు తెలిపియున్నారు. విజయవాడ వారి జన్మస్థలము. వారి నామ మందు కుమారత్వము గూడ జోడింపబడి యున్నది. వారి నుండి వెలువడిన ఈ కుమార సంభవ ప్రసంగ ములు యథోచితముగ చదువరులకు మార్గ దర్శనము గావించ వలెనని ధనిష్ఠ కోరుచూ......

సదా శిష్టాచారుల సేవలో

కార్తీక శుద్ధ దశమి, సోమవారం
30-10-2017

**- ధనిష్ఠ**




ఓం శ్రీం శరవణభవాయ నమః ।

ఓం శ్రీం సుబ్రహ్మణ్యాయ నమః ।

# కుమార సంభవం

# 1

**ఓం శ్రీం శరవణభవాయ నమః ।**

**ఓం శ్రీం సుబ్రహ్మణ్యాయ నమః ।**

కుమారుడు, శరవణభవుడు, షణ్ముఖుడు, స్కందుడు, కార్తికేయుడు, ఉమాసుతుడు, దేవసేనాని, గుహుడు, శక్తిధరుడు, శిఖివాహుడు, శివసుతుడు– ఇత్యాది నామాలతో పిలువబడే కుమారస్వామిని గూర్చి వివరించుకోవడం ఒక అనుగ్రహం! సుబ్రహ్మణ్యుని స్మరణం సకల కల్మషహరణం. అజ్ఞానమనే చీకటికి విరుగుడు. మనలోని అసురులను సంహరించి, దేవతాబలమును పెంపుచేసే రక్షకుడు. అతడు ధర్మశాస్త్ర, సనాతుడని కీర్తి గాంచిన వాడు. విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో, కృష్ణానదీ పుణ్యతీరంలో ఈ సంవత్సరం భగవదనుగ్రహంగా కుమార సంభవం వివరించమని సోదరులు కోరటంలోని ఆంతర్యము కుమార శాసనమే! శిరసా వహించి మూడు ప్రసంగములలో వీలున్నంత స్వామిని గూర్చి వివరించుకొని తరిద్దాము.

సుబ్రహ్మణ్యుడు అన్నా, శ్రీకృష్ణుడన్నా ఒకరే. దేవలోకంలో ఉన్నప్పుడు సుబ్రహ్మణ్యుడుగా వెలుగొందుతుంటాడు. భూలోకంలో

అవతరిస్తే శ్రీకృష్ణుడుగా కనిపిస్తాడు. కృష్ణుడెంత అందమైనవాడో సుబ్రహ్మణ్యుడు కూడా అంతే అందమైనవాడు. ఇద్దరూ ఒకటే. ఇద్దరూ సమానులే! స్త్రీలు ఏ విధంగా కృష్ణునియందు ఆకర్షించబడ్డారో ఇతని యందు కూడా అలాగే ఆకర్షించబడ్డారు. శ్రీకృష్ణ దేవిధంగా అస్ఖలిత బ్రహ్మచారో సుబ్రహ్మణ్యుడు కూడా దానికి పెట్టింది పేరు. సుబ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మము నందు స్థితి పొందిన వాడు, అది ఒక సంకేత నామము. సుబ్రహ్మణ్యుడికి కుమారుడు, గుహుడు, స్కందుడు, విశాఖుడు, గంగాపుత్రుడు, కార్తికేయుడు, ఉమాసుతుడు, శరవణభవుడు ఇలా చాలా నామాలు ఉన్నాయి. అష్టోత్తరశత (108) నామాలు అందరూ పఠిస్తారు. ఈ నామాలలో ఆయన జన్మ ఎత్తి నప్పుడే కొన్ని ఏర్పడి ఉన్నాయి. సుబ్రహ్మణ్యుడు మనలో ఆజ్ఞా కేంద్రం నుంచి మూలాధారం వరకూ వ్యాపించి ఉన్నటువంటి శక్తి. ఈ యోగశక్తి ఎవరియందు ప్రస్ఫుటంగా ఉంటుందో వారు దైవ కుమారులై విరాజిల్లుతుంటారు. 'Son of God' అంటూ ఉంటామే అంటే 'కుమార' అని అర్థం. దైవ కుమారుడని అర్థం.

పరమ గురువులంతా దైవ కుమారులే. ఈ దైవ కుమారు లందరికీ కేంద్రం సుబ్రహ్మణ్యుడే! కుమారస్వామియే. సనత్కుమారునిగా భూమియందు శంబళ గ్రామములో వెలుగొందే దివ్య స్వరూపుడుగూడ ఆయనయే. శంబళ, శబరిమల, శాస్త పర్వతము శరవణభవునికి ప్రీతిపాత్రములగు పుణ్య క్షేత్రములు. అతడు శాస్త. అంటే శాసించే వాడు. ధర్మశాస్త అంటే ధర్మాన్ని నెలకొల్పేవాడు. అతని అంశలుగానే గురుపరంపర ధర్మాన్ని బోధిస్తూ, నెలకొల్పుతూ వుంటారు. అతని

లోంచి వచ్చే రవ్వలలాంటి వారు పరమగురువు లంతా. అతను మొత్తం. ఎంతటి వాడంటే అతనిని అగ్నిదేవుడు కూడా పట్టలేడు. ఎవరూ పట్టలేరు. అంత తేజోవంతుడు, అంత కాంతివంతుడు. అంత అందమైనవాడు. సృష్టిలో అందము అంటే కుమారునిదే అందం. అలాంటి కుమారుని జననం మనం వివరించుకోవడం ద్వారా మనలో కూడా 'కుమార జననం' జరిగే అవకాశం ఉంటుంది. ప్రతి మానవుడూ మళ్ళీ కుమారుడై పుట్టాలి. అలా పుట్టినప్పుడే అతడు ద్విజత్వం చెందినట్లు. అందుచేత ఈ రోజు మనం భక్తి వినమ్రతలతో కుమార తత్త్వంలోకి ప్రవేశం చేద్దాం.

కుమారుడు పుట్టడానికి సృష్టిలో ఒక నిమిత్త కారణం ఏర్పడు తుంది. కుమార సంభవ సమయంలో సృష్టిలో కారణ లోకాల వరకూ పుట్టుకు వచ్చాయి. కారణ లోకాలంటే తెల్లని వెలుగు లోకాలు. వజ్రకాంతి అంటాం. అంతవరకే దిగి వచ్చింది సృష్టి. ఇంకా బంగారు కాంతి దిగి రాలేదు. బంగారు కాంతి అంటే సూక్ష్మలోకం అవుతుంది. ఆ తరువాత భౌతిక లోకం. అంటే కారణ లోకం ఏర్పడింది. సూక్ష్మ లోకం ఏర్పడలేదు. భౌతిక లోకం ఏర్పడలేదు. అప్పటి కథ మొదలు పెడుతున్నాను నేను. పురాణాల్లో చెప్పబడ్డ కథలు సృష్టిలో జరిగిన ఘట్టాలే. కాని అన్నీ భౌతికలోకంలో అంటే భూలోకంలో జరిగినవి కావు. సత్యలోకం నుండి భూలోకం వరకు సప్త (7) లోకాలు వున్నాయి. ఒక్కొక్క లోకంలో మళ్ళీ సప్త (7) ఉపలోకాలు వున్నాయి. సృష్టి అంటే అది ఒక 'సప్తసప్తి'. "Seven Times Seven the Wheel Rotates" అని జ్ఞానమాత అయిన బ్లావెట్స్కీ అన్నారు. సత్యలోకం

నుండి తపోలోకం, జనోలోకం, మహర్లోకం, సువర్లోకం, భువర్లోకం, భూలోకం వరుసగా సూక్ష్మం నుండి స్థూలానికి ఏర్పడతాయి. ఆవిరి మంచుగడ్డగా ఏర్పడినట్లు స్థూలమునకు సూక్ష్మము కారణం. సూక్ష్మమునకు కారణలోకం మూలము. మహర్లోకం నుండి సత్త్వ రజస్తమస్సులు పుట్టి కారణలోకం ఏర్పడుతుంది.

వామనావతారం వరకు భూమిమీద జరిగిన కథలు కావు. ప్రహ్లాదుడి కథ కూడా అంతరిక్షంలో జరిగింది. ఇంకా భూమి పూర్తిగా పుట్టలేదు. అందుచేత కారణలోకం అంటే శుద్ధ వెలుగు లోకం. వజ్రాంగ లోకం అంటారు కదా! అంతా వజ్ర శరీరులే! వజ్రకాంతితో ఉంటారు. అలాంటి వజ్రశరీరంతో ఉన్న దనువు అనే స్త్రీకి కశ్యపుడి ద్వారా వజ్రాంగుడనే వాడొకడు పుడతాడు. వజ్రాంగుడు దనువుకి పుడతాడు కాబట్టి అతనిలో సహజంగా దానవ లక్షణం ఉంటుంది. కానీ అతనికి దానవ లక్షణం మీద ఆసక్తి లేదు. అసురులలో పుట్టినంత మాత్రాన ప్రహ్లాదుడికి అసుర ప్రవృత్తి వచ్చిందా? రాలేదు కదా! కొంతమంది ఏ వర్ణంలో జన్మించినా వారికి అంతకన్నా ఉత్తమమైన వర్ణము యొక్క ప్రవృత్తి లభించవచ్చు. అదే మహాభారతం చెబుతూ ఉంటుంది. 'సత్యకాముడు' అనే కథలో తెలుస్తుంది. నాకు వేదం చెప్పమని ఒక కుర్రవాడు వస్తాడు. అతని జన్మ అంతంత మాత్రమైన జన్మ. కానీ సత్యము నందు విపరీతమైన కోరిక ఉంటుంది. అది గుర్తించి సద్గురువు నీకు బ్రహ్మవిద్య నేర్పుతాను అని చెబుతాడు, మిగతా గురువులు ఒప్పుకోకపోయినా. ఎందుచేత అంటే జీవలక్షణం బట్టి జీవుని యొక్క పరిస్థితి తెలుసుకోవాలి తప్ప భౌతికంగా ఎవరు

ఏ వర్గంలో జన్మించారు అనేది కాదు. అందుచేత దనువుకి జన్మించినా వజ్రాంగుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేస్తాడు. ఎందుచేత అంటే ఈ దానవ ప్రవృత్తి పోవాలని. అప్పటికే ఈ దానవులు పడుతున్న బాధలు చూసి మనకు వద్దు ఈ దమించడం అనే ప్రవృత్తి, ఈ దానవ బుద్ధి. అసుర బుద్ధి అంటే హింసించడం. దానవ బుద్ధి అంటే ఎదుటివాడి ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా వాణ్ణి దమించి మనం పని చేయించేసుకోవటం. వజ్రాంగుడు వద్దు అనుకున్నాడు ఇదంతా. ఆయనకి వరాంగి అనేటువంటి ఒక భార్య ఉన్నది.

వజ్రాంగుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేస్తూ ఉంటే ఇంద్రుడికి భయం కలిగింది. ఇంద్రుడికి ప్రతి దానికీ భయమే. ఇదో బుద్ధి ఉంది ఆయనకి. ఆయనకి కుర్చీ బాధ ఎక్కువ. మొదటి నుంచి పదవి అనుభవించిన వాడికి ఆ పదవి గూర్చి చాలా బాధ ఉంటుంది. అందుకని పదవులు ఉన్నవాళ్ళు పదవి వదలి చూడాలి తమలో పదవీకాంక్ష ఎంత ఉందో తెలియటానికి. నాకు పదవీకాంక్ష లేదు అనకూడదు. అది ఆ పదవి మాట్లాడాలి. దిగి మాట్లాడితే కదా ఉన్నదో లేదో తెలుస్తుంది.

అందుచేత ఇంద్రుడికి అదో రకమైన బాధ. ఎందుకంటే ఆ పదవి అలాంటిది. ఆ పదవిలో సమస్త అధికారాలు వుంటాయి. అష్ట దిక్పాలకులు, నవగ్రహాలు తన మాట వింటారు. దీని నంతా తనే సంరక్షిస్తున్నట్లు ఒక భ్రమ. ప్రక్కనే ఉంటాడు, ఉపేంద్రుడు అని. అందుకే ఆయన ఉపేంద్రుడు. ఆయనకు నిజంగా కాంక్ష లేదు.

ఇంద్రుడికి కాంక్ష. శివుడికి కాంక్ష లేదు. రుద్రుడికి కాంక్ష లేదు. కాంక్ష ఉన్నది ఇంద్రుడికే.

ఇంద్రుడికి ఈ వజ్రాంగుడు అనే దానవుడు తపస్సు చేస్తుంటే భయం కలిగింది. ఎందుకంటే ఇంతకు ముందు చాలా precedents ఉన్నాయి ఇంద్రుడికి. ప్రతివాడూ తపస్సు చేసి నాకు ఇంద్రపదవి కావాలని అడుగుతూ ఉంటారు. ఈ అసురులు తపస్సు చేసి త్రిమూర్తు లలో ఎవరైనా ప్రత్యక్షమైతే నాకు ఇంద్రపదవి కావాలని అడుగుతారు. అందుకని వీళ్ళు తపస్సు చేసి ఇంద్రపదవి అడుగుతారు అనే దృఢమైన అభిప్రాయం ఎప్పుడూ ఉంటుంది పాపం ఇంద్రుడికి. దురదృష్టం. ఎవరు తపస్సు చేసినా అందుకే అనుకుంటే ఎట్లా అండీ? అందుకే అనుకుని ఏం చేశాడంటే వాళ్ళ ఆవిడ వరాంగిని ఏడిపించడం మొదలు పెడతాడు. చేతనైన పని ఏమిటంటే తపస్సు చేసేవాణ్ణి ఏమీ చెయ్యలేక అతని భార్యని ఏడిపిస్తూ ఉంటాడు. ఏం చేస్తాడు? ఆవిడ పేరు వరాంగి. భర్త తపస్సు చేస్తూ ఉంటే భార్య ఇంట్లో అమ్మవారి పూజ చేస్తూ ఉంటుంది. అందుకే భర్త దీక్షాయుతమైన పనులు చేస్తూ ఉంటే, ఇంట్లో భార్య అమ్మవారి పూజ చేస్తూ ఉంటే ఆ భర్తకి బాగా కలసి వస్తూ ఉంటుంది. ఇలాంటి కథలు ఎన్నో ఉన్నాయి. భర్త చేసే మంచి పనులకు అడ్డుపడే భార్య భార్య కాదు. భార్య రూపేణా అదేదో ఉందక్కడ, అంతే!

జలంధరుడనే అసురుడు ఇంద్రుణ్ణి జయించి రకరకాలైన కష్టాలకు గురి చేస్తూ ఉంటే వాడిని ఎవరూ జయించలేకపోతారు. ఎందుచేతంటే ఆయన భార్య తులసి విష్ణుపూజ చేస్తూ ఉంటుంది.

ఈమె విష్ణుపూజ బలం ఆయనకు అందుతూ ఉంటుంది. భార్య పూజాఫలము భర్తకి బలం, గుర్తుపెట్టుకోండి. భార్య పూజ చెయ్యట్లేదను కోండి, భర్త చేసుకోవడమే మంచిది. అంతేకాని వదిలెయ్యవద్దు. ఎందుకంటే ప్రకృతి సహకారము లేకపోతే ఏమీ కాదు. మనకి అందుకే సంప్రదాయంలో ఏం పెట్టారంటే భర్తకి తపస్సు, భార్యకి పూజ. ఎందుచేత అంటే భార్య ప్రకృతి అనుగ్రహం తెచ్చిపెడుతూ ఉంటే భర్త తపస్సులో తనకు సగ భాగం వస్తూ ఉంటుంది. ఎప్పుడూ 50% వాటానే కదా!

వరాంగి పూజ చేస్తూ ఉంటే ఇంద్రుడు కోతి రూపంలో వచ్చి పూజా సామగ్రి అంతా ఎత్తుకుపోతాడు. ఆవిడ పూజను భంగం చేస్తూ ఉంటాడు. పూజ భంగం అవుతుంటే ఆవిడ మానస పూజ చేసుకుంటూ ఉంటుంది. ఇక అప్పుడు ఎత్తుకు పోవడానికి ఏమీ ఉండదు కదా! మానస పూజ చేస్తూ ఉంటే సింహం రూపంలో వచ్చి భయపెడుతూ ఉంటాడు. ఇలా భయపెడుతూ ఉంటే ఆవిడ మానస పూజని తపస్సుగా మార్చి చేసుకుంటుంటే పాములా వచ్చి కాటేస్తాడు. చెయ్యవలసిన కోతి పనులన్నీ చేస్తాడు. సరే ఈ లోపల వజ్రాంగుడు తపస్సు పూర్తి చేసి తనకు సత్త్వగుణాన్ని ప్రసాదించమని బ్రహ్మదేవుణ్ణి ప్రార్థిస్తాడు. బ్రహ్మ అలాగేనని ఆశీర్వదిస్తాడు. ఇంటికి వచ్చేటప్పటికి భార్య చాలా దుఃఖంలో వుంటుంది. ఇంట్లో ఉండదు. ఎక్కడో అడవుల్లో చెట్టు క్రింద ఉంటుంది. ఏమిటి ఇక్కడున్నావు? ఎందుకు ఏడుస్తున్నావు? అంటే ఈ కథంతా చెప్పుకొస్తుంది. ఇట్లా

చేశాడు నా విషయంలో ఇంద్రుడు, మీరు తపస్సుకు వెళితే అని చెప్తుంది.

ఎవరు ఇంద్రుడు? బావగారే కదా! ఎందుకంటే అదితి కుమారుడు ఆదిత్యుడైనటువంటి వాడు ఇంద్రుడు. దనువు కుమారుడు వజ్రాంగుడు. దనువు అదితి చెల్లెలు. ఇద్దరికిని కశ్యప ప్రజాపతి భర్త. ఇంద్రునికి బుద్ధి చెప్పాలి అని వజ్రాంగుడుకి మళ్ళీ ఒక సంకల్పం కలిగి తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి ప్రత్యక్షం చేసుకుంటాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏంకావాలి? అంటే ఇంద్రుణ్ణి నిర్జించి జయించే కుమారుణ్ణి ఒకణ్ణి ఇవ్వు అని అడుగుతాడు. బ్రహ్మదేవుడు తథాస్తు! అంటాడు. అలా అనడం చేత ఈ వరాంగికి – వజ్రాంగుడికి తారకాసురుడు పుడతాడు. అది తారాకాసురుని జననం. తారకాసురుడు పుడితేనే కదా కుమారుడు పుడతాడు. తారకాసురుని చేష్టలు నిర్జించటానికి కుమార సంభవం జరుగవలసి వస్తుంది. ఇంద్రుని చేష్టలు తారకాసురుని జననానికి కారణమౌతుంది. ఇంద్రుని భయము, అనుమానము అతని దుశ్చేష్టలకు కారణము. ఇలా కారణలోకంలో కారణకార్యాలు మొదలవుతాయి. అలా తారకాసురుడు పుట్టీ పుట్టగానే తన జన్మ ప్రయోజనం ఏమిటో తెలుసుకుంటాడు. మనం పుట్టగానే తెలుసుకోముగా.

మన జన్మ ప్రయోజనం ఏమిటో ఇవాల్టికీ తెలియకుండా తిరుగుతున్న వాళ్ళు లేరూ! “Let purpose guide the little wills of men” అంటాం కదా! ఎందుకు పుట్టామో తెలియకుండా ఏదో చేస్తూ

ఉంటాం కదా! నేనెందుకు పుట్టాను అనే ప్రశ్న పుట్టదు. వీడెందుకు పుట్టాడో అని మిగతా వాళ్ళు అనుకునేటట్టుగా ఉంటాము. నీ జన్మ ఎందుకో నీకు తెలియాలి. వాడెందుకు పుట్టాడో వాడికి తెలియాలి. తారాకాసురుడు అడిగాడు. "నేనెందుకు పుట్టాను నాన్నా! ఏ సంకల్పంతో నీవు నన్ను పుట్టించావు?" అని. ఇందుకు కన్నాను నిన్ను. ఇలా మీ పెదనాన్న నేను తపస్సు చేసుకుంటూ ఉంటే.... అని మొత్తం పూర్వకథ చెప్పాడు. అయితే నేను పుట్టింది ఇంద్రుణ్ణి జయించడానికి కాబట్టి నేను కూడా తపస్సు చేస్తాను అన్నాడు. ఇంద్రుణ్ణి జయించాలి అనుకుంటే ఏదో ఒక ఆయుధం చేతిలో పట్టుకొని సరాసరి వెళ్ళిపోతే కుదరదు కదా! ఇంద్రుడి చేతిలో వజ్రాయుధం ఉంటుంది. ఇంద్రుణ్ణి గెలవడం సులభమా? అందుచేత ఇంద్రుణ్ణి గెలవడానికి నేను తపస్సు చేస్తా నాన్నా! అని ఆయన తపస్సు చేస్తాడు.

తారకాసురుడు సామాన్యుడు కాదు. తపస్సు చేస్తే బ్రహ్మదేవుడు ప్రత్యక్షమవుతాడు. "క్షణకాలంలో ఈ దేవతలంతా కూడా జయింప బడాలి. మొత్తం అంతా చీకటి కమ్మేయాలి" అని అడుగుతాడు, 'ఊ కానీ!' సంకల్పం కదా! 'సరే కానీ' అని బ్రహ్మ వరం ఇచ్చేస్తాడు. అడిగింది ఇవ్వడమే దైవం పని. దానితో నీవేమి చేసుకుంటావో నీ ఇష్టం.

## ②

**తా**రకాసురుడు దేవతలందరినీ ప్రస్తుత తెలుగు భాషలో చెప్పాలంటే మట్టేస్తాడు (ఓడిస్తాడు). ఇక ఎవరికీ ఎప్పుడు తెల్లవారుతుందో తెలియదు. ఇంకొకడు లేడు కదా మళ్ళీ జయించ డానికి. వాడిని మళ్ళీ నిర్జిస్తేనే కదా సృష్టి. సృష్టి కథ సాగేది. ఆ పరిస్థితి వస్తుంది. దేవతలందరూ ఇంద్రుని ముందు పెట్టుకొని బ్రహ్మని అడుగుతారు. ఏమిటి మా పరిస్థితి ఇలా అయ్యింది అని. ఆయన దీనికి పరిష్కారం శివతేజమే! ఇంకొకటి లేదు అంటాడు. ఈ దుష్ఫలితానికి కారణం ఇంద్రుడే. శివతేజం మనం పొందగలిగితే, దేవతలకు మళ్ళీ ఇలాంటి అవాంతరాలు కలుగవు అని చెప్తాడు (మరల సృష్టిలో చీకటి కమ్మడం). ఒకసారి చీకటిలో ఉన్న సృష్టికి రుద్రుడుగా దిగివచ్చి మొత్తం పదకొండు రుద్రులుగా ఏర్పడి ఈ సృష్టికి ఏర్పాటు చేస్తాడు శివుడు. మళ్ళీ చీకటి కమ్మింది. ఇక కాపాడేవారు ఎవరూ లేరు, ఆయనే అని చెబుతాడు. శివతేజమే దిగి రావాలి మరి అని బ్రహ్మదేవుడు పలుకుతాడు.

శివుడు అప్పుడు ఎట్లా ఉన్నాడు? అసలు బొత్తిగా ఎవరు పిలిచినా పలకని స్థితిలో ఉన్నాడు. దేవతలు పిలిచినా, ఎవరు పిలిచినా పలకడు. ఎందుకని అంటే ఆయన కపర్ది, ఊర్ధ్వరేతస్కుడు. మీరు

చుట్టూ ఏం చేసినా పలకడు. ప్రక్క చూపు ఉండదు. ఊర్ధ్వముగా 'ఊర్ధ్వ ముఖాయై నమః' అంటాము కదా! ఊర్ధ్వముఖుడైన శివుణ్ణి దరి చేరాలంటే భయం. ఎందుచేత అంటే ఆ తేజస్సు తీవ్రత అలా ఉంటుంది. అతడు కొంచెం ఒక అంశగా దిగి వస్తే అగ్ని అవుతాడు. లేకపోతే అది తేజస్సే. ఆ తేజస్సు దరి చేరడానికి దేవతలందరూ భయపడతారు. ఎలా ఇప్పుడు అని ప్రశ్న పుడుతుంది. ఎలా అంటే 'ఒక్కరి యందే ఆయనకు మక్కువ' అని చెబుతాడు బ్రహ్మదేవుడు.

శివునికి పరాశక్తియే అత్యంత ప్రీతిపాత్రురాలు. పరాశక్తి అనుగ్రహం వల్లనే సృష్టి నవావరణలుగా ఏర్పడుతుంది. సృష్టి కార్యానికి, పరాశక్తి ప్రకృతియందు లీనమై సృష్టి నిర్మాణం గావిస్తుంది. ఆ కార్యంలో భాగంగా దక్షప్రజాపతిని అనుగ్రహించి, అతనికి కూతురుగ జన్మిస్తుంది. ఆమెయే సతి. సతీదేవి సహజముగ తన పతియైన శివునియందు మనసుపడి, ఆకర్షితయై అతనిని, దక్షుని సమ్మతికి విరుద్ధముగ వివాహమాడి, దక్ష యజ్ఞమందు దక్షునిచే అవమానింపబడి తనను తాను దగ్ధం గావించుకుంటుంది. మరల శివుని చేరాలనే కాంక్షతో హిమవంతునికి కూతురుగ జన్మిస్తుంది. పార్వతిగ వెలుస్తుంది.

ఎవరామె, సతీదేవి కదా! సతీదేవి ఎవరు? ప్రకృతియే! మూల ప్రకృతియే. ఆమె లేదు కదా! ఆమె శివునిలో కలిసిపోయింది. ఎందుచేత? ఆమె బొటనవ్రేలుతో యోగాగ్నిని చోటులో (కారణ లోకాల్లో) పుట్టించు కొని, అందులో తనని తాను ఆహుతి చేసుకొని

శివునిలో చేరిపోతుంది కదా! తానుండి, దైవముండి దైవముతో రుచికొనడం అనేది రసానుభూతి. ఆ రసానుభూతి ప్రకృతికి సహజంగా ఉంటుంది. ప్రకృతికి పురుషునితో రసానుభూతి పొందడానికి సృష్టిలో రకరకాలుగా మనకి రాధాకృష్ణుల నాట్యం నుండి శివశక్తుల నాట్యం అనండి ఏదో ఒకటి ఉంది. ఆమె ఉన్ముఖంగా ఉంటుంది. ఎందుచేత? ఆమె అదే అయిపోయి ఉంది. శివుడే అయిపోయి ఉంది. మరల ఆయన నుంచి విడిపోతే మరల ఆయన ఆవిడతో రసానుభూతి పొందవచ్చు. అందుచేత శివుణ్ణి మెప్పించడం ఎవరి తరం కాదు. అంచేత ఆమే శివుణ్ణి మెప్పించగలదు. ఆయన ఉన్ముఖుడైతే ఏదైనా పని జరుగుతుంది అని చెప్తాడు బ్రహ్మదేవుడు. మరి ఆవిడ లేదు కదా అంటాడు (ఇంద్రుడు). ఎందుకు లేదు, ఉంది అంటాడు బ్రహ్మదేవుడు. సతీదేవి ఆ విధంగా యోగాగ్ని సృజించుకొని శివునితో కలసిపోవడం కన్నా శివునితో కూడి ఉండాలి అనే భావంతో ఉంటుంది. కలసిపోవడం కన్నా కూడి ఉండటంలోనే ఆనందం ఎక్కువ.

అద్వైతం కన్నా విశిష్టాద్వైతంలో ఆనందం ఎక్కువ. ఏం సందేహంలేదు. పరమ అద్వైత భాష్యం చెప్పి అద్వైత స్థితిని పొందిన ఆది శంకరులు విశిష్టమైన అద్వైతాన్ని ప్రవేశపెట్టారు. రామానుజుల వారు కూడా అదే ఇచ్చారు. ఏమిటి శంకరు లిచ్చిన విశిష్టాద్వైతము? "తానుగా ఉండి, దైవాన్ని ఆరాధన చేసుకుంటూ, తానే అదని తెలిసినా, అదిగా దాన్ని చూస్తూ, దానితో రసాస్వాదన పొందడం" అనేటువంటి ఒక స్థితి. అది చెప్పటానికే ఇన్ని స్తోత్రాలు వ్రాశారు. శంకరులు

వ్రాసినన్ని స్తోత్రాలు ఎవరూ వ్రాయలేదు. మనం చదువుకునే ఉత్తమోత్తమైన స్తోత్రములు, స్తవములు ఆదిశంకరులు ఇచ్చినవి. మిగతావి వేదవ్యాసుడు ఇచ్చినవి. అవే ప్రధానమైనవి. మిగతావి చిన్నవి.

అందుచేత అలా విశిష్టాద్వైతమే ఆనందానుభూతికి అవకాశం ఇస్తుంది. ధ్యానంలో ఉండి సమాధి స్థితి కోరుకుంటూ సాలోక్య సామీప్య సాయుజ్యాలతో పొందే ఆనందం సారూప్యం చెందినప్పుడు ఉండదు. అద్వైపోతే ఉండదు. రామకృష్ణుడు అట్లా చేసుకుంటూ ఆనందం పొందుతూ పొందుతూ పరమహంస అవ్వడం చేత అద్వై పోతూ ఉండేవాడు. మళ్ళీ వచ్చేసి ఆరాధన చేసుకుంటూ ఉండేవాడు. ఎందుచేత అంటే అలా చేసుకుంటేనే బాగుంటుంది. కలిసి ఉంటే ఆనందంగా ఉంటుంది. కలిసిపోతే ఆనందం లేదు.

ఆవిడ (సతీదేవి) కలసి ఉంటానికి కోరుకుంటుంది. మళ్ళీ కలసివుందాం అనే కోరికతో ఆయనలో కలసిపోవడం చేత మళ్ళీ పుడుతుంది. హిమవంతుడికి కుమార్తెగా యిప్పుడు పుట్టి ఉంది అని చెబుతాడు (బ్రహ్మదేవుడు). అయితే ఆవిడను తపస్సుకు ప్రేరేపణ చేద్దాం అంటారు వాళ్ళు (దేవతలు). మీరేమీ చెయ్యనక్కరలేదు అంటాడు బ్రహ్మ. పార్వతికి శివుణ్ణి కోరమని ఇంకొకళ్ళు చెప్పాలా? చెప్పనక్కర్లేదు. బ్రహ్మజిజ్ఞాస కలిగిన జీవి పుట్టినప్పుడు అతనికి బ్రహ్మజిజ్ఞాస కలిగించవలసిన అవసరం లేదు. బ్రహ్మజిజ్ఞాస కలిగి యుండటం చేత అతనే బ్రహ్మమును గురించిన సాధన మొదలు పెట్టేస్తాడు. శుకుడు అలాంటివాడు. ఆ జిజ్ఞాస కలిగినవాళ్ళు ఆ

జిజ్ఞాస గురించే ప్రయత్నం సాగిస్తారు. ఏ జిజ్ఞాస కలిగినవాళ్ళు సృష్టిలో ఆ జిజ్ఞాస వైపే నడుస్తూ ఉంటారు కదా!

అందుచేత శివసాయుజ్యము అనే జిజ్ఞాస కలిగిన పార్వతి పుట్టుక తోటే శివసాయుజ్యం కోరుతూ ఉంటుంది. తదనుగుణ మైనటువంటి పుణ్యం చేస్తూ ఉంటుంది. శివుని గూర్చి భావన చేస్తూ ఉంటుంది. కాని అంతకుముందు తాను కూడి ఉన్నటువంటి శివుని కన్నా ఇప్పుడు ఉన్నటువంటి శివుడు మరింత విరాగి. కారణం సతీ వియోగమే! కుదరదమ్మా అని తల్లి చెప్తుంది. ఎందుకంటే తల్లి కదా! కూతురి కష్టం చూడలేక. చాలామంది ఆవిడ పడుతున్న శ్రమ చూసి వద్దులే అని చెబుతూ ఉంటారు. పార్వతిని నిరుత్సాహపరచిన వాళ్ళు చాలామంది ఉన్నారు. అయినప్పటికీ తన లోపల జీవలక్షణం శివ సాయుజ్యం కాబట్టి కొనసాగిస్తుంది. శివుణ్ణి మెప్పించాలంటే అందచందాలతో మెప్పించలేము కదా! పార్వతి కన్నా అందమైనవారు లేరు. అందం అంతా పార్వతిదే. ఆమెయే విష్ణువు కూడా. అందుకే 'వైష్ణవి' అనే నామం కూడా ఉంది. అమ్మవారే విష్ణువు.

చాలామంది వచ్చి చెప్తారు. ఆమె అందాన్ని వివరిస్తారు. వివరించి విష్ణువుని పెళ్ళి చేసుకో బాగుంటుంది, నీ అందానికి ఆయన అందానికి సరిపోతుంది అని చెబుతారు. ఈయనేముంది బొత్తిగా పాములు మెళ్ళో వేసుకుంటాడు. అంతా విభూతి రాసుకుంటూ ఉంటాడు. జడలు పెంచుకుంటాడు. ఏ అందము లేకుండా ఉంటా డంటే అప్పుడు పార్వతి చెబుతుంది శివుని అందం గురించి ఆ

వచ్చిన ఆయనకి. అది మనం చదువుకోవాలి. అందుకు చదువు కోవాలి పురాణాలు.

శివుని అందం గురించి చెప్పగలిగింది ఒక్క పార్వతి మాత్రమే. విష్ణువు అందం గురించి నాకు తెలుసు, విష్ణువును నేనే కదా! నాకు చెప్పనక్కర్లేదు. నేనే విష్ణువునైనప్పుడు నా అందాన్ని నేను కొరుక్కు తింటానా? శివుని అందం నీకు తెలియదు. తెలియక మాట్లాడు తున్నావు. నే చెప్తాను విను. అప్పుడు నువ్వుకూడా శివుణ్ణే ఆరాధన చేస్తావు అని పంపించేస్తుంది. ఎవరొస్తే వారిని నిరుత్సాహ పరి చేస్తుంది. ఆమెను నిరుత్సాహ పరచడానికి వచ్చిన వారిని ఆమే నిరుత్సాహపరచి పంపించేస్తుంది. అటువంటి మాత ఆమె. ఇంక లాభం లేదు ఈవిడ, ఎవరి మాటా వినదు అని ఈవిడకు సహాయం చెయ్యాలనే ఉద్దేశ్యంతో రకరకాలుగా ప్రయత్నం చేసి భంగపడతారు అందరూ.

శివుణ్ణి మెప్పించడం ఎలా? ఆమెయే మెప్పించగలదు. ఇక ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఎందుకని అంటే శివుని అంతరంగం తెలిసినది ఆమెయే. అందుచేత శివుని ఆరాధనా భావంతో పూజిస్తూ ఉంటే మన్మథుడు వచ్చి ఎందుకమ్మా నేనున్నాను కదా! నన్ను ఒక ప్రయత్నం చెయ్యనీ అన్నాడు. చేస్తే దానికి కొంత అంతరాయం కలుగుతుంది శివుడికి. కలిగితే "ఏమిటీ అంతరాయం" అని కనులు తెరచి చూస్తే ఎదుట ఉన్నవాడు భస్మమైపోతాడు. భస్మం చెయ్యాలని చూడడు. ఆ తేజస్సు అటువంటిది. అందుకే శివాలయానికి ఎదురుగా

ఇల్లు కట్టుకోకూడదు అని చెబుతారు. కారణం ఏమిటంటే శివతేజస్సు అలాంటిది.

ఇంకెవరు వెళ్తారండి ఆయన దగ్గరకి. కేవలము తపస్సు చేతనే శివుణ్ణి మెప్పించవచ్చు. ఇంకొకటి ఏదీ కుదరదు. ఏరకంగానూ మెప్పించలేరు. తపస్వి అంటే శివుడే. తపస్వి జనులను అనుగ్రహించే వాడు శివుడు. అందుచేత పార్వతి తన తపస్సును ఇంకా తీవ్రం చేస్తుంది. మరీ తీవ్రం చేస్తుంది. ఈమె స్పర్శ క్రమంగా అంత ఉగ్ర తపస్సులో ఉన్న  శివుణ్ణి చేరుతూ ఉంటుంది. చేరుతూ వుంటే ఆ స్పర్శ తనకి తెలిసిన స్పర్శే. తెలిసిన స్పర్శ అయినా ఇదివరకు తనతో ఉన్నప్పుడు తను వలదని చెప్పినా వెళ్ళి కదా భంగపడ్డది. సతీదేవిగా ఉన్నప్పుడు దక్షయజ్ఞానికి వెళ్లవలసిందే అని పట్టుబట్టి పిలువని పేరంటముగా ఆమె యజ్ఞానికి వెడుతుంది. దక్షుని అంతరంగ మెరిగిన శివుడు వారించినా, వాదించి మరీ వెడుతుంది. భంగపడుతుంది. తనను తాను ఆహుతి గావించుకుంటుంది. సతికి జరిగిన అవమానానికి ప్రతిగ మహాదేవుడు ఉగ్రరూపుడై వీరభద్రాదులను సృజించి దక్ష సంహారం చేస్తాడు. అటుపై మను పుత్రియైన ప్రసూతిదేవి ప్రార్థనను మన్నించి, దక్షునికి గొఱ్ఱెతల నతికించి, ప్రాణంపోసి అనుగ్రహిస్తాడు. అప్పటినుండి శివుడు విరాగియై, తపస్వియై, ఉగ్రతపస్వియై లోకాలకు అతీతంగా ఉంటాడు. అలాంటి వానికి మరల ప్రియస్పర్శ కలుగుతుంది. వెనుకటి సంఘటన గుర్తుకు వచ్చి నిర్లిప్తుడై తపస్సులోనే ఉండిపోతాడు. లోపల సతిని గూర్చిన భావనలు.

"నీకు నాన్నే అయి ఉండొచ్చు. నీకు ప్రేమ ఉండి ఉండవచ్చు. మనని పిలవనప్పుడు నువ్వు వెళ్ళకూడదు" అని చెప్తాడు.

పిలవని పేరంటానికి వెళ్ళకూడదు. పిలవలేదని దైవ కార్యానికి వెళ్ళకుండా ఉండకూడదు. ఇదొకటి ఉన్నది సంప్రదాయంలో. గురుపూజలకి మమ్మల్ని పిలవలేదండీ అనకూడదు. పూజకి మమ్మల్ని పిలవలేదండీ అనకూడదు. అభిషేకం, హోమం జరుగుతోంది అని తెలిస్తే వెళ్ళడమే. తీర్థయాత్రలకి మమ్మల్ని పిలవలేదండీ అనకూడదు. నేనూ వస్తాను అనాలి అంతే. నీ కిష్టమైతే రావడమే. నన్ను పిలిస్తే వస్తాను అంటే ఎవరూ పిలవరు. ఎందుకంటే దైవం నువ్వు పిలిస్తే పలికేవాడు తప్ప, నిన్ను పిలిచేవాడు కాదు. కోరి ఎవర్నీ పిలవడండీ! తనను కోరుకునే వాడి దగ్గరకి వస్తాడు. అందుకని దైవ కార్యాలకి పిలుపు ఉండదు. ఇతర కార్యాలకు పిలుపు లేకుండా వెళ్ళకూడదు.

పిలుపు లేదు కదా! ఎందుకు వెళతావు అంటే మరచిపోయి ఉంటారండీ, హడావిడిలో అంది. మరిచిపోతాడా దక్షుడు? దక్షుడికి మరపేముంటుంది? ఉండదే. దక్షత్వం ఉన్నవాడికి మరపు ఉండదు. ఎందుకు తండ్రికి శివుని మీద కోపం అంటే, చంద్రుణ్ణి శివుడు అనుగ్రహిస్తాడు దక్షుడు శపిస్తే. మామగారు (దక్షుడు) కోప్పడ్డాడు చంద్రుణ్ణి. ఎందుకంటే ఒక కూతురుతో ఎక్కువ చనువుగా వుంటాడు మిగతా కూతుళ్ళతో కంటే. మిగతా కూతుళ్ళంతా వెళ్ళి "రోహిణితో ఎక్కువ చనువుగా ఉంటున్నాడు నాన్నా! మీ అల్లుడు. మాతో అంతంత మాత్రంగా ఉంటున్నాడు." అంటే దక్షుడు చంద్రుని పిలిచి కోప్పడతాడు. అందరితో సమానంగా ఉండు అని. అలాగే మామ

గారూ! అంటాడు చంద్రుడు. కాని అలానే (పూర్వంలానే) ఉంటాడు. అల్లుడు మాట వింటాడేంటి, వినడు కదా! వింటాడా? వింటే అల్లుడెందుకు అవుతాడు?

అతడు మాట విన్లేదు. మాట వినకపోవడం వల్ల మళ్ళీ చెప్తాడు. సరే! అంటాడు. ఇంకొంచెం తీవ్రంగా చెప్తాడు, అయినా వినడు. మూడోసారి మామగారికి (దక్షుడికి) అల్లుడు (చంద్రుడు) మీద కోపం వస్తుంది. చంద్రుణ్ణి కోప్పడతాడు. నీకు క్షయం వచ్చేస్తుంది అని. అంతకు ముందు నాన్న చుట్టూ తిరిగిన కూతుళ్ళు కూడా తిట్టడం మొదలుపెడతారు వాళ్ళ నాన్నని. నువ్వేం నాన్నవి అని. 27 మందీ తిడతారు. మా ఆయన మాతో బాగా ఉండాలి అని నీతో చెప్పుకుంటే నువ్వు ఆయనకు క్షయ రోగం పెడితే మేము ఏమైపోవాలి అని. చాలా రకరకాలుగా తిడతారు. తిడితే ఆయనకు ఇంకా కోపం వచ్చేస్తుంది. మీ కోసమే చేశాను నేను. ఏడవండి అయితే అంటాడు. అందుకే క్షయ వృద్ధులు ఉన్నాయి కదా చంద్రుడికి. ఉన్నాయా? అసలు క్షయమే చెబుతాడు దక్షుడు. క్షయమే ఏర్పాటు చేస్తే నారదుడు సలహా ఇస్తాడు చంద్రుడికి, శివుణ్ణి ప్రార్థించమని. ఆయనే నిన్ను రక్షిస్తాడు. ఇంకెవరూ నిన్ను రక్షించలేరు. అప్పుడు శివుని గూర్చి తపస్సు చేసుకుంటాడు.

చంద్రుడు తపస్సు చేస్తే, ఏమిటిరా నీ బాధ? అంటే ఇలా క్షయ వచ్చేసింది గురువుగారూ అని చెప్తాడు. పోనిలే నువ్వు అందరితో సమంగా లేవు కదా! సమదర్శనం ఉండాలి కదా! సమదర్శనం లేకపోవడం వల్ల క్షయ వచ్చింది. అంతమాత్రం చేత ఎప్పుడూ క్షయమే

కాదులే వృద్ధి కూడా ఉంటుంది అని వృద్ధి కూడా కలిగిస్తాడు. అందుకని క్షయ వృద్ధులు ఏర్పడతాయి చంద్రునికి. ఇలా వృద్ధి కలిగించాడని చెప్పి కోపం అండీ శివునిమీద దక్షుడికి, అందుకని పిలవడు. తనని అడగొద్దండీ. ఒకణ్ణి రక్షించడానికి ఇంకొకడిని అడిగేది ఏముందండీ? ఒకరిని శిక్షించాలంటే ఏరా శిక్షించనా అని అడగాలి తప్ప ఇంకొకడిని రక్షించాలి, బాగు చెయ్యాలి అంటే ఇంకొకరిని అడగనక్కర లేదు. అందుకని పిలవలేదు.

పిలవని పేరంటానికి ఈవిడ వెళుతుంది. శివుడు, పార్వతికి ఎన్నో చెప్తాడండి. అంతకుముందు సతీదేవి కదా! అన్ని చెప్పినా ఆ పుట్టింటి మమకారం అదేంటో అలా ఉంటుంది స్త్రీకి. ఇంటావిడ పుట్టింటికి వెళ్తే మీరు వెళ్ళకండి. మీరంటే ఎంత ప్రేమ ఉన్నా మీ ఆవిడ పుట్టింటికి వెళ్తే మిమ్మల్ని పట్టించుకోదు, ఏం సందేహం లేదు. అంత మమకారం అలా ప్రకృతిలో ఉంది. ఎన్నో విషయాలు తెలిసి కూడ పుట్టింటి విషయంలో వద్దంటే ఏదో చెప్తుంది. ఆయన సలహాలన్నిటికీ ఏదో ఒక సమాధానం చెప్పేస్తుంది సతీదేవి. ఏ స్త్రీ తన పుట్టింటి గురించి సమర్థించుకోదూ! సమర్థించుకోవడంలో తప్పులేదు కానీ వాళ్ళ తప్పున్నా సమర్థిస్తే మోహం ఉందిట! చూడండి ఇవన్నీ ధర్మ సూక్ష్మాలే కదా! తన స్త్రీ తనయందు భక్తి శ్రద్ధలు కలిగి, విపరీతమైన ప్రేమాభిమానాలు కలిగి, తాను తప్ప ఇంకొకటి ఏమీ లేదు అనే భావంలో ఉండేటటువంటి ఆమె తన పుట్టింటి విషయం వచ్చేటప్పటికి మోహంలో పడి తన మాట వినడం మానేసింది.

వివరాల్లోకి వెళ్తే ఈ సంభాషణ చాలా బాగుంటుంది. ఈ సంభాషణ గూర్చి మీరు వివరంగా తెలుసుకోవాలి అంటే ప్రభుదత్త బ్రహ్మచారిగారు భాగవతం 64 భాగాలుగా వ్రాశారు. 64 కళలుగా ఉంటుంది ఆ భాగవతం. తెనాలి సాధన గ్రంథ మండలి వాళ్ళు దాన్ని పుస్తకాలుగా ప్రచురించారు. దాన్ని శ్రీరామ చరణ్ అనే కుందుర్తి వేంకట నరసయ్యగారు అనువాదం చేశారు. అందులో ఉంది ఈ రసవత్తర మైన భాషణం అంతా కూడా. చదువుకుంటూ ఉంటే ఒళ్ళు గగుర్పొడిచి రాయిలాంటి మనిషికి కూడా భక్తి పుడుతుంది. భక్తి పుట్టడానికి, పెంపొందడానికి ఆ గ్రంథాలు తెలుగుదేశంలో 1950–60ల మధ్య ఒక తరంగంలా వచ్చి వెళ్ళిపోయినాయి. ఇప్పుడు ప్రతులు వెతుక్కున్నా దొరకవు. అందులో శివ సతుల సంభాషణం ఉంటుంది. ఆ సంభాషణంలో శివుడు సతికి ధర్మం చెబుతూ ఉంటాడు. పార్వతి దానికి తన లాజిక్ చెబుతూ ఉంటుంది (సతీదేవి). ఎప్పుడైతే తనని (శివుణ్ణి) వీడి వెళ్ళిందో అప్పుడే అతనికి (శివునికి) తెలుసు. ఈమె భంగపడుతుంది అని.

ఎప్పుడైతే రాముడి సన్నిధిలో బంగారు లేడిని కోరిందో అమ్మ అప్పుడే కథ మొదలైంది కదా! లక్ష్మణుడు అలాంటిది ఉండదు తల్లీ సృష్టిలో అని చెబుతాడు. అది మాయ. అంతే కాదు, జనస్థానంలో ఉన్నాము. పంచవటి ఎక్కడ ఉన్నది? జనస్థానంలో ఉన్నది. ఇదంతా రాక్షస మాయ తల్లీ! మొన్ననే యుద్ధం చేసి 14 వేలమందిని సంహరించాడు శ్రీరాముడు. అంతకు ముందు శూర్పణఖ వచ్చింది. ఇప్పుడు ఇది (మాయలేడి) వచ్చింది. ఇదంతా మాయ అని చెప్పినా

అమ్మ ఏదో ఒక లాజిక్ చెబుతుంది కదా! నా కోసం కాదు అత్తగారి కోసం అని. అంతే అది వీళ్ళ వీక్ పాయింట్ కదా! అత్తగారి కోసం అంటే ఇంటాయన కొంచెం మెత్తబడతాడు. అత్తగారు ఇటువంటి లేడిని చూసిందా? ఇష్టపడిందా? కోరుకుందా? ఊరికే. మనకి నచ్చితే ఒక లాజిక్, నచ్చకపోతే ఒక లాజిక్. ధర్మం ఒకటి అంటూ ఉండదు. అదీ గోల.

శివుడు ధర్మ స్వరూపుడు. రాముడు ధర్మ స్వరూపుడు అయి ఉండటం చేత ఈవిడ ఏమీ వినే పరిస్థితిలో లేదు, మోహంలో ఉంది, పంపించేద్దాం అని పంపిస్తాడు. పంపిస్తే అక్కడ అది (అమ్మ వారి ఆత్మాహుతి) జరుగుతుంది. జరిగితే తనలో కోపం వచ్చింది కదా! తను శంకరుడే కదా! *"శంకరాయచ మయస్కరాయచ"* మయస్కరుడు అంటే తెలుసా? ఎంత రుద్రుడో అంత ఐసైపోతాడు అండీ! అంత చల్లదనం మనిషిలో. ఎంత చల్లదనం అంటే ఆయన రుద్రుడే అయితే మంచుకొండ మీద కూర్చుంటే మంచు కరిగిపోవాలి కదా! మరి హిమాలయాలు కరగవు. ఎందుచేత? అంతకన్నా చల్లటివాడట ఆయన. శివుడి చల్లదనం అందరికీ తెలియదు.

అమ్మ చల్లదనం తెలియవచ్చు. విష్ణువు చల్లదనం తెలియ వచ్చు. కృష్ణుడి చల్లదనం తెలియవచ్చు. శివుడి చల్లదనం అందరికీ తెలియదు. ఆయన చల్లదనమే చల్లదనం. అందుచేత మనం మూడు సార్లు చెబుతాం *"నమః శంకరాయచ మయస్కరాయచ"* అని. అంటే అత్యంత శీతలం. చలి కాదది. అమితమైనటువంటి సుఖం. మాటలలో చెప్పడానికి వీల్లేనంత. అలా ఉండేవాడు రుద్రుడై తనలో

నుండి వీరభద్రుణ్ణి పుట్టించి దేవతల్ని సైతం కొట్టించాడు కదా! ఎవరు కారణం? ఇంట్లోనే మొదలైయ్యింది కారణం. కాని పొరపాటు జరిగింది కాబట్టి అందరికీ చెయ్యవలసింది చేశాడు కాని అసలు కారణం ఎక్కడ నుండి పుట్టింది? ఈవిడ మోహంలో నుండి. ఇప్పుడు ఈవిడ తపస్సు చేస్తోంది అండీ మళ్ళీ. అంటే మీరు శివపరంగా చూడండి, మనం ఎంతసేపూ పార్వతి పరంగా చూస్తూ ఉంటాము కదా! ఏం అంత బెట్టా శివుడికి అని మనకి అనిపించవచ్చు కదా! కాదు. మళ్ళీ మోహం కలుగదు అనేంతవరకు తపస్సు జరగాలి అమ్మవారికి. ఇంకొకసారి మోహపడకూడదు ఈమె. తరువాత మళ్ళీ పార్వతీదేవి మోహపడిన పరిస్థితి లేదు.

అందుచేత ఆ తపస్సు అలా జరుగుతూ ఉండవలసినదే. తపస్సు జరుగుతూ ఉంటే స్పర్శ చేరుతూ ఉంటుంది. తెలిసిన విషయం కదా! స్పర్శ వస్తూ ఉంటే తనే వెళ్ళి పరీక్షిస్తాడు. జంగాల వాళ్ళ రూపంలో జడలు, విభూతి, రుద్రాక్షలు, కపాలాలు అన్నీ ధరించి వెళతాడు, ఢమ ఢమ ఢమ మ్రోగించుకుంటూ. ఎవరో వచ్చారు అని చూస్తుంది. శివపూజ చేస్తున్నావా తల్లీ! శివుని కోసమా అంటే అవును. ఎందుకు? అంటే శివుని చేరాలి అంటుంది. అంటే అప్పుడు ఈయన చెప్తాడు. అబ్బెబ్బే అస్సలు ఆయన మంచివాడు కాదమ్మా, వద్దు అంటాడు. ఎందుచేత అంటే లేశమాత్రమైనా ఈమెకు మోహ ముందేమో అని పరీక్షించడానికి వెళతాడు. ఆవిడ మళ్ళీ అంతకు ముందు తండ్రికి చెప్పినది. అదే తత్త్వము మన్మథుడికి చెప్తుంది. శివుడంటే ఏమిటో ఆ తరువాత గంధర్వులకు చెబుతుంది. శివుడంటే

ఏమిటో ఈయనకు కూడా చెబుతుంది. రావణుడు వచ్చి రాముడి గూర్చి దుర్భాషలాడుతూ తన గొప్పదనం, ప్రతాపము గూర్చి ఎంత చెప్పినా సీతమ్మవారు ఏమి చెబుతుందో అలాగే చెప్తుంది. చెప్తూ ఉంటే ఆయనకు దృఢమౌతుంది. ఇక ఇంకొకమారు ఇటువంటి పని మరల చెయ్యదూ అని (మోహ పడదు అని), అంచేత అనుగ్రహిస్తాడు. అనుగ్రహిస్తే సాక్షాత్తూ విష్ణువే దగ్గరుండి శివ పార్వతుల కళ్యాణం జరిపిస్తాడు లోక కళ్యాణంగా. పార్వతీ కళ్యాణం అయినంత మాత్రాన వెంటనే శివతేజం వస్తుందా? దేవతలకి రాదే! ఎందుచేత అంటే పార్వతి శివుణ్ణి పొందింది కామేచ్ఛతో కాదు. శివేచ్ఛతో శివుణ్ణి పొందింది.

బాగా సంస్కారవంతులైన వాళ్ళు పెళ్ళి అయిన చాలా రోజుల వరకు సంగమించరు. ఇవాళ సంగమించడం కోసమే పెళ్ళి కదా! ప్రస్తుతం ఉండే వారి సంస్కారం అలా ఉంది. ఋషుల, మహాత్ముల చరిత్రలు చూస్తే చాలాకాలం సన్నిహితంగా మెలగి, ఒకరియందు ఒకరు అనురాగం ఏర్పడ్డ సందర్భంలో కేవలం సంతానేచ్ఛ కలిగి అది ఒక యజ్ఞంగా నిర్వర్తించుకొని సంతానం పొందుతారే తప్ప, సంగమం కోసం పెళ్లి చేసుకోవడం అనేది మహాత్ముల యందు ఉండదు. పైగా వీరిరువురు ఎటువంటి వాళ్ళు? ఆవిడ ఎంత తపస్సు చేసింది? ఆయన ఎంత తపశ్శాలి? వారియొక్క తేజస్సంతా ఊర్ధ్వమే అయి ఉంటుంది. ఊర్ధ్వమే అయి ఉండటం చేత వారిద్దరూ కలసి తిరుగుతూ ఉంటారు. కలసి విహారాలు చేస్తూ ఉంటారు సృష్టి అంతా.

ఈ దేవతలందరూ వారి సంతానంకోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఎప్పుడు? ఎప్పుడు? ఎప్పుడు? అని. ఎప్పుడేమిటి అలా పదివేల దివ్య సంవత్సరాలు అయిపోతాయట. పోనీ ఊరుకుందామా వాళ్ళకి కలగకపోతే మనకేంటి అనుకుంటే తారకాసురు డొకడు ఉన్నాడు కదా. చీకటి బ్రతుకులై పోయినవి కదా! తారకాసురుడేమో మంట పెట్టాడు. ఉండే చోట సుఖం లేదు. సుఖాన్ని పొందడానికి ఒకే ఒక ఉపాయం ఉంది. ఆ ఉపాయానికి ఆవిడే కష్టపడి శివుని సాధించుకొంది. ఆవిడ ఎందుకోసం సాధించింది అంటే ఇందుకోసం, సంతానంకోసం కాదు, శివునికోసం కదా చేసింది. వీళ్ళకోసం కాదు. తన కోసం తను చేసింది. తాను శివసాయుజ్యం పొందడం కోసం చేసింది. ఆమెను అనుగ్రహించడం కోసం ఆయన అందుకున్నాడు ఆవిడని.

# 3

శివుడూ పార్వతి హాయిగా నాట్యం చేసుకుంటూ వుంటారు. ఎప్పుడూ నాట్యమే. అది ఆనందతాండవం! ఆపరు. లాస్యప్రియ కదా అమ్మవారు. ఆయనతో కూడి సరదాగా అలా వాళ్ళుండిపోతారు. అలా వుండగా బ్రహ్మాది దేవతలు ప్రార్థన చేస్తూ ఉంటారు శివుని గూర్చి. అందరూ కలసి తపస్సు చేస్తారు. ఈ తపోస్పర్శ ఆయనకు తెలుస్తూ ఉంటుంది. వీళ్ళకు ఏదో విపత్తు ఉందని, కొంచెం wait చెయ్యనీ అని. ఎందుకంటే ఒక్కోసారి పొరపాటు చేసినవాణ్ణి వెంటనే పైకి లేపితే వాడు మళ్ళీ తోక లేపుతాడు. ఒకసారి అహంకరించిన వాణ్ణి వెంటనే దగ్గరకు చేర్చుకోడు. అదే కదా ఇందాకటి ప్రశ్న. నెమ్మదిగా చేర్చుకుంటాడు. అలా వాళ్ళు తపస్సు చేస్తూ ఉంటే ఆయన పోన్లే పాపం అని కరుగుతాడు. అంత తేజస్సూ కరుగుతుంది. ఎందుకంటే రెండూ ఉన్నాయి ఆయన దగ్గర. కనుక దేవతల కోసం వారు తన తేజం, తన వీర్యం అడుగుతున్నారనే ఉద్దేశ్యంతో ఆ భావనను తను ధరిస్తా డండీ. ఆ భావన తను ధరించడం చేత తనలో వీర్యోద్భవం జరుగు తుంది.

ఆ వీర్యోద్భవం జరిగిన తర్వాత దానిని ఎవరికి అందించాలి? చెప్పండి? కొడుకు కావాలని తన భార్య కోరటం లేదు. కావాలను

కుంటే సంతోషమే కదా! దేనికి వీర్యోద్భవం జరిగింది? దేవతల యొక్క ఆరాధన కారణంగా జరిగింది. అందుచేత అది ఎవరు ఎవరు అందుకోగలరు? మీరందరూ ప్రార్థన చెయ్యడం వలన మీ ప్రార్థనకి ప్రతిస్పందనగా నా తేజస్సు నుంచి కరుణ చేత నేను ఈ వీర్యోద్భవం కావించాను. దీనిని ఎవరు అందుకుంటారు అని ప్రశ్న వేస్తాడు శివుడు. ఎవరు అందుకోగలరు? అప్పుడు దేవతలు అందరూ మళ్ళీ సంప్రదించుకొని, శివునికి కాస్త దరిదాపులలోనికి వెళ్ళగలిగింది అగ్ని కదా! శివుడు కొంచెం చల్లారితే అగ్ని. మరికొంచెం చల్లారితే వాయువు. మరి కొంచెం చల్లారితే సూర్యకాంతి తెలుసా? "అగ్నయే నమః వాయవే నమః సూర్యాయై నమః" అని ఆ వరుసలో చదువుతూ ఉంటాం హోమంలో కదా! "అగ్నయై స్వాహా। వాయవే స్వాహా। సూర్యాయ స్వాహా।" అగ్ని వాయువు సూర్యుడు అనేది అవరోహణ క్రమము ఆ తత్త్వానికి. అటుపైన 'ప్రజాపతయే నమః' ప్రజాపతి ఎక్కడున్నాడండీ. శివతత్త్వంతో పోలిస్తే వాడి ముని మనుమడి స్థానంలో ఉన్నాడు ప్రజాపతి! ఇవన్నీ ఎవరూ వ్రాసిపెట్టరు ఎక్కడా. మనం బాగా భావనతో చేస్తూ, దానిమీదే భక్తితో ఉంటే మనకి ఈ సమన్వయం దొరుకుతుంది. లేకపోతే ఈ సమన్వయాలు దొరకవు.

అందుచేత ఎంతటివాడు దక్షప్రజాపతి? అందుకనే కనికరించి ఏదో తప్పు చేశాడులే పాపం అని గొఱ్ఱె తలకాయ పెట్టేస్తాడు. ఇలా బ్రతుకుతూ ఉండమని. గుర్తొస్తుంది కదా అద్దంలో చూసుకున్నప్పు డల్లా. దక్షత్వం మనది కాదు, శివుడిది అని గుర్తుంటుంది దక్షుడికి ఆ తరవాత ఎప్పుడూ. మనలో కూడా అంతే. మనది కాదు ప్రయోజ

కత్వం. శివుడే ప్రయోజకుడు. శివుడు అంతర్యామి. దైవము పేరైదైనా పెట్టుకోండి. మనం పనిచేస్తే, వాడు చేసినట్టుగా మనం అనుకుంటే ప్రపంచం చూస్తూ ఉంటుంది తప్ప, మనం చేస్తే చూడదు.

అందుచేత అగ్నిని కోరుకుంటారు అందరూ. నువ్వు కాస్త ఏదైనా చేస్తే బాగుంటుంది దీనికోసం పూనుకొని అని. పూనుకుంటే బాగుంటుందని చెప్పడం సులభం తప్ప అదేమైనా సులభమైన విషయమా చెప్పండి. అగ్ని తన పుట్టుక స్థానం దగ్గరకు చేరడానికి లక్షణపరంగా కొంత అవకాశం ఉంది తప్ప, అటు ప్రక్కనించి తనని అనుగ్రహిస్తే తప్ప చేరలేడు. శివుడు ఎంత ఆగ్రహం కలవాడో అంత అనుగ్రహం కలవాడు కదా! అనుగ్రహం ఉండటం చేతనే వీర్యం ధరించాడు కదా! అందుచేతనే ఆ వీర్యం ధరించడానికి అగ్నిని అందరూ పురికొల్పుతారు.

రామాయణంలో హనుమంతుణ్ణి "నువ్వు తప్ప సముద్రాన్ని ఎవరూ దాటలేరు" అని పురికొల్పరూ! అలానే హనుమంతుని కథలో కూడా కుమార కథలోని సారూప్యం కనిపిస్తూ ఉంటుంది. హనుమంతుడు కూడా రుద్రుడే. ఆ అవతారమే కదా! అక్కడ నుండి వచ్చిన వాడే. కుమారుడూ అదే. అందువలన ఏ స్థితిని నువ్వు కుమారుని పూజించి పొందగోరావో ఆ స్థితి హనుమంతుని పూజించి కూడా పొందవచ్చు. దక్షిణాదిలో కుమారుడెక్కువ. ఉత్తరాదిలో హనుమంతుడు ఎక్కువ. ఇద్దరూ ఒక్కటే. ఈయనా సుబ్రహ్మణ్యుడే ఆయనా సుబ్రహ్మణ్యుడే. ఈయనా శివతేజమే ఆయనా శివతేజమే.

అందుచేత అగ్నిదేవుడు ఇక్కడ వాహిక. అక్కడ హనుమంతుడి విషయంలో వాయువు వాహిక. ఈ తేజాన్ని అందుకోవడానికి అగ్నిదేవుణ్ణి పంపిస్తారు. అగ్ని చాలా భక్తి వినమ్రతలతో జంకుతూ జంకుతూ వెళతాడు. ఏమో ఏమౌతుందో? చెప్పలేము కదా! అనుగ్రహమో, ఆగ్రహమో తెలియదు కదా! బాగా కోపం ఉన్నవాళ్ళకే చాలా అనుగ్రహం కూడా ఉంటుంది గుర్తుపెట్టుకోండి. అసలు కోపం రానివాళ్ళు dangerous . ఎందుచేత అంటే ఇది ఉన్న చోట అదీ ఉంటుంది. విష్ణువుకి అంత తొందరగా కోపం రాదు కదా, అందుకనే అంత సులభంగా అనుగ్రహించడు. శివుడికి ఎంత రౌద్రమో అంత అనుగ్రహం కూడా ఉంది. శివునికి కోపం తెప్పించడం ఎంత సులభమో మెప్పించడం కూడా అంత సులభమే. అందుచేత ఈ రెండోది కూడా ఉందనే ఆశతో అగ్నిదేవుడు తన మూలస్థానమునకు వెళ్ళడానికి సంసిద్ధుడౌతాడు.

ఇప్పటివరకు చెప్పుకున్న దాన్ని ఒక్కమారు పర్యాలోకనం చేసుకుని మరల కథలోకి ప్రవేశిద్దాం!

తారకాసురుడు సత్‌చిత్ ఆత్మగా ఏర్పడినటువంటి సృష్టికి అంతరాయంగా ఏర్పడతాడు. సత్యము చైతన్యమై ఆ చైతన్యము నుండి మహత్తు ఏర్పడి, ఆ మహత్తు నుండి మహదహంకారము ఏర్పడి, ఆ మహదహంకారము నుండి తామసిక అహంకారము, రజోగుణ అహంకారము, సాత్విక అహంకారము కూడా ఏర్పడి, ఆ మూడు అహంకారముల లోంచి జీవులు వారి వారి పూర్వ స్థితులను బట్టి

దిగివస్తూ ఉంటారు. ప్రళయానికి ముందు తమస్సుయందు దిగి యున్నటువంటి వారు ప్రళయమై మళ్ళీ సృష్టిలోకి దిగివచ్చినప్పుడు మళ్ళీ తమస్సులోనే పుడతారు. అలాగే ప్రళయానికి ముందు రజో గుణమునందున్న వారందరూ కూడా ప్రళయమై మళ్ళీ సృష్టి ప్రారంభ మైనప్పుడు రజో గుణములోనే పుడతారు. ఇవాళ రాత్రి పడుకున్నంత మాత్రాన ప్రొద్దున్నకి మారిపోరు కదా! అదే మనుషులు. ఒక రాత్రి కాదు. ఒక జన్మ కూడా అంతే. మార్పు తనకు తానుగా కోరి తెచ్చు కోకపోతే తమోగుణం తమోగుణంగానూ, రజోగుణం రజోగుణం గాను, సత్వగుణం సత్వగుణంగానూ, అలాగే గుణములకు అతీతమైన తత్వంలోనికి ప్రవేశించడానికి వీలుపడదు. అందుచేత జీవులు అలా పుట్టుకొచ్చారు. తమోగుణోపేతుడూ, రజోగుణోపేతుడూ, సత్వగుణో పేతుడూ ఇలా. వీరందరికీ కామము కూడా ఏర్పడింది. ఎందుచేతంటే కామము అంటే కోరిక అని అర్థం. అతడు కామేశ్వరుడు, ఆమె కామేశ్వరి.

ఈ కామము ఏర్పడటానికి కారణం ఇచ్ఛా పూరణము కొరకే. పరిపూర్ణత పొందుట కొరకే. 'కామి కానివాడు మోక్షగామి కాడు'. ఏ కోరికా లేనివాడు అలా రాయల్లే పడి ఉంటాడు. కోరడం తెలియాలి. ఏది కావాలో అది కోరుకోగలగాలి. ఏది కోరకూడదో అది తెలుసు కోవాలి. కోరవలసిన విషయాలను తెలుసుకొంటూ, అనుభూతి పరంగా ముందుకు సాగుతూ, తనని తాను పరిపూర్ణం చేసుకోవడానికి ఇచ్ఛాశక్తి సరైనటువంటిది. ఇచ్ఛాశక్తి లేనివాడికి ఏ కార్యక్రమము చెయ్యాలనే ఇచ్ఛే ఉండదు. తిని పడుకోవడమే ఉంటుంది. ఇచ్ఛ

విపరీతంగా ఉన్నవాళ్ళు చెలరేగిపోయి అక్కరలేని పనులన్నీ చేస్తూ ఉంటారు. కావలసినవి చేయరు. ఇచ్ఛ లేకపోవడమూ కాదు. విపరీతంగా ఉండటమూ కాదు. సమతూకంగా తను వృద్ధి చెంద టానికి వలసినటువంటి ఇచ్ఛగా అది మార్పు చెందాలి. బ్రహ్మదేవుడు చెప్పిన పద్ధతిలో క్రియాశక్తి. త్రిమూర్తులలో అతను క్రియాశక్తి. అతని నుంచి కుమారుడు పుట్టినప్పుడు జ్ఞానము, జ్ఞానశక్తి పుట్టుకొస్తుంది. అటుపైన రుద్రుడు ఇచ్ఛాశక్తిగా ఉంటాడు. వారు కొంతవరకు సృష్టికి ఆవరణ ఏర్పరుస్తారు. ఆ ఆవరణలో ఈ సృష్టి ఏర్పడి, ఆకాశము ఏర్పడి జీవులు ఆకాశరూపాలతో ఉంటారు. కోరిక ఉంటుంది. అంటే అప్పుడు జీవుడి పరిస్థితి ఏమిటంటే అతడు సహజంగా సత్య స్వరూపుడు. అతను చైతన్యవంతుడయ్యాడు. అతడు చైతన్యమై ఆత్మగా తయారయ్యాడు. ఇలా మూడు స్థితులతో ఏర్పడినవి 3 root races అంటారు.

జీవులందరూ బ్రహ్మములో నిదురపోయి ఉంటారు. తెలిసిన వారు మాత్రమే మేలుకొని ఉంటారు. సత్యమీమాంసులు. అటుపైన చైతన్యవంతులౌతారు. చైతన్యవంతులైనప్పటికీ కూడా ఇచ్ఛ ఉండదు. ఆత్మవంతులైన తరువాత 4వ స్థితిలో ఇచ్ఛ కలుగుతుంది. ఇప్పుడు ఈ తారకాసురుడు మొత్తం సృష్టి అంతా కూడా ఆవరించి, దేవతల కార్యానికి విఘ్నం కలిగించిన సందర్భంలో ఉన్న జీవులకు కోరిక ఉన్నది నిర్వర్తించుదామని, తాము ప్రత్యేకమైన జీవులుగా ఏర్పడి ఉన్నారు. తమయందు పరాప్రకృతి–పురుషుడు ఇద్దరూ ఉన్నారు. ప్రతీ జీవుడూ కూడా పరతత్త్వం, ప్రకృతి సమాహార ప్రజ్ఞగా జీవుడిగా

ఏర్పడతాడు. అలా ఏర్పడినవాడికి ఇచ్ఛ కలిగింది. ఇచ్ఛకు మార్గము లేదిక్కడ. ఇచ్ఛ ఎలా పుడితే అలా నిర్వర్తించుకోవడం లాగానే ఉంది. ఇంద్రుడైనా ఆ పనే చేస్తున్నాడు. అసురులైనా ఆ పనులే చేస్తున్నారు. ఋషులు కూడా కొందరు ఆ పనే చేశారు కదా దక్షయజ్ఞం అప్పుడు. దేవతలు కూడా అలాంటి పనే చేశారు. ఎలాంటి యజ్ఞానికి వెళ్ళాలి? ఎలాంటి యజ్ఞానికి వెళ్ళకూడదు? యజ్ఞం అనగానే వెళ్ళి పోకూడదు. యజ్ఞపురుషుడికి భాగం లేకుండా జరిగే యజ్ఞం ఏమిటి? అహంకారంతో చేసే యజ్ఞానికి వెళ్ళకూడదు. భక్తి శ్రద్ధలతో, వినయంతో చేసే యజ్ఞానికి వెళ్ళాలి. ఇలా కొన్ని కథలు జరిగి పోయినాయి అప్పటికి.

ఏం జరిగిందంటే కామానికి బుద్ధి యొక్క తోడు లేదు. పై లోకాలలో సత్యవంతులకి, చైతన్యవంతులకీ మాత్రము ఏర్పడి ఉండే త్రిమూర్త్యాదులు, సనక సనందనాదులు, ఇత్యాదులు వారికీ ఋషు లకు, తెలిసిన వారికీ చాలా మటుకు జీవులు ఉన్నారు, కోరిక ఉన్నది. మనకు కూడా ఇప్పుడు వాళ్ళే ఎక్కువ. ఏ కోరిక కలిగితే ఆ కోరిక నిర్వర్తించుకోవడానికే ఎక్కువగా జీవులు కనిపిస్తూ ఉంటారు. బుద్ధి ఉండదు. బుద్ధిహీనత కలియుగంలో జీవులలో చాలా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఏమనిపిస్తే అది చేసేస్తూ ఉంటారు. 'ఇది ఎలా చెయ్యాలి?' అనేది అక్కరలేదు. 'ఎందుకు చెయ్యాలి?' అనేదానికి సమాధానం ఉండదు. ఆ చెయ్యడంలో ఎక్కువ తక్కువలు. ఏదో చేసేస్తూ ఉంటారు. మనం నేర్చుకునే చదువులు కూడా ఈ రకమైన జ్ఞానాన్ని ఇచ్చేటట్టు లేవు. అట్లా వేగంగా పరిగెత్తుతూ పోవడమే!

ఎంతో వేగంగా పరిగెత్తడం, ఎక్కువగా మార్కులు తెచ్చుకోవడం. ఇదొక విద్యగా ఒక భయంకరమైన భ్రమ ప్రపంచంలో ప్రస్తుతం నడుస్తూ ఉన్నది తప్ప, ఇప్పుడు బాగా చదువుకున్న వాళ్ళంతా తెలిసినవాళ్ళు కాదు. నిజానికి వాళ్ళకు ఏమీ తెలియదు. ప్రాథమికమైన విషయాలు కూడా తెలియకుండా పెద్ద పెద్ద చదువులు చదువుకొని, పెద్దవాళ్ళం అనుకునే వాళ్ళు చాలామంది ఉన్నారు ఇప్పుడు. ఇది ఎందుచేత అంటే బుద్ధి లేకపోతే రాదు.

కాబట్టి ఈ తర్వాత లోకాలు ఏర్పడినప్పుడు ఈ కామము అనేదాన్ని నిర్వర్తించడానికి మనోలోకము, ప్రాణమయ లోకము, భౌతికలోకము ఇంకా ఏర్పడాలి. ఇవి ఏర్పడినప్పుడు బుద్ధి లేకుండా జీవులు అందులోనికి దిగితే అది ఎంతో ప్రమాదకరం. అందుచేత శివతేజం తనంతట తానుగా దిగివచ్చినప్పుడు ఆ సంకల్పం చేస్తుంది. ఏమిటా సంకల్పం అంటే, ఇప్పుడు నానుండి దిగివచ్చే తేజముందే అది బుద్ధిని ప్రసాదిస్తుంది అందరికీ అని. బుద్ధి ప్రదాతగా అందుకనే *'నమః శివాయ'* అనే పంచాక్షరిని మనం అక్షరాభ్యాసంలో వ్రాయిస్తాం. మిగతావి మనం ఎందుకు వ్రాయించం అంటే మొత్తం జగత్తుకి గురువు శివుడు. ప్రభువు విష్ణువు. అలా అమరిక. విష్ణువు ప్రభువు, పరిపాలిస్తాడు. శివుడు గురువు, శిక్షణ ఇస్తాడు. అంచేత *'ఓం నమః శివాయ'* అని వ్రాయిస్తాం. (దక్షయజ్ఞమందు చూశాదు కదా శివుడు. ఋషులు, దేవతలూ ఎలా ప్రవర్తించారో? అది బుద్ధిహీనతే కదా!) అంచేత సృష్టిలో బుద్ధి అనే ప్రజ్ఞ శివుని నుండి అగ్ని ద్వారా దిగిరావడం

అనేది ఒక మహత్తరమైన ఘట్టం. అందుకే 'కుమార సంభవం' అంత పుణ్య విశేషం కలిగినటువంటిది.

కుమార సంభవం, కుమార సంభవం అని చాలామంది చెప్పుకుంటారు కానీ కుమారసంభవం అంటే ఏమిటో తెలియదు. 'కుమార సంభవం' కాళిదాసు మహాకవి చాలా అద్భుతంగా వ్రాశాడు. కాళిదాసు వ్రాసింది సంస్కృతంలో, నేను చదవలేదు. తెలుగులో ఉన్నది చదివాను. ఆయన కవిత్వంలో చాలా వర్ణన ఇచ్చి వ్రాశారు. ఋతు వర్ణనలు బాగున్నాయి. అమ్మవారు, అయ్యవారు విహరించిన విధానాలు, అక్కడ ఉండేటటువంటి సృష్టి, దానియొక్క అవగాహన. కాళిదాసుకు సృష్టి అవగాహన మెండు. అందుచేత మహత్తరమైన పద్ధతిలో కావ్యరచన సాగింది. కుమారుడెలా పుట్టాడో వ్రాశారు.

కుమారుడు పుట్టినప్పటి దివ్యమైన సంకల్పం ప్రస్ఫుటంగా మనకి తెలియాలంటే మేడమ్ హెచ్.పి. బ్లావెట్స్కీ వ్రాసిన 'Secret Doctrine' చదువుకోవాలి. చాలామంది 'Secret Doctrine' చదివాము అంటారు కాని వాళ్ళు సరిగ్గా చదవలేదని నేను గుండెలమీద చెయ్యివేసుకొని చెప్పగలను. 'Secret Doctrine' చదవాలన్నా, భగవద్గీత, భాగవతం, రామాయణం, భారతం చదవాలన్నా పెద్దల అనుగ్రహంతో చదవడం అనే పద్ధతి ఒకటి ఉన్నది. మనకి భాష వచ్చని చదువుకోవడం ఒక పద్ధతి. జ్యోతిషము, నిరుక్తము, కల్పము, ఛందస్సు, వ్యాకరణము, శిక్ష అనే షడంగాలు అధ్యయనము చేయని వారికి వేద వాఙ్మయము, పురాణేతిహాసములు అయోమయంగా గోచరిస్తాయి. సమన్వయం దొరకదు.

## 4

'Secret Doctrine'లో 'The Sons of Will' అని ఒక అధ్యాయం ఉంది చదువుకోండి. 'The Descent of Kumaras' అని అందులోనే ఉంటుంది. అందులోనే 'The Descent of Fire as Kumara' అని ఉంటుంది. "The Sons of Fire, The Sons of Will, The Sons of Buddhi, The Kumaras" అంటూ వివరంగా బ్లావెట్‌స్కీ వ్రాసుకొని వస్తుంది. ఆ ఘట్టం జీవులకు కామేచ్ఛ కలిగిన తరువాత ఇది లేకపోతే ఈ జీవులందరూ మళ్ళీ పుట్టి ఏమి ఉపయోగం? ఈ జీవులు పుట్టిన దగ్గర నుండి మనిషి తాను చనిపోయే వరకూ కామపూరణమే చేసుకొంటూ ఉంటాడు. కోరికలు నిర్వర్తించు కోవడం కోసమే జీవిస్తాడు తప్ప, బుద్ధిని దానితో జతపరచి పనులు నిర్వర్తించుకోవడం అనేది లేకపోవడం వల్ల వృద్ధి ఉండదు. బుద్ధి లేకపోతే వృద్ధి ఉండదు. చేసే ప్రతి పనికీ బుద్ధి తోడై ఉండాలి. అందుచేత పరమాత్మ. ఇందాకటి నుండి శివతేజం అని చెబుతున్నానే దానిని అంతర్యామిగా తీసుకోండి. అదే భాగవతంలో చెబితే 'విష్ణువు' అని చెబుతా. ఇంకొకసారి ఎక్కడైనా అమ్మవారి గురించి చెబితే అదంతా 'అమ్మవారని' చెబుతా. అదేంటండీ అప్పుడు అలా చెప్పారు అని అనుకోవద్దు. ఇప్పుడెట్లా 'కుమారుడు' పుట్టాడని కథ చెబు

తున్నామో అదే కథ 'ప్రద్యుమ్నుడు' పుట్టినప్పుడు కూడా చెప్పుకో వచ్చు. ఎందుకంటే వైష్ణవ సంప్రదాయంలో చెప్తే బుద్ధి ప్రద్యుమ్న ప్రజ్ఞ. శివపరంగా చెబితే కుమార ప్రజ్ఞ. ఆ మతం పరంగా చెబితే దైవకుమారుడు అని చెప్పవచ్చు. కదా! So దైవ కుమారుడు ఎవరు అవుతారంటే సతతము బుద్ధి యందు ఉండేవాడు దైవకుమారు డౌతాడు. బుద్ధియందు స్థిరపడినవారికి ఆత్మ, పరమాత్మ లోకాలు, మనో, ఇంద్రియలోకాలు సులభంగా, స్పష్టంగా అవగాహన అవుతాయి. వారికి తికమక ఉండదు. అట్టివారే కుమారుడు, గణపతి, హను మంతుడు, ప్రద్యుమ్నుడు, యోగీశ్వరులు, సిద్ధులు, ఋషులు, మునులు.

బుద్ధిలో కూర్చోకుండా కార్యక్రమాలు చేసేవాడు అలా గింగరాలు తిరుగుతూనే ఉంటాడు సృష్టిలో. ఇది తెలిసి శివుడు తారకాసుర సంహారం అనే కాకుండా తరువాత ఏర్పడే లోకాలున్నాయే సృష్టిలో అంటే మనోమయ లోకం, ప్రాణమయ లోకం, ఇంద్రియ లోకం, భౌతిక లోకాలలో కూడ సమన్వయం కూర్చుతాడు. కుమార తత్త్వం షట్చక్రములందు వ్యాప్తి చెందుతుంది కదా! (ఇవన్నీ ఎక్కువ పదార్థం, తక్కువ ప్రజ్ఞ ఉంటాయి.) పై లోకములలో ఇలా ఉంటే పరిస్థితి ఇక క్రింది లోకాలలో ఎలా ఉంటుంది. అందుచేత వారందరి క్షేమము శ్రేయస్సు సంకల్పించి దానిని (కుమార ప్రజ్ఞను) ఏర్పాటు చేస్తాడు. ఆత్మ, బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, ప్రాణము, శరీరము అంతట నిట్టనిలువుగ వెన్నెముక యందలి చైతన్యముగ శివతేజము ఏర్పడుతుంది. ఆజ్ఞ నుండి మూలాధారం వరకు నిలువుగా మన సుషుమ్నయందు శక్తిరూపమై ఏర్పడుతుంది. కనుక దిగువ లోకము

లలో తమస్సు అంటే చీకటి, అంటే తారకాసురుడికి చోటు లేకుండా పోతుంది. కనుక కుమారుడు శక్తిధరుడని పిలువబడ్డాడు.

ఆరు లోకాలలో అతడు వ్యాప్తి చెందటమే ఆరుగురు కృత్తికలకు కుమారు డవటం. షణ్ముఖు డవటం. అప్పటి కథ ఏమవుతుంది అంటే అగ్ని శివుని దగ్గరికి చేరతాడు. ఈ లోపల కొన్ని వేల సంవత్సరాలు తారకాసురుని వలన బాధలు, దేవతలు చేసినటువంటి తప్పిదాల వల్ల కర్మ క్షాళణము ఇవన్నీ జరుగుతాయి. ఇంతకు ముందు దక్షయజ్ఞం, ఇంద్రుడు చేసిన పనులు, ఇవన్నీ కలిపి ఒకసారి వీళ్ళందరూ అసుర పాలనలో మునుగుతారు. సరే ఈయన, అగ్నిదేవుడు శివతేజాన్ని గ్రహించటానికి భయం భయంగానే వస్తాడు. అందుకోగలవా అన్నట్లు చూస్తాడు శివుడు. ఎందుచేత అంటే ఇక మళ్ళీ తనకు పని లేకుండా చూసుకుంటాడు శివుడు.

అందుచేత అందుకోగలవా! అంటే, అందుకోవాలనే ఉంది స్వామీ! ఆ ఉద్దేశ్యంతోనే వచ్చాను అంటాడు అగ్ని. నీకు చేతనైనంత అందుకో అంటాడు శివుడు. చేతనైనంత తేజం అందుకోలేకపోతే ఏమౌతుంది? అంటే అగ్ని కదా! ఎంత పవిత్రమైనటువంటివాడు, ఎంత తేజోవంతుడు, అతనిలో తేజస్సు శివుడే. నా శాయశక్తులా నీ అనుగ్రహం చేత ఎంత అందుకోగలిగితే అంత అందుకుంటాను అని చెబుతాడు, అందుకుంటాడు. అందుకుంటే అందులో చాలా భాగం క్రింద పడిపోతుంది. క్రింద పడ్డది ఈ భూమికి ఉత్తర భాగంలో పడుతుంది. ఉత్తర భాగంలో పడి అదంతా శ్వేతద్వీపంగా ఏర్పడు

తుంది. ఆ ద్వీపంలో ఉండే వాళ్ళందరి పైనా కాలప్రభావం ఉండదు. వారి మీద ప్రకృతి ప్రభావం, మాయా ప్రభావం కూడా ఉండదు. అలాంటి వాళ్ళంతా చేరతారు ఈ భూమిమీద. వారిని శ్వేతద్వీప వాసులు అంటారు.

అలా శ్వేతద్వీపం ఈ భూమిమీద ఏర్పడిపోతుంది. అక్కడ ఒక శ్వేత పర్వతం కూడా ఏర్పడుతుంది. దాన్ని ఇప్పుడు పుష్కర ద్వీపం అంటారు. అది భూమికి ఏడో కక్ష్యలో ఉంటుంది. మనం వెతుక్కుంటే కనబడదు. మనం సహస్రారంలో నివసించడం అనేది మనకి శాశ్వతమైపోతే, భూమి మీద అప్పుడు శ్వేతద్వీపంలో ఎలా ఉంటుంది అనేది మనం దర్శించవచ్చు. శ్వేతద్వీపవాసులతో మనం సంభాషణాదులు జరుపవచ్చు. లేకపోతే మనకి వారికి అసలు సంబంధం ఉండదు. వారు భూమిపై దివ్య ప్రణాళిక నవతరింప జేయటానికి ఊర్ధ్వలోకాలనుండి అక్కడ చేరి ఉంటారు. భూమిపైగల గురుపరంపరకు కూడ అందుబాటులో ఉంటారు. ఈ పుష్కర ద్వీప ప్రజ్ఞయే అప్పుడప్పుడు మన జీవనదులను స్పృశిస్తున్నట్లు గమనించిన ఋషులు, మనకు నదీ పుష్కరాల నేర్పరిచారు. పుష్కర నదీజలాలలో లభించేది శివతేజ స్పర్శయే!

అలా శివతేజం పడిపోతుంది. జాగ్రత్తగా అందుకుంటావా, అందుకుంటావా అని ఇటు ప్రక్క నుండి శివుడు అందిస్తూ ఉంటే– జాగ్రత్తగా అందుకుంటాను, అందుకుంటాను అనుకుంటూ అందు కొంటుంటే కొంత కింద పడిపోతుంది. మిగతాది పట్టుకుంటాడు.

పడిపోతే పడిపోయింది ఎందుకంటే అది శివతేజం కదా! ఎక్కడ పడితే ఆ ప్రదేశం అంతా పవిత్రమైపోతుంది కదా! శివమైపోతుంది.

ఆ శ్వేతద్వీపంలోనే శంబళ గ్రామం కూడా ఉంది. శంబళ గ్రామాన్నే కుమారాంశ ఉత్తరోత్తరంలో భూమిపై తన నివాసాలలో ప్రధాన నివాసంగా ఏర్పరుచుకొని మన పరిణామంకోసం అహర్నిశలు కృషి సలుపుతూ ఉన్నాడు. అదలా ఉండగా అగ్ని అలా శివతేజాన్ని పట్టుకొని వస్తూ ఉంటే దాన్ని భరించడం చాలా కష్టం అయ్యింది. వేడి వేడి విషయం ఎంతసేపు పట్టుకోగలడు. అందుకని అలా వస్తూ ఉంటే అందులోంచి కొంచెం కొంచెం తొణికిసలాడి చిందుతూ ఉంది. అట్లా అది ఏడు చిందులు వేస్తుంది. అవి ఏడు జ్వాలలుగా వస్తాయి. *'సప్త జిహ్వాయ నమః'* అంటూ ఉంటాము కదా! సప్త జిహ్వాలు కూడా కుమార సంభవంలో ఏర్పడినవే అగ్నికి. ఏడు అలా తొణుకుతున్నటు వంటి సమయంలో ఆయన కృత్తికా మండలంలో ఉంటాడు. కృత్తికలు ఎంతమంది? ఆరుగురు. వారు ఎవరు? సప్తర్షుల ఆరుగురు భార్యలు. ఏడో ఆవిడో? ఆవిడ కృత్తికా మండలంలో కాక సప్తర్షి మండలంలోనే ఉంటుంది. సప్తర్షి మండలంలో అరుంధతిని చూపిస్తారు కదా! మిగతా ఆరు నక్షత్రాల క్రిందా ఇలా అరుంధతి కనబడినట్టుగా కనబడదు. అంటే సప్తర్షులలో వశిష్ఠ మహర్షి యొక్క భార్య అరుంధతీ దేవి వశిష్ఠుడితో పాటే ఉంటుంది. మిగతా ఆరుగురికీ వేరే భవనాలు ఉన్నాయి. వాళ్ళు కృత్తికా మండలంలో ఉంటారు. సప్తర్షులతో కలసి ఉన్నా కృత్తికా మండలంలో వాళ్ళు ఉంటారు. వాళ్ళు చూస్తారు ఈ తేజం క్రిందకు తొణకడం. ఇది ఎంత

అందమైనదో అంత ఆకర్షణీయమైనది, తేజోమయమైనది. ఆ తేజమే కృష్ణుడిలా అందరినీ అల్లరి పెట్టినది.

ఎప్పుడైతే ఈ ఏడు జ్వాలలను ఆ కృత్తికలు చూస్తారో అందులో ఆరు జ్వాలలు ఈ ఆరుగురు కృత్తికలనూ ఆకర్షిస్తాయి. ఈ అగ్ని దేవుడిలో కూడా తేజస్సు యొక్క by product (సహలక్షణం) ఆకర్షణ ఉంటుంది. వర్చస్సు తేజస్సు. ఆ తేజస్సు వలన అతడు కూడా వారియందు ఆకర్షణ పొందుతాడు (అగ్నిదేవుడు). అది చూసి అగ్ని దేవుని భార్య స్వాహాదేవి తానే ఆ ఆరుగురు కృత్తికల రూపాలు ధరించి అగ్నిదేవునికి ఆ ఆకర్షణకు తగినటువంటి తృప్తిని కలిగిస్తుంది. అలా ఒక కథ. ఇంకొక కథ ఏమిటంటే ఈ ఆరుగురికి ఆకర్షణ కలగడం చేత నీలాపనిందలు కలుగుతాయి కదా! సప్తర్షి భార్యలకు నీలాప నిందలు కలిగాయి అని మనం 'వినాయక చవితి' కథలో చదువు కుంటాము. అగ్నిని చూసి మోహించారు అని చెబుతారు. అగ్నిని మనం ఎప్పుడూ చూస్తూనే ఉంటాము. హోమాలలో కూడా చూస్తాము.

మోహం కలిగేటప్పటికి ఈ ఋషులు ఎంతసేపు హోమం చేసినా అగ్ని ప్రజ్వరిల్లదు. అగ్నికి మోహం, కృత్తికలకు మోహం. అగ్ని ప్రజ్వరిల్లడానికి సంబంధించిన యోగశక్తి మృగ్యమౌతుంది. హోమజ్వాలలు ఇలా ఉన్నాయేమిటి అని ఋషులకు అనుమానం వస్తుంది. కళ్ళు మూసుకొని చూడగలరు కదా! చూస్తే వాళ్ళకు కారణం తెలుస్తుంది. వాళ్ళకేదో ఒక కినుక వస్తుంది. వస్తే ఈ కృత్తికలు సమర్థులు కాబట్టి వారు నీలాపనిందలు తప్పించుకుంటారు. అది వినాయక చవితి కథ.

ఇక మన కథలోకి వస్తే ఈ అగ్నిదేవుడు ఇలా వస్తూ ఉంటే ఆయన భావనకు స్వాహాదేవి ఆ విధంగా పరితృప్తి కావించితే– బ్రహ్మదేవుడు అడుగుతాడు, తెచ్చావా? అని. ఎందుకంటే కొంత ముందే పోయింది. మిగతాది తెచ్చాడు. దీన్ని ఎక్కడ దింపమంటావు చెప్పు, భరించ లేకపోతున్నాను అంటాడు. భరించలేక పోవడం ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఎక్కడో ఒక చోట నిక్షిప్తం చెయ్యాలి కదా అంటే, భూమిపై తూర్పు కొండల్లో రెల్లు ఉన్నది, అక్కడ దింపు అంటాడు. రెల్లు అంటే దర్భ. దర్భ అన్ని చోట్లా దొరకదు. గడ్డి అన్ని చోట్లా ఉంటుంది. దర్భ పవిత్రం. ఎందుకంటే దానికి శివస్పర్శ ఉంటుంది.

భూమికి అగ్నిదేవుడు దిగివస్తుంటే దారిలో గంగాదేవి కనిపిస్తుంది. కనిపించి విషయం అడిగితే అగ్ని చెబుతాడు, నా వల్ల కాదు దీనిని భరించడం, నీ దగ్గర వదిలేస్తాను. నువ్వు కూడా ఆ దారిలోనే వెళుతున్నావు కాబట్టి, ఈ తేజాన్ని నీవు తీసుకొని భూమికి వెళ్ళు అంటాడు. ఆవిడ చాలా సంతోషంగా ఒప్పుకుంటుంది. అలా గంగాదేవిలోనికి శివతేజం ప్రవేశిస్తుంది. గంగలో శివతేజం ప్రవేశించడం వల్ల గంగ పవిత్రమైనది. విష్ణు పాదం నుంచి పుట్టి పవిత్రం అవ్వడం అనేది ఉండటం, తరువాత శివతేజం ప్రవేశించడం వలన కూడా గంగ పవిత్రమౌతుంది. గంగకు ఏ భయంకరమైన పాపాన్నయినా కడిగివేయగల శక్తి ఈ శివతేజాన్ని పట్టుకొని వెళ్ళడం వల్ల వస్తుంది. గంగ ఆ తేజాన్ని పట్టుకొని హిమాలయాల నుండి క్రిందికి వస్తూ ఉంటే ఆమెకు కూడ ఇంక నేను భరించలేను అనే పరిస్థితి వస్తుంది.

# 5

శివతేజాన్ని అగ్ని భరించలేక గంగకు అందించగా ఆమె కూడ భరించలేకపోతుంది. దీనిని ఏమి చేయాలి అని ఆలోచిస్తుంటే రెల్లుపొదలలో తేజాన్ని వదలమని బ్రహ్మదేవుడు చెప్పిన విషయం గంగకు చెబుతాడు అగ్ని. హిమాలయాల్లో ఉండే రెల్లుపొదలలో ఆమె ఆ తేజాన్ని వదిలేస్తుంది. ఆ తేజం ఆరు భాగాలుగా రెల్లులో పడి వుంటుంది. రెల్లును 'శరవణము' అని అంటారు. అలా శివపుత్రుడు, పార్వతీపుత్రుడు, అగ్నిపుత్రుడు, గంగాపుత్రుడు, కార్తికేయుడు, శరవణభవుడు అనే నామాలు కుమారునికి ఏర్పడతాయి. ఆరు భాగాలుగా ఏర్పడి ఏకస్థితి పొందుతాడు. అంటే ఆరు తలలు, ఒక శరీరము, పండ్రెండు చేతులు. కాబట్టి ద్విషడ్భుజుడు, షణ్ముఖుడు.

ఆరుగురు కృత్తికలు ఆ పసివానిని చూసి ఆనందపడి కృత్తికా లోకానికి కొనిపోయి గంగాదేవితోకూడి పోషిస్తారు, కాబట్టి కార్తికేయు డైనాడు. భూమిపైకి దిగి షణ్ముఖుడు అవటంచేత భూదేవి తన పుత్రునిగా కూడా భావించటం ప్రారంభించింది.

అలా కుమారునికి నవ (9) మాతలు ఏర్పడతారు. 1. పార్వతీ దేవి, 2. గంగాదేవి, (3 – 8) ఆరుగురు కృత్తికలు, 9. భూదేవి. అందరికీ ఆ పసివాడంటే మాతృవాత్సల్యమే!

ఇందలి రహస్యం ఏమిటంటే శివతత్త్వము 9 ఆవరణలలో కుమారునిగా వ్యాపించిందని. అంటే పరతత్త్వము జీవతత్త్వముగా శుద్ధ చైతన్యము, మూడు గుణములు, పంచభూతములందు అవత రించిందని. నిజానికి మనమందరము కుమారులమే. శివాంశలమే! కాకపోతే శివజ్ఞానము (బుద్ధి, వివేకములు) కోల్పోయాము.

ఆ తేజం ఒక శిశువుగా ఏర్పడి రెల్లుపొదలలో రోదనం చేస్తుంది. ఈ హిమాలయాల్లోనే ఆరుగురు కృత్తికలూ తిరుగుతూ ఉంటారు. వారు ఈ శిశువుని చూడగానే వారికి స్తనములలో క్షీరము ఏర్పడుతుంది. ఎందుచేత అంటే అంతకు ముందు ఆ భావన వారిలో కలిగింది ఆ తేజాన్ని చూచినప్పుడు. చూడగానే స్తనములలో క్షీరమెలా ఏర్పడుతుంది అంటే, వారు చూపుతోనే దానిని అనుభవిస్తారు కాబట్టి. అందుచేత దానిని మరల చూడగానే వారికి మాతృవాత్సల్యము కలిగి ఆరుగురూ నేనంటే నేనని పాలు ఇవ్వడానికి వెళతారు. వెళితే ఆ పిల్లవాడు చతుర్ముఖుడై తరువాత ఆరు ముఖములు కలవాడై ఆ ఆరుగురు తల్లుల క్షీరము ఒకేసారి కుడవడం జరుగుతుంది. ఆరుగురి దగ్గర అంటే ఒక శిశువు పుట్టగానే నాలుగు ముఖాలు, ఆరుగురిని చూడగానే ఆరుముఖాలు అయ్యాయి అంటే అది యోగశక్తి. అంటే దిగి వచ్చింది యోగశక్తి, యోగబలం, శివశక్తి. అది దిగివచ్చి ఆరుగురు స్తన్యాలు గ్రోలి కొంత శాంతిస్తాడు. అప్పుడు ఈ వార్త గంగ నుండి అగ్నికి, అతని నుండి బ్రహ్మకి, బ్రహ్మ నుండి శివపార్వతు లకు తెలుస్తుంది. ఆ కుమారుడు, అతని తేజస్సు, ఆకృతి, ఆకర్షణ

'న భూతో న భవిష్యతి'. అంటే అలాంటిది అంతకు ముందెప్పుడూ జరగలేదు, ఇక ముందు ఎప్పుడూ జరగదు.

అది అందరూ చూడాలని వస్తారు. ప్రతీవారూ నా కుమారుడు అంటే నా కుమారుడు అంటారు. ఎవరి కుమారుడు అనే ప్రశ్న. శివుడిపై ఉత్సుకత కొద్దీ పార్వతి మొదటగా ఇతను నా బిడ్డ అంటుంది. ఎందుకంటే నేను (పార్వతి) శివుణ్ణి చేరి, శివునితో కూడి రసక్రీడ చెయ్యడం వలన కదా ఈయన పుట్టినది. అందుకు ఇతడు నా కుమారుడే అంటుంది. అగ్నిదేవుడు నేను చాలా బాధలు పడ్డాను. నాకు చేతనైనంత వరకు వీడిని తీసుకొని వచ్చాను తల్లీ! అందుకని వీడు నా కుమారుడు అంటాడు. గంగ నా ప్రవాహంలో తెచ్చి రెల్లు పొదలలో వదలివేశాను. ఇతడు నా కుమారుడు అంటుంది. కృత్తికలు మేము క్షీరమిచ్చాము కాబట్టి మా కుమారుడు అంటారు. భూమిపై పుట్టాడు కాబట్టి నా పుత్రుడు అంటుంది భూదేవి. ఇంతమంది అడుగగా లేనిది నేను Claim పెడితే తప్పేంటి అని, నాలో ఈ తేజం వదలబడింది, కాబట్టి ఇతను నా కుమారుడు అంటుంది రెల్లు. ఇట్లా అందరూ మా కుమారుడు అంటారు. శివకుమారుడు, పార్వతీ తనయుడు, అగ్ని కుమారుడు, గంగాసుతుడు, కృత్తికా నందనుడు, శరవణ (రెల్లు, దర్భ) భవ (పుట్టినవాడు).

ఆ కుమారుడు ఆరు ముఖాలతో కనబడగానే ఆరుపేర్లూ శివుడు నిర్ణయం చేస్తాడట. అవేంటంటే

1) ముందు కృత్తికలు – **కార్తికేయుడు**

2) ప్రవాహంలో తీసుకొని వచ్చావు కాబట్టి నీవు **'కుమారా'** అని పిలుచుకో (గంగ).

3) పార్వతికి, నీవు నేను రసానుభూతి యందుండగా ఉద్భవించిన సమన్వయ తేజము. మన నుండి విడిగా ఏర్పడినాడు గనుక నీవు **స్కందుడని** పిలుచుకో!

4) అగ్నికి, అతనిని నీవు **'మహాసేనుడిగా'** భావన చెయ్యి అని చెబుతాడు.

5) ఈ శరవణములకు **శరవణభవునిగా** భావన చెయ్యండి అని చెబుతాడు.

6) అప్పుడు వారంతా మాకు ఈ నామాలు చెప్పావు. నువ్వు ఏమని భావన చేస్తావు అని అడిగారు. అప్పుడు ఆయన నా కతడు **'గుహుడు'** అని చెబుతాడు. ఎందుకంటే అది (కుమారుడు) నా యందు గుహ్యముగా ఉన్నటువంటి తత్త్వమేగా అంటాడు.

(మీరంతా మాస్టర్ ఇ.కె. గారి 'పురాణ పురుషుడు' చదువు కుంటే దానిలో శైలపుత్రి తాను సింహంతో వస్తూ గుహలో నుండి 5 ఏళ్ళ పిల్లవాణ్ణి తీసుకొని వస్తుంది. ఇతడెవరు అంటే గుహుడు (శివ కుమారుడు). ఇతడే కృష్ణుడిగా పుడతాడు. పుట్టి మీ కష్టాలు తీరుస్తాడు అని ఋషులకు, పరమగురువులైన మైత్రేయుడు మొదలైన వారికి చెబుతుంది. ఇతడు పుట్టి ధర్మ సంస్థాపన చేస్తాడు ద్వాపర కలి సంధిలో. ఈయన రావాలి అంటే మామూలు శరీరం పని

చెయ్యదు, అప్రాకృత శరీరాన్ని తయారు చెయ్యండి అని వారికి చెబుతుంది.)

ఆ విధంగా ఆరుగురు వస్తారు. అందరూ సంతోషిస్తారు. ఆరు తలకాయలు ఉంటాయి. ఆరు తలకాయలూ ఏమిటో తెలుసా? ఆరు లోకాలు. ఆరు లోకాలలోనూ ఇక వెలుగుకి ఇబ్బంది లేదు. భౌతిక లోకంలో గాని, ప్రాణమయ లోకంలో గాని, మనోమయ లోకంలో కానీ, విజ్ఞానమయ లోకంలో కాని, ఆనందమయ లోకంలో గాని ఆత్మ లోకంలోగాని – ఇవే ఆరు లోకాలు.

| | | |
|---|---|---|
| భౌతికం | → | స్వాధిష్ఠానం |
| ప్రాణమయం | → | మూలాధారం |
| మనోమయం | → | మణిపూరకం (బొడ్డు) |
| విజ్ఞానమయం | → | విశుద్ధి |
| ఆనందమయం | → | హృదయం (అనాహతం) |
| ఆత్మ | → | ఆజ్ఞ |

ఈ ఆరులోకాలలో ఏమైనా సరే ఇక మీరు నా వరకూ రానక్కరలేదు అని చెప్పడానికి శివుడు "కుమార సృష్టి" చేస్తాడు. కుమారుని వల్ల ఈ ఆరు లోకాలలోనూ వెలుగుకి ఇబ్బంది లేదు. ఈ ఆరు లోకాలలోనూ ఆయనను తలుచుకుంటే వెలుగు వస్తుంది. అసురులను జయించి, వెంటనే మనలను వెలుగులో స్థిరపరుస్తాడు. ఈ ఆరులో అతడు వ్యాపించి ఉంటాడు. ఆరుగా ఉంటాడు. ఆరింటి

లోనూ అతడిని పోషించేది ఆరు కృత్తికా కేంద్రాలే. మనలోని షట్పద్మములు అవే. ఆజ్ఞ నుండి మూలాధారం వరకు నిట్ట నిలువుగా ఏర్పడిన ప్రజ్ఞా కేంద్రాలు.

ఆరింటియందు ఆరుగా వుంటూ ఒకడిగా ఉంటాడు. ఇది కుమారుని ప్రత్యేకత!

అందుకనే మనలో ఉండే గ్రంథులను Pineal and Pituitory (ఆజ్ఞ), Thyrodinum (విశుద్ధి), Thymus (అనాహతం), Solar Plexus (మణిపూరకం), Sacral (స్వాధిష్ఠానం), Gonads (మూలా ధారం) అంటారు. ఈ గ్రంథులన్నీ ఎప్పుడూ స్రవిస్తూవుంటే ఈ దేహం ఆరోగ్యంగా వుంటుంది. ఈ ఆరులోనే ఓజస్సు, సహస్సు, బలము, భ్రాజస్సు, తేజస్సు దేవతల ధామంగా పరిణమిస్తుంది. *"ఓజోఽసి, సహోఽసి, బలమసి, భ్రాజోఽసి, దేవానాం ధామ నామాసి"* అని గాయత్రిలో మనం చదువుకుంటూ వుంటాం. గాయత్రిలో షట్కుక్షులు యివే!



ఇట్లా 6 లోకాలలో తాను వ్యాపించి ఉండి అధోలోకములోనికి దిగిరావడమైనా, ఊర్ధ్వలోకములోనికి వెళ్ళడం అయినా చెయ్య వచ్చు. ఇట్లా యోగమార్గంగా ఏర్పడతాడు కుమారుడు. ఒక రకంగా చూస్తే ఇడా పింగళ నాడులూ, లేదంటే ఒకదానిని ఒకటి పెనవేసు కున్న రెండు సర్పాలు, లేదంటే నిట్ట నిలువుగా ఉన్న రెండు సర్పాలు.

ఆరు లోకాలలో ఈ విధంగా వ్యాప్తిచెంది ఉంటాడు కుమారుడు. ఇక ఏమిటి భయం. ఇలాంటి వాడు ఒకడు ఉంటే చాలు. ఇలాంటి వాణ్ణి తయారుచేసి పంపించాడు శివుడు. ఇతడు షట్భుజుడు. షణ్ముఖుడైనప్పుడు ఎన్ని భుజాలుంటాయండి? 12 భుజాలుంటాయి కదా! ద్విషడ్భుజుడు. 2 షడ్భుజాలు. అవే పన్నెండు రాశులు. పన్నెండు రాశులకూ తన కాంతిని అలా ప్రసరింప చేస్తాడు ఆయన. ద్విషన్నేత్రః పన్నెండు రాశులయందు అతని చూపు ఉన్నది. పన్నెండు రాశుల లోనూ అతని శక్తి, బాహుబలము ఉన్నది. ఆరు ముఖములు ఉన్నవాడు పన్నెండు రాశులలో నిండి సంవత్సర చక్రము నందు ఉంటాడు. అతడే కుమారుడు. అటువంటి అత్యద్భుతమైన కుమారుణ్ణి ఇస్తాడు శివుడు. ఈ వార్త వ్యాప్తి చెంది అందరూ సంతోషముతో ఆయనకు (కుమారునికి) కానుకలు అందచేస్తారట. ఎందుచేత అంటే పుట్టిన 7 రోజుల లోపున తారకాసురుని సంహరించాలి. తారకాసురుడు బ్రహ్మను గూర్చి తపమొనరించి "శీఘ్రగతిన నేను ఇంద్రుని జయించడమే కాకుండా, నన్ను జయించడానికి ఎవరికీ సాధ్యం కాకూడదు. కనుక నన్ను జయించే వాడికి ఏడు రోజులకు మించి ఆయుష్షు ఉండకూడదు" అంటాడు. అది ఆయన కోరిక. కానీ కుమారునికి ఏడు రోజులు అక్కరలేకపోయింది! ఐదు రోజులే. ఈయన పుట్టడం, అందరూ రావడం, చూడటం, సంతోషించడం, ఒక సభ ఏర్పాటు చెయ్యడం, కానుకలు ఇవ్వడం, ఇవన్నీ రెండోరోజో మూడోరోజో అయిపోతాయి. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క కానుక ఇచ్చారు.

**కానుకలు :**

దేవతలు మేమంతా నీ సైన్యంగా ఉంటామని ఒక సేనను ఏర్పాటు చేసుకున్నారట. వాళ్ళంతా ఆయన సేనగా తయారయ్యారట, అది కానుక!

శివుడు నలుగురు ప్రమథుల్ని ఇచ్చాడట కానుకగా. ప్రమథు లంటే వాళ్ళు చాలా అనూహ్య రీతిలో యుద్ధం చేస్తారు. వారితో యుద్ధం చెయ్యడం చాలా కష్టం.

దేవతలకి యుద్ధం చేసేటప్పుడు ఒక పద్ధతి ఉంటుంది. ప్రమథులకి అది ఉండదు. వారికి శివభక్తే తప్ప పద్ధతి ఉండదు. పరమానందయ్య శిష్యుల కథ చూశారు కదా. వాళ్ళు చేసేవన్నీ అస్తవ్యస్తంగా కనిపిస్తాయి కానీ అందులో జ్ఞానం ఉంటుంది. అలాంటి వాళ్ళని నలుగురిని– ఘంటాకర్ణుడు, లోహితాక్ష, నందిసేనా, కుముదమాలి. ఘంటాకర్ణుడు అరిచాడంటే వాడి అరుపుకే రక్తం కక్కుకొని అందరూ చచ్చిపోతారు. లోహితాక్షుడి కన్నులలోంచి అగ్ని వచ్చేస్తుంది. ఈ నామం శివునికి కూడా ఉంది కదా! ఆయన చూపు పడితే మాడిపోతారు. నందిసేన – నందీశ్వరుడి సేన. కుముదమాలి – చూడడానికి పువ్వువలే ఉంటాడట. భయంకరంగా యుద్ధం చేస్తాడట. బ్రహ్మదేవుడు కూడా కొంతమంది ప్రమథుల్ని కానుకగా ఇచ్చాడట. వారెవరెంటే స్థాణు, విష్ణు, సంక్రమ, విక్రమ, పరాక్రమ.

ఉత్క్రేస, పరాజ అనే పరాక్రమవంతుల్ని ఇంద్రుడు ఇచ్చాడట. చంద్రుడు మణి, వసుమణి, అశ్వమణి, వసునందుడు అనే వాళ్ళని

ఇచ్చాడు. అటుపైన దేవతలు మాత్రలను, తీర్థాలనూ ఇచ్చారట. ఇటువంటివెన్నో రకరకాల శక్తులను, ఆయుధాలను కుమారునికి కానుకగా ఇచ్చారట. ఇస్తే ఇవన్నీ చూసి గరుత్మంతుడు నెమలిని ఇచ్చాడట. నెమలి వాళ్ళ జాతే కదా. ఆయన పక్షి లోకానికి రాజు కదా! ఒక దివ్యమైన నెమలిని తెచ్చి ఇచ్చాడట గరుత్మంతుడు. నెమలిని ఇస్తే ఆయన క్రిందికి వచ్చినప్పుడు కృష్ణుడిలా ఆ నెమలి కన్నులే పెట్టుకుంటాడు. పై లోకాలలో అతనికి నెమలి వాహనంగా ఉంటే దిగివచ్చినప్పుడు అది పింఛముగా ఉంటుందన్నమాట. ఆ విధంగా నెమలి వాహనాన్ని ఏర్పాటు చేశాడట. ఆ నెమలి గరుత్మంతునితో సమానముగా ప్రయాణము చేస్తుంది. మనం చూసే నెమలి లాంటిది కాదు అది. యుద్ధము కూడ చేస్తుంది.

అరుణుడు (ఆయన కూడా పక్షి వంశం నుండి వచ్చిన వాడే వైనతేయుడు, గరుత్మంతుని అన్నయ్య) అనూరుడే అరుణుడు. తమ్ము డిచ్చాడు కదా మనమూ కానుక ఇద్దాం అని కోడిపుంజుని ఇచ్చాడట. అందుచేత కోడిపుంజు పవిత్రం.

అది అరుణుడికి వాహనం. అరుణుడొచ్చేముందు కోడి కదా కూస్తుంది. అదేం చెబుతుంది అంటే, గురువుగారు వస్తారిక అని చెబుతుంది. ముందు అరుణోదయం, తరువాత సూర్యోదయం. ఆయన కోళ్ళను పెంచుతూ ఉండి ఒకటి కుమారునికి ఇచ్చాడు.

తరువాత అగ్నిదేవుడు. ఆయన సాక్షాత్తు శివుడే కదా! ఆయన త్రిశూలాన్ని ఇచ్చాడట. బృహస్పతి దండం ఇచ్చాడట. దండం అంటే

యోగదండం. గంగాదేవి కమండలం ఇచ్చిందట. అందరూ అన్నీ ఇస్తుంటే అమ్మవారు తన శక్తినే ఇచ్చేసిందట. శక్తే ప్రధానమైన ఆయుధం. ఇవన్నీ మోసుకు తిరగడు కదా! శక్తి– అమ్మ ఇచ్చినటు వంటిది పట్టుకుంటాడు. గరుడుడు ఇచ్చిన వాహనం, ఈ రెండే. మిగతావి ఉంటాయి కానీ దగ్గర పెట్టుకొని కూర్చోడు.

సరే ఇవన్నీ యిచ్చి ఊరుకుంటారేమిటి? తారకాసురుడు ఇలా ఉన్నాడు. వాణ్ణి నీకు ఏడు రోజులు వచ్చే లోపు నీవు సంహరించాలి అని చెప్తే ఎక్కడ ఉన్నాడు, పదండి అంటాడు. కుమారుడంటే బాణాలు వేసుకోవడం ఏమీ ఉండదు. పదండి వస్తాను అంటాడు. వీళ్ళంతా వెనకాల నిలబడతారు. భయం కదా! ఆయన ముందు ఉంటాడు దేవసేనా నాయకుడు కదా! అలా వెళుతూ ఉంటే చీకట్లన్నీ పోతూ ఉంటాయి, అంతే. వాడు నిలబడ్డం, వీడు నిలబడ్డం, బాణాలు వేసుకోవడం ఉందా! లేదు. ఆయనతో వెలుగు వస్తుంది అంతే! ఎంత గొప్ప విషయం. ఈయన వస్తుంటేనే తారకాసురుడు హరించుకొని పోయాడు. ఐదు రోజుల కుర్రవాడు. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ చీకటి ఉండదు. అవిద్య ఉండదు, అజ్ఞానం ఉండదు. అది ఎంతటి విషయం! తారకాసురుడు అనే చీకటి కుమారుడనే వెలుగు రాగానే చీకటి హరించుకు పోతుంది. అంతటి వెలుగు కుమారుడు. అజ్ఞానమనే చీకటిని హరించే వెలుగు బుద్ధి. బుద్ధి ప్రచోదనమైతే అజ్ఞానమనే చీకటి ఉండదు. మనస్సు, ఇంద్రియములు, శరీరము, బుద్ధితో కూడియుండటం ప్రధానము. అప్పుడు యథార్థము గోచరిస్తుంది. మాయా మోహము లుండవు. చీకట్లో వస్తువులు సరిగా

గోచరించవు. త్రాడు పాములా కనిపిస్తుంది. ఎప్పుడు వెలుగు వస్తుందో అప్పుడు పాము కాదని, త్రాడని తెలుస్తుంది- అని ప్రాచీనమగు ఉదాహరణ. మనసులో వున్నవారికి ఎప్పుడూ అపోహలు, అనుమానాలు, సందేహాలు వుంటాయి. లేనిది వున్నట్లు భావిస్తారు. ఉన్నది చూడలేరు. అదే అజ్ఞానము. బుద్ధితో కూడివుంటే మూడు లోకములలోని దివ్యత్వము గోచరిస్తుంది. లేకపోతే లోపభూయిష్టంగా గోచరిస్తుంది.

అందుకని కుమార స్మరణ. కుమార స్మరణ అన్ని దోషాలనీ హరించేస్తుంది. అలాంటి కుమారుడు పుడతాడండీ. అందరికీ ముచ్చటే. దేవతలకి, త్రిమూర్తులకి, పార్వతీదేవికి అందరికీ ముచ్చట! అందరిలోకీ అతడు పార్వతీదేవినే ఎక్కువ తల్లిగా గుర్తిస్తాడు. మిగతా వారిని తల్లులుగా మన్నిస్తాడు. యుద్ధమేమీ లేదు. ఈయన రాకతో ఆయన హరింపబడతాడు. ఆయనతో యుద్ధం చేసే పరిస్థితి రాదు. ఏడి వాడు (తారకాసురుడు) అంటే ఈయన వచ్చిన చోటల్లా వాడు ఉండడు, హరించిపోతాడు. ఈయన వచ్చిన చోటల్లా వెలుగు నిండిపోతుంది. ఈయన లేకపోతే అంతకు ముందు అంతా చీకటే. అందుకే ఈయనను ముందు పెట్టుకొని పనిచేసుకోవడం మొదలు పెట్టారు దేవతలు. ఏడు లోకాల సృష్టి అయ్యేంతవరకూ ఆ విధంగా కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారు.

పూర్తి అయినటువంటి ఈ 7 లోకాలలోనూ సుబ్రహ్మణ్యుడు ప్రవేశించి తిరగగలడు. మొదట 6 లోకాలలో ఉంటాడు. తల్లి తండ్రులు ఏడో లోకంలో ఉంటారు. ఈయన అందులో ప్రవేశించ గలడు. క్రింద ఆరు లోకాలలో విహరిస్తూ ఉంటాడు.

# ⑥

అలా పదహారు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకూ పెరుగుతూ ఉంటే, 16 కళల పూర్ణమైనటువంటి అందం. అమ్మ వారిది, అయ్యగారిది కలిపిన అందం ఆయనలో మూర్తీభవించి ఉంటుంది. ఆ అందం వర్ణింప నలవికానిది. ఎవరు చూస్తే వారు ఆయన వైపు ఆకర్షించబడుతూ ఉంటారు. దేవతా స్త్రీ లందరూ ఆయనకు ఆకర్షించబడి ఆయన చుట్టూ చేరి అల్లరి చేస్తూ ఉంటారు. అల్లరి చేస్తూ ఉంటే ఈయన కూడా వాటికి కొంచెం ప్రతిస్పందించడం మొదలు పెడతాడు. అలా ప్రతిస్పందించేటప్పటికి కల్లోలం పుడుతుంది. దేవలోకాల్లో కొంత ఇబ్బంది వచ్చింది. బాలకృష్ణుడు చేసిన అల్లరికి గోపికలందరూ *"ఓయమ్మ! నీ కుమారుడు మా యిండ్లను...... పోయద మెచ్చటికైనను మా అన్నల సురభులాన!"* అని వాపోయినట్లు, సృష్టి ఆరంభంలోనే కుమారుని అందం, అల్లరులు గగ్గోలుగా దేవతాలోకం అంతా వ్యాపించిందట. ఈయన వెంట పడుతూ ఉంటారండీ దేవతా స్త్రీలు. వారికి వావి, వరుస లుండవు! అదొక వింతలోకం! కొన్ని కొన్ని లోకాలలో కట్టుబాట్లు కొంత కొంత వైవిధ్యంతో ఉంటాయి. ఆయనేం చేస్తాడు, వాళ్ళ మగవాళ్ళకి బాగుండదు కదా! అంచేత అందరూ కలసి పార్వతికి ఒక ఆరోపణా పత్రం ఇస్తారు. ఆరోపణ చెప్పలేరు కదా! కుర్రవాడి మీద ఆరోపిస్తే

అమ్మవారికి కోపం వస్తే కష్టం కదా! ఒక విన్నపం పెడతారు. మీ అబ్బాయి వల్ల మా లోకాల్లో కొంచెం disturbance అలజడిగా ఉంది తల్లీ! అని. నీవు ఏమి చెబుతావో మరి? అతడు మా నాయకుడు. మేమేమీ చెయ్యలేము. మాకు అతడు అవసరం. కృత్తికలకే లయ తప్పిందంటే మిగిలినవాళ్ళ పని ఏమిటి? సమ్మోహన మైనటు వంటి రూపం. అప్పుడు అమ్మ పిలుస్తుంది సుబ్రహ్మణ్యుణ్ణి. కానీ అప్పటికింకా సుబ్రహ్మణ్యుడు కాడు ఆయన. ముందు విశాఖుడై తరువాత సుబ్రహ్మణ్యుడు అవుతాడు.

ఇలా దేవతలంతా ఈయన్ని వెంటపెట్టుకొని తారకాసురుని వెతుక్కుంటూ వెళితే వాడు వెళ్ళిపోతూ ఉంటాడు. ఎక్కడా కనబడడు. ఎంత దూరం వెళితే అంత దూరం వెలుగు వచ్చేస్తుంది. అంటే తారకాసురుడు ఇక లేడు. అంటే ఏమి జరుగుతుంది?

ఇప్పుడు దేవతలు ఇంద్రుణ్ణి గౌరవిస్తారా, కుమారుణ్ణి గౌరవిస్తారా? ఇలాంటి ఇబ్బంది వస్తుందని అనుకోలేదు ఇంద్రుడు. ఈ కుమారస్వామి ఇలానే ఉంటే మనికి ఇబ్బంది వస్తుంది. ఇతణ్ణి అదుపులో పెట్టాలి అని కుమారుణ్ణి ఎదుర్కొని యుద్ధం చెయ్యడానికి సిద్ధపడతాడు.

కుమారుణ్ణి ఎదుర్కొని యుద్ధం చేస్తానంటాడు. కుమారస్వామి నవ్వుతాడు. నీ కోసమే పని చేసిపెట్టాను కదా! నీతో ఏమిటి యుద్ధం అంటే మా వాళ్ళంతా నీ చుట్టూ తిరుగుతున్నారు. ఇక నన్నేమి లక్ష్య పెడతారు వాళ్ళు. అలా ఉండదు. నిన్నే లక్ష్య పెడతారు వాళ్ళు.

నేను నా పని చేసుకొని వెళ్ళిపోతాను అంటాడు. అలా కాదు. నీ కన్నా నేను అధికుడినని తెలిస్తే తప్ప వీరందరూ నన్ను గౌరవించరు అని చెబుతాడు.

**విశాఖుడు :**

యుద్ధం అంటాడు ఇంద్రుడు. అయితే చెయ్యి అంటాడు కుమారుడు. ఏమి యుద్ధం చేస్తాడు. ఇంద్రుడు వజ్రం ప్రయోగిస్తాడు. వజ్రాయుధం ప్రయోగిస్తే దాన్ని చూస్తూ ఉంటాడు కుమారస్వామి. ఎందుకంటే అది దధీచి యొక్క వెన్నెముక ఎముక. దాన్ని గరుత్మంతుని మీద ప్రయోగించినప్పుడు కూడా ఆయన దాని మీద గౌరవం కొద్దీ ఎదుర్కొనడు. దాన్ని గౌరవిస్తూ గరుత్మంతుడు ఒక ఈక రాలుస్తాడు. అంటే వజ్రాయుధం నన్నేమీ చెయ్యదమ్మా! కానీ నేను దానిని ఎదుర్కోను అని. అలాగే కుమారుడి దగ్గర శక్తి ఆయుధం ఉంటుంది. దానిని ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఆయన వజ్రాయుధం వేస్తే ఈయన శక్త్యాయుధం వెయ్యవచ్చు కానీ వెయ్యడు, ఊరుకుంటాడు. కాబట్టి అది ఆయన కుడి భుజానికి తగుల్తుంది. తగిల్తే కుమారుడి భుజం నుంచి అంతే తేజస్సు దేదీప్యమైన కాంతులతో ఎంతో బంగారు కాంతి కలిగినటువంటి వాడొకడు బయటకు వస్తాడు. వాడొచ్చి ఎవడ్రా నన్ను కొట్టాడు అని ఇంద్రుడి మీద బాణాలు ఎక్కుపెడతాడు. అతడిని చూసేటప్పటికి ఇంద్రుడికి ఎక్కువ భయం కలుగుతుంది. అతడే విశాఖుడు. స్కందుడి కుడిభుజంలోంచి విశాఖుడు పుడతాడు. ఎందుకంటే అది ఒక శాఖ (భుజం). శాఖ నుండి వచ్చాడు కాబట్టి

అతడు విశాఖుడు అవుతాడు. అతడు చాలా కాంతివంతుడు. పచ్చగా మెరిసిపోతూ ఉంటాడు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను చూడగానే స్కంద విశాఖులను చూసినట్టుగా భావిస్తాడు. రామాయణంలో చదువుకోండి. రామలక్ష్మణులు నడచివస్తూ ఉంటే ఋషులకు రాముడు, లక్ష్మణుడు కనిపించరు. స్కంద విశాఖులే కనబడతారు. రాముడెవరు? కుమారుడే. లక్ష్మణుడెవరు? విశాఖుడే కదా! అది బాలకాండలో చెబుతారు. మళ్ళీ మధ్య మధ్యలో గుర్తు చేస్తూ ఉంటారు. ఒకరిలో నుండి ఒకరు వచ్చిన వారే. అంటే లక్ష్మణుడు రామునిలోని వాడే. అందుకనే లక్ష్మణుడు పచ్చగా ఉంటాడు. రాముడు నీలంగా ఉంటాడు. అతి కాంతివంతుడు విశాఖుడు.

అప్పుడు అలా బయటకు వచ్చిన విశాఖుడిని చూచి ఇంద్రుడు మిక్కిలి భయపడి శరణు వేడతాడు. అప్పుడు కుమారుడు నా వలన నీకు ఎటువంటి భయము లేదు. నీ రక్షణ కొరకే నా తండ్రి నన్ను పుట్టించాడు. నా వలన నీకు ఎటువంటి బాధ కలుగదు. భయపడ వద్దని అభయం ఇస్తాడు. అప్పుడు ఇంద్రుడు కుమారస్వామితో స్నేహం చేసుకుంటాడు. అలానే ఇంతకు ముందు గరుత్మంతునితో కూడా చేసుకుంటాడు.

**సుబ్రహ్మణ్యుడు :**

మళ్ళీ కథలోకి వెళ్తే కుమారస్వామికి స్త్రీ గొడవ చాలా ఎక్కువగా ఉంటుంది. దేవతా స్త్రీలు, ఋషి స్త్రీలు, మానవస్త్రీలు ఆయన

సౌందర్యానికి ఆకర్షితులౌతూ ఉంటారు. అతని సౌందర్యం ముందు మన్మథుడు కూడా చాలడు. ఏ మన్మథుడైతే శివుణ్ణి ఏమీ చలింప చేయలేకపోయాడో ఆ శివతేజమే కదా! అందుచేత మన్మథుని ఆకర్షణ ఆయన మీద పనిచేయదు. కుమారుని ఆకర్షణ ముందు ఎవరూ పనికి రారు. వాళ్ళని వాళ్ళు సమర్పణ చేసుకునే పరిస్థితి వస్తుంది. అప్పుడు వాళ్ళంతా వెళ్ళి అమ్మవారికి మొర పెట్టుకుంటారు. అప్పుడు అమ్మవారు పిలిచి "లోకాలలోని స్త్రీలు నీయందు మోహపడి యున్నారు. వాళ్ళు వేదన చెందుతున్నారు. వారి పురుషులు బాధ పడుతున్నారు. స్త్రీలు నీయందు మోహపడినా, నీవు ప్రతిస్పందించ కూడదు సుమా!" అని తెలిపింది. తల్లి అలా అంటే, "వాళ్ళు ఎక్కువ అల్లరి చేస్తే నేనూ చేస్తాను" అంటాడు. అంతగా అల్లరి పెడితే నేనెందుకు ఊరుకోవాలమ్మా! అంటాడు.

అంతే కదా, అలానే జరుగుతూ ఉంటాయి కదా. ఆడపిల్లలే ఎక్కువ గొడవ పెడతారు. చూట్టానికి అలా ఉంటారు కానీ కవ్వించి ఆ తరువాత వీడేదో చేస్తే వీడిని అందరూ కోప్పడతారు. సృష్టిలో ఉందిది. కవ్వించకపోతే అలా జరగదు. అప్పుడు తల్లి అంటుంది. వాళ్ళెలా ఉంటే నీకెందుకు నాన్నా! నీవు అలా ఉండకు. నేను చెపుతాను కదా! అంటుంది. అంటే నాకు కూడా పౌరుషం ఉంది! నన్ను కవ్విస్తే నేను ఊరుకోను! అంటాడు.

ఒకసారి నన్ను తదేకంగా చూడు అంటుంది పార్వతి. అంటే తీక్షణంగా చూస్తాడు. చూశావా నన్ను బాగా! అంటుంది. ఆ చూశాను

అమ్మా! అంటాడు. ఎలా ఉంది? అంటుంది. “నువ్వే నేను” అంటాడు. “నీ అందమే నాకు ఇచ్చావు. ఆ అందమే ఇక్కడ ప్రతిబింబిస్తోంది” అంటాడు. “నేనే కదా!” అంటుంది, ‘అవును’ అంటాడు. “ఇప్పుడు వాళ్ళందరినీ చూడు” అంటుంది. పార్వతి తన యోగశక్తి, మాయ చేత ఆయన్ని ఇప్పుడు చూడు అందరినీ అంటుంది. అంటే “ఏ స్త్రీని చూసినా ఆయనకు పార్వతియే కనిపిస్తుంది” అప్పటి నుండి. ఇంక ఏ స్త్రీ తనని ఏ విధంగా చూసినా, ఏ వికార భావంతో చూసినా అతనికి ఆ స్త్రీ యందు పార్వతీదేవియే కనిపిస్తుంది. అప్పుడు కుమారుడు నవ్వుతాడు. నవ్వి “అమ్మా! అర్థమైయ్యింది ఇప్పుడు అంతా. నీవే అంతటా, అన్నిటిలో నిండి యున్నావు. నువ్వే అంతా అనే సంగతి నీవు నాకు ప్రస్ఫుటంగా చూపించావు. అందుచేత నేను సృష్టి ఉన్నంత కాలము ‘సు’ ‘బ్రహ్మణ్య’డినై ఉంటాను” అంటాడు. మూర్తీభ వించిన బ్రహ్మమువలె ఉంటాను. ఏ స్త్రీ నన్ను చేరినా వారికి భయం లేదు. ఏ స్త్రీ నన్ను ఏమీ చెయ్యలేదు అంటాడు. అందుకని అతడు పార్వతి వరం వలన సుబ్రహ్మణ్యుడు అవుతాడు. సృష్టియందలి రూపమంతా స్త్రీయే! అమ్మ రూపమే! నవావరణలతో అతి సుందరంగా అమ్మే ఈ సృష్టిగా ఉన్నది. కుమారునికి సృష్టి రూపాలన్నీ అమ్మ రూపంగాను, తాను బ్రహ్మము (శివము) రూపముగాను దర్శన మౌతుంది. తాను సుబ్రహ్మణ్యమై సృష్టిని కాపాడటం ప్రారంభిస్తాడు. నేటికీ అదే కర్తవ్యము. అదే బ్రహ్మణ్య స్థితి. కనుక బ్రహ్మము చేరేవారికి గురువై లోకములో వున్నాడు.

## బుద్ధికి ప్రతిరూపం :

సుబ్రహ్మణ్యము అనేది చాలా విశిష్టమైనటువంటి గుణము కుమారునిలో. అతని తేజస్సు, బలము, అతని శక్తి, యోగము, భ్రాజస్సు, యశస్సు ఇవన్నీ అలా ఉండగా అన్నిటికీ మించి అతడు సుబ్రహ్మణ్యుడు. ఈ సుబ్రహ్మణ్యుడిని ఆరాధించిన వారికి సులభంగా యోగములో స్థిరపడటం జరుగుతుంది. అంత సులభంగా వారిని ఏదీ ఆకర్షించదు. స్త్రీ శక్తే ఆకర్షించలేకపోయింది అంటే వారిని ఇక ఏ శక్తీ ఆకర్షించలేదు. అలాంటి ఒక స్థితికి సుబ్రహ్మణ్యుడు చేరతాడు. సుబ్రహ్మణ్యుడు మనయందు కూడా ఉన్నాడు. ఈ ఆరు కేంద్రములలో ప్రజ్ఞా స్వరూపుడై ఉంటాడు. అతడి శక్తియే మన యందు శక్తిగా ఉంటుంది. ఆ శక్తిని ఉపయోగించుకునే విధానం తెలియాలంటే బుద్ధి కావాలి. ఎందుకంటే కామము కలిగినటువంటి వాడికి శక్తితో పాటు బుద్ధి కూడా లేకపోతే చాలా విపరీతమైన స్థితి కలుగుతుంది. అందుకని అతడు బుద్ధికి కూడా ప్రతిరూపంగా ఉంటాడు.

అందుచేత సృష్టిలో బుద్ధి అనే ప్రజ్ఞ మానవునిలో కామము జనించిన తరువాత పుట్టిస్తుంది ప్రకృతి. ముందు కామము, తరువాత బుద్ధి. బుద్ధిచేత కామాన్ని నియమించుకోవచ్చు. అహంకారాన్ని కూడా నియమించుకోవచ్చు. మనము ప్రత్యేకమైన ఆత్మతత్త్వం, నేను ఒక్కడినే అనుకుంటాము కాబట్టి బుద్ధియందు ఉంటే నేను ఉన్నానని కాకుండా, 'అతడే నేనై ఉన్నాను' అనే భావన కలుగుతుంది. బుద్ధియందు ఉన్నప్పుడే ఇటువంటి భావన కలుగుతుంది. లేకపోతే అది కలుగదు. ఎప్పుడు బుద్ధి యందు కాక మనసుయందు ఎక్కువ ఉంటామో

అప్పుడు నేనున్నాను అనే భావన ఎక్కువగా ఉంటుంది. మనస్సు అనే కక్ష్యలో ఉన్నంత సేపు మనిషికి అహంకారము కలుగుతుంది.

బుద్ధి కక్ష్యలోకి ప్రవేశిస్తే అహంకారము మీద వెలుగు పడుతుంది. వెలుగు పడటం చేత అతడే నేనుగా ఉన్నానని తెలుస్తుంది. అతడే నేనుగా ఉన్నాను అని తెలుసుకోవడమే జ్ఞానం. నేనుగా ఉన్నాను అనుకోవడం అవిద్య. అవిద్య కలగకుండా ఉండటానికి కూడా కుమారుని అవసరం ఉంది. కామాన్ని అదుపులో ఉంచుకోవడానికి కూడా (స్త్రీ పురుష కామమే కాదు), సృష్టిలో ఏ ఇచ్ఛ కలిగినా సరే బుద్ధిలో కూర్చున్నట్లైతే విచక్షణ అనేటటువంటి వెలుగు ద్వారా చేయవలసినది, చేయదలచినది తెలుస్తుంది. తదనుగుణంగా మార్పు చేసుకునే అవకాశం లభిస్తుంది. అందుచేత కుమారుడావిధంగా దిగిరావడం అనేది జరుగుతుంది. ఆ సమయంలోనే దేవతామూర్తులు చాలామంది దిగివస్తారు సమకాలికంగా. ఆ దిగివచ్చే కథలన్నీ కూడా అప్పటి నుండి ద్వితీయ పరార్థము సృష్టికి మొదలు అవుతుంది. బుద్ధి వచ్చేంతవరకు ప్రథమ భాగము, పూర్వార్థము. బుద్ధి ఏర్పడిన తరువాత సృష్టి ద్వితీయ పరార్థము లోనికి వెళుతుంది– అప్పటికి మూడున్నర వంతులు జరిగిందని, బుద్ధి తరువాత మూడున్నర వంతులు జరుగుతుందని చెబుతారు.

బుద్ధి ఉన్నప్పటికీ ఎవరు దానిని ఆశ్రయించరో వారు కామమునకు లొంగిపోతారు. బుద్ధిని ఆశ్రయించనివారు కామంలో పడి ఉంటారు. కామంలో ఉన్నవారు చేయవలసినది, చేయదలచినది

ఇవన్నీ కలగాపులగం అయిపోయి ఒప్పు తప్పు చేసుకుంటూ కర్మ సృష్టించుకోవడం జరుగుతుంది. బుద్ధిలో ఉంటే ఇప్పటివరకు ఉన్న కర్మ నిర్జించుకోవడానికి, ఇక ముందు కర్మ పుట్టకుండా నిర్జించు కోవడానికి వీలు పడుతుంది. ఇదివరకు చేసిన కర్మని పరిపూర్తి కావించుకొని కర్మ రహితం కూడా చేసుకోవడానికి వీలు పడుతుంది. అందుకనే బుద్ధిలో ప్రవేశించడమే ప్రధాన ఘట్టంగా అన్ని బోధలూ నడుస్తూ ఉంటాయి. అందుకనే బుద్ధి ప్రవేశం జరగాలి మనిషికి. మనోలోకం కన్నా బుద్ధిలోకంలోకి ప్రవేశమే మంచిది. సాధన జరుగుతూ ఉండాలి. ఎన్ని పూజలు చేస్తున్నా, భజనలు చేస్తున్నా బుద్ధి పెరగకపోతే అది సరియైన సాధన కాదు. బుద్ధి పెరగనటువంటి సాధన సాధనే కాదు. అహంకారము నిర్జింపబడని సాధన సాధనే కాదు. ఇటు ప్రక్క అహంకారాన్ని, అటు ప్రక్క కామాన్ని రెండిటినీ నియమించ గలిగినది బుద్ధి. నియమించడమే తప్ప హరించదు బుద్ధి. దీనికీ సర్దుబాటు చేస్తుంది, దానికీ సర్దుబాటు చేస్తుంది.

సద్గురువుల అవతరణ కూడా కుమారుని అవతరణ తరువాతే జరిగింది. పై కక్ష్యలలోని గురువులు భూమిమీదకు దిగిరావాలంటే కుమారుడు మార్గమై ఉంటాడు. అతడే యోగమార్గము. ఆ మార్గములో బుద్ధి లేకపోతే ఏమీ రాదు. దేవతలందరూ బుద్ధిలో ఉన్నటువంటి వాళ్ళు కారు. "దేవతలందరికీ నేను తెలియదు" అని కృష్ణుడు భగవద్గీతలో చెబుతాడు. ఎందుకంటే బుద్ధియందు ప్రవేశించిన వారికి మాత్రమే సృష్టి రహస్యాలన్నీ క్రమంగా తెలియడం ఆరంభం

అవుతుంది. అలాంటి బుద్ధి రూపమే ప్రద్యుమ్న రూపము. అలాంటి బుద్ధి రూపమే కుమార రూపము.

అంతేకాక బుద్ధియందు ప్రవేశించి వసిస్తూవుంటే క్రమంగా మనసులో ఉండే మానవుడు నరుడు అవుతాడు. అంటే నశించని వాడు అవుతాడు. మనసులోనే వుంటే నశిస్తాడు. అంటే మరణిస్తాడు. మనసుకు మరపు వుంది. కాబట్టి మృత్యువు ఉంది. బుద్ధికి మరపు లేదు. కనుక మరణము ఉండదు. మరణం లేని స్థితి అందరూ కోరుకుంటారు. కాని తదనుగుణమైన కర్తవ్యాన్ని నిర్వర్తించరు. మన యందలి బుద్ధిని, వివేకమును ఆశ్రయించి జీవిస్తే మరపు ఉండదు. మరణము ఉండదు. మానవుడు నరుడవటమే నిజమైన విజయము. అట్టివారే విజయవాడలో వుంటారు (సభలో నవ్వులు). నేను చెప్పే విజయవాడ వేరు సుమా! అక్కడ అందరూ విజయులే వుంటారు. అర్జునుడు బుద్ధియందు సహజంగా వసించి యుండేవాడు కాబట్టి విజయుడు అయ్యాడు. అతని పేరున విజయవాడ ఏర్పరుచు కొన్నాము.

బుద్ధియందే వసిస్తుండే వారికి క్రమముగా శరీర ధాతువులలో మార్పు వస్తుంది. సూక్ష్మదేహ నిర్మాణం ప్రారంభ మవుతుంది. యోగ మందు ఇదియొక సహజ పరిణామము. అది కలుగజేయుటకే సద్గురువు లందరి ప్రయత్నం.

# 7

సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధన చేసుకోవడం అనేది చాలా ఉత్తమోత్తమంగా చెబుతారు. ముఖ్యంగా అగస్త్య మహర్షి దీనికి ఎక్కువ ప్రాముఖ్యత ఏర్పరిచారు దక్షిణాదిలో. దక్షిణాదిన కుమారుని ఆరాధన ఎక్కువ. స్థానాలు, క్షేత్రాలు ఎక్కువ. విష్ణుమూర్తి చతుర్భుజుడై దిగివస్తే షడ్భుజుడైన కుమారుడు అవుతాడు అని చెబుతారు. అగ్ని స్వరూపుడైన దైవము మొదటగా దిగివస్తే చతుర్భుజుడౌతాడు. చతుర్ముఖుడౌతాడు. ఇంకా దిగివస్తే షడ్భుజుడౌతాడు. అంటే చతుర్భుజుడు కన్నా షడ్భుజుడు ఇంకా దగ్గర మనకి. నాలుగు చేతులు కలిగిన విష్ణువు కన్నా ఆరు చేతులు కలిగిన కుమారుడు మనకు ఎక్కువ సన్నిహితుడు అని చెబుతాడు అగస్త్యుడు.

అగస్త్య మహర్షి యోగసాధనకు ప్రతిగా కుమారుణ్ణి పరిచయం చేశాడు. గణపతికి కూడా ఎక్కువ దక్షిణాదిలోనే ఆరాధన జరుగుతుంది. అగస్త్య ప్రభావం వల్ల కుమారుడు, గణపతి లేని శివాలయం దక్షిణాదిలో ఉండదు. ఇరువురూ ఉండాల్సిందే. ఎందుకంటే ఇటువంటి కుమారుడు కూడ తదుపరి గణపతికి శిష్యుడు అవుతాడు కదా!


గణపతి ముందుగానే ఈ స్థితిలో చేరతాడు. ఇరువురూ (గణపతి, కుమారుడు) అటువంటి వారే కాబట్టి శివపరివారంలో


చేరతారు. వీరికన్నా ముందునించీ ప్రధానంగా ఉన్నటువంటి వాడున్నాడు. అతడు గుర్తింపబడడు– రామాయణంలో శత్రుఘ్నుడి లాగా. అతడే నందీశ్వరుడు. నందీశ్వరుని గురించి చాలామందికి చాలా తక్కువ తెలుసు. దీని గూర్చి కూడా దక్షిణాది వారికే ఎక్కువ తెలుసు. అందునా కర్నాటక రాష్ట్రమందు బసవారాధన ఒక మతంగా ఏర్పడిపోయింది. నిజానికి నందీశ్వరుని అనుమతితోనే శివారాధన గావించాలి. లేకపోతే శివుడు అనుగ్రహించడు. పార్వతి, గణపతి, కుమారుడు కన్న ముందునుండి శివసేవలో నున్నవాడు నంది. అతడు ఆనంద స్వరూపుడు. నందీశ్వరుని అనుమతితో శివపూజ చేయడం విధానం.


*నందీశ్వర నమస్తుభ్యం సాంబానంద ప్రదాయకం ।*
*మహాదేవస్య సేవార్థం అనుజ్ఞాం ధాతుమర్హసి ॥*


నందీశ్వరుడు ఎప్పటినుంచో ఉన్నాడు. శివుని యొక్క ఆనంద రూపమే నంది. శివుడు ఆనందంగా ఉంటే అదే నందీశ్వర స్వరూపము. అంచేత శివ పరివారంలో శివుడు, అమ్మవారు, నందీశ్వరుడు, కుమారుడు, గణపతి మనకు గోచరిస్తారు. అందులో కుమారుని గూర్చి మనము ఇప్పుడు చెప్పుకుంటున్నాము. ఈ కుమార శక్తి ఎవరియందు ఉంటే వారి వలన సమస్త గురుకార్యాలు జరుగుతాయి. గురుకార్యాలు అంటే ఆత్మజ్ఞాన పరమైన కార్యాలు. అంతే కాదు వారి నుండి ధర్మసంస్థాపన కూడా జరుగుతుంది. కొంతమంది గురువులు బోధనలకే పరిమితము అవుతారు. కొంతమంది బోధనతో పాటు ధర్మ సంస్థాపన కూడా నిర్వర్తిస్తారు. ధర్మ సంస్థాపన నిర్వర్తించే

వారిలో కుమారాంశ ఎక్కువగా ఉంటుంది. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు అలాంటి అవతారాలే. అందుచేత ఈ షణ్ముఖ ప్రజ్ఞను ఆరాధన చేసుకోవడం ప్రధానం. ఈ షణ్ముఖుడిని యంత్రపరంగా ఆరాధన చేసుకోవాలంటే షడ్భుజుల యంత్రంగా ఆరాధన చేసుకోవాలి.









కుమారుని ఆరాధన చేస్తే రాహు కేతువులు దరి చేరరు. షడ్భుజము గురించి మనము చెప్పుకున్నప్పుడు అది 3 Dimensional గా చెబితే అది 3 Dimensional Cross గా వస్తుంది. దానినే వజ్రం అని కూడా అంటారు. మనకి చతుర్భుజమైనటువంటి ఒక క్రాస్ ఉంది. దానిలో ఇటునుంచి అటు కలిపితే షడ్భుజము వస్తుంది. షడ్భుజమైన క్రాస్ మనము ఎలా నిర్మాణం చేసుకోవచ్చో అది మనకు గాయత్రి మంత్రంలో ఇచ్చేశారు.

**'నమః ప్రాచ్యైదిశే'** తూర్పుకి తిరిగి తూర్పు నుండి ఒక వెలుగు కిరణం మనలో చేరినట్టుగా మనం భావన చేసుకోవాలి. అలాగే దక్షిణ దిశగా తిరిగి **'నమో దక్షిణాయై దిశే'** దక్షిణ దిక్కు నుండి ఒక వెలుగు కిరణం వచ్చి మన హృదయాన్ని తాకుతున్నట్టుగా మనం భావన చెయ్యాలి. ఆ తరువాత పశ్చిమ దిక్కుకు తిరిగి **'నమః ప్రతీచ్యై దిశే'** పశ్చిమ దిక్కు నుండి ఒక కిరణం హృదయాన్ని తాకు తున్నట్టుగా భావన చేయాలి. **'నమః ఉదీచ్యై దిశే'** ఉత్తర దిక్కునుండి ఒక కిరణం, **'నమ ఊర్ధ్వాయై దిశే'** ఊర్ధ్వం నుండి ఒక కిరణం, **'నమో అధరాయై దిశే'** అధస్సు నుంచి ఒక కిరణం. ఈ ఆరు దిక్కుల నుంచి ఆరు కిరణాలు వచ్చి నీలో చేరాయనుకోండి, ఈ ఆరు కిరణాలు ఆరు దిక్కులు కలిపితే నీవు వజ్రంలో కూర్చున్నట్టే అవుతుంది. అదే వజ్ర కవచం. ఇవన్నీ సంధ్యావందనంలో ఉన్నాయి. రోజూ చేసుకోమని చెప్పారు. ఇదే పిరమిడ్ ధ్యానం కూడ. నీవు వెలుగు పిరమిడ్‌లో కూర్చునట్లు భావించి గాయత్రి ధ్యానం చేసుకో వడటం అతి ప్రాచీన మార్గం. నీ పైన, నీ క్రింద పిరమిడ్, నీవు

కేంద్రంలో వున్నట్లు భావించి ఆరాధన, ధ్యానం చేసుకునే విధానం అతి ప్రాచీనం.

అలా అన్ని ప్రక్కల నుండి దేవతలు నన్ను రక్షించుగాక! తూర్పు – అంటే ఇంద్రుడు ఇత్యాదులు. అలాగే దక్షిణం – యముడు ఇత్యాదులు. దాక్షిణ్యం కలిగినటువంటివారు. ప్రతీచి దేవతలు. పశ్చిమం – వరుణుడు మొదలైన దేవతలు, వారి సైన్యంతో నన్ను కాపాడెదరు గాక! ఉత్తరంలో కుబేరుడుంటాడు. కుబేర సైన్యం అంతా యక్షస్సులు. వాళ్ళందరూ సూక్ష్మ లోకాన్ని కాపాడతారు. వారు నన్ను కాపాడెదరు గాక! వరుణుడు స్థూల లోకాలను కాపాడతాడు. యముడు ప్రేమలోకాలు, అనురాగ, దాక్షిణ్య లోకాలను కాపాడతాడు. ఇంద్రుడు వెలుగు లోకాలను కాపాడతాడు. వీళ్ళందరూ అన్ని ప్రక్కలా కాపాడుతూ ఉంటే పై నుండి ధన్వంతరి, అడుగునుంచి దత్తాత్రేయుడు కాపాడతా డట. ఇంతమంది మన చుట్టూ చేరితే మధ్యలో మనం కూర్చుంటే ఇక భయం దేనికి?

ఇట్లా ఆరు దిక్కుల నుంచి ఆరు కిరణాలు నీతో చేరి ఈ ఆరు కిరణాలను అంచులకు చేర్చేశామనుకోండి అన్ని ప్రక్కలా. చేర్చేస్తే నీకు క్రిందా పైనా రక్షణ, ఒక గొడుగు గోళాకారంగా ఏర్పడుతుంది. అందులో నువ్వు కూర్చుని కుమారస్వామి ఆరాధన చేసుకోవాలి. అది ఆరాధనా విధానం. అందులో కూర్చుని షట్కుక్షిలో నిక్షిప్తమైన గాయత్రి ఆరాధన అన్నా అదే. చదువుతాము కదా! "ఓజో ఽ సి,

*సహోఽ సి, బలమసి, భ్రాజోఽ సి, దేవానాం ధామనామాసి, విశ్వమసి, విశ్వాయుః, సర్వమసి, సర్వాయుః....”* అంటూ *‘త్రిపదా షట్కుక్షిః’* అంటూ ఉంటాము. ఇవే షట్కుక్షులు. ఆరు దిక్కుల నుండి ఆరు ప్రజ్ఞా కేంద్రాలు ప్రచోదనం అవ్వటం అనేది చేస్తే యోగదండం వెలగక ఏం చేస్తుంది. అలా ఏర్పాటు చేసుకొని మనం కుమారుణ్ణి ఆరాధన చేస్తే ఆ ఆనందం వేరు. కుమారుడు దండం ధరించి నెమలి వాహనంతో ఉండే బొమ్మ పెట్టుకొని చెయ్యడం ఇంకో పద్ధతి. షడ్భుజి యందు కూర్చుని ఆరాధన చెయ్యడం మనకు సంధ్యా వందనంలో ఇచ్చారు. అది ప్రత్యేకముగా ‘కుమారదీక్ష’ పొందినటు వంటి వారికి ఇస్తారు. అది క్రతువుల్లో కూడా ఇస్తారు.

దీని వలన రక్షణ కలుగుతుంది. దీని వల్ల ఊర్ధ్వం నుంచి అధస్సు వరకు తేజస్సు మార్గంగా ఏర్పడుతుంది. అది ప్రక్కలకూ, ముందుకూ, వెనుకకూ కూడా వ్యాప్తి చెందుతుంది. కుడి నుండి ఎడమకు, ఎడమ నుండి కుడికి, క్రింద నుండి పైకి, పైనుండి క్రిందికి ఈ విధంగా అన్ని విధాలుగా అది వ్యాప్తి చెందుతుంది. అన్ని ప్రక్కల నుండి నిన్ను ఆవరించి ఉంటుంది. షట్కోణంగా ఆవరించి ఉంటుంది. అలా ఆరాధన చేసుకోవచ్చు షణ్ముఖుడిని. లేదా మెలికలు వేసుకున్నటువంటి సర్పంగా సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధన చెయ్యవచ్చు- అంటే రెండు తలల పాము. గుళ్ళల్లో చెట్టుక్రింద పెడుతూ ఉంటారు కదా! దాని చుట్టూ గిరగిరగిర తిరుగుతూ ఉంటారు.

## సర్పదోషం :

ఏమిటి సర్పదోషం అంటే? రాహుకేతువుల బంధమే సర్ప దోషం. సర్పదోషం కుమారుడు ఉన్నచోట దరిదాపులలోనికి రాదు. ఎందుకంటే సర్పం నెమలి ఉన్న చోటుకి రాదు కదా! నెమలేమో ఆయనకు వాహనమై కూర్చుంది మరి! ఈ నెమలి వాహనం ఉన్న వారి దగ్గరకి సర్పం ఎలా రాగలదు? నెమలిని దాటలేదు కదా సర్పం. గరుత్మంతుని అంశ కదా నెమలి. అందుచేత సర్పదోషం ఉన్నవారికి నెమలితో ఉన్న కుమారుని ఆరాధన ఇస్తారు.

కాని సర్పం కర్మవశాత్తూ దోషముగా ఏర్పడవచ్చు. ఎందుచేత అంటే స్త్రీల యెడల అపచారము చేసిన వారికి సర్పదోషాలు కలుగుతాయి నిస్సందేహంగా. పురుషుల యెడల అపచారము చేసిన స్త్రీలకు కూడా ఏర్పడుతుంది. అది కుజదోషంగా చెబుతారు. కుజుడు కుమారశక్తిలో ఒక అంశ. అంటే కుమారశక్తిని మనం స్త్రీ పరంగానో, పురుషుని పరంగానో దుర్వినియోగం చేసిన యెడల అది మనలో సర్పదోషంగా ఏర్పడి అసలు వివాహాలే కావు. జరిగినా సంతానం కలగదు. కలిగినా వాళ్ళు బాగుండరు. అది సర్పదోషం యొక్క బాధ. కుజదోష బాధ.

సర్పదోషం ఉంది ఈ కుమారునికి, మీ పిల్లను ఇవ్వద్దు అంటారు. కుజదోషం ఉంది ఈ కన్యకు, మీ కుమారుణ్ణి ఇవ్వద్దు అంటారు. ఏమిటి ఈ దోషాలు? కుమారుని ఆగ్రహమే కుజదోషం, సర్పదోషం. కుమారు డెప్పుడు ఆగ్రహిస్తాడంటే పురుషుని యందు

స్త్రీ, స్త్రీ యందు పురుషుడు మక్కువ పడి ఏదో చేసుకుంటే కుమారుడు పట్టించుకోడు. స్త్రీ యందు పురుషుడు అపచారం చేసినా, పురుషుని యందు స్త్రీ అపచారం చేసినా తరువాత జన్మనుండి అది పామై పడుతుంది. అపచారం బాగా జరిగితే అసలు సంతానం కలగడానికి వీలులేని శరీరం ఏర్పడుతుంది. అంటే వీరికి పిల్లలు పుట్టరు అని డాక్టర్లు పరీక్ష చేసి చెబుతారు కదా!

విపరీత వ్యవహారముల వలన, ప్రవర్తన వలన స్త్రీ పురుషులకు ఇటువంటి దోషములు ఏర్పడతాయి. సర్పదోషము వలన వివాహ ములు జరుగవు. జరిగినా సంతానము కలుగదు. అంతేకాదు. సర్ప దోషము వలన ఏ పని చేస్తున్నా చాలా బంధాలు ఏర్పడుతూ ఉంటాయి. అంటే చిన్న పని జరగాలన్నా నానా గడ్డీ కరిచేటట్టుగా ఉంటుంది. మామూలుగా ఊరికే అయిపోయే పనికూడా చాలా పెద్ద కష్టంమీద అవుతుంది. ఎందుకని అంటే సర్పదోషం. దీనికి నివారణ కుమారుని ఆరాధనయే. కుమారుని ఆరాధన ద్వారా మనం సర్ప దోషాలను నిర్మూలించుకోవచ్చు. అందుకని సంతానము కలగనటు వంటి వారందరికీ సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన చేసుకోమంటారు. సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాలను దర్శించుకోమని చెబుతారు.

కాళహస్తిలో ఉన్న శివలింగము కుమార స్వరూపము. సర్ప రూపంలో ఉంటుంది అక్కడ లింగం. ఎప్పుడూ మనం ప్రొద్దున్న వెళ్ళం అక్కడికి కాబట్టి, కవచం వేసి ఉండటం వలన అది మనకు కనబడదు. శివాలయానికి ఎప్పుడూ మధ్యాహ్నం పూట వెళ్ళకూడదు.

సాయంత్రం పూట వెడితే శివుని నిజ స్వరూపం కనబడదు. ఉదయం వెళితే కనబడుతుంది. విజయవాడలో శ్రీ మల్లికార్జుని గుడి ఉన్నది. ఆ లింగంలో వేయి లింగాలు ఉన్నాయి. ఎవరికి కనిపిస్తుంది? ఉదయమే వెళ్ళి పాలతో అభిషేకం చేసుకుంటే కనిపిస్తుంది మనకి. లేకపోతే ఒకటే లింగం కనిపిస్తుంది. సాయంత్రం వెడితే అది కూడా కనిపించదు. దానికి ఒక కవచం వేసేసి పైన ఒక పడగ పెట్టేస్తారు కదా! కాళహస్తి లింగం కొంత సర్పాకారంలోనూ, కొంత ఏనుగు తొండం ఆకారంలోనూ ఉంటుంది. సాలెగూడు అల్లినట్టుగా దేహ మంతా కనిపిస్తుంది. అలా ఉంటుంది ఆ విగ్రహం. అందుచేత సర్పాకారంలో ఉన్న కాళహస్తీశ్వరుని దర్శనం చేసుకున్నా కూడా సర్పదోష నివృత్తి కలుగుతుంది అని చెబుతారు.

ఏది ఏమైనప్పటికీ మనలోని శుక్రకణం సర్పాకారంలో ఉంటుంది. అది సవ్యంగా జనించి, దానిలో వీర్యం బలంగా ఉండాలి. దానివలనే కదా బలవంతులు, తేజోవంతులు, మేధస్సు కలిగినవాళ్ళూ పుడతారు. శుక్ర కణము యొక్క బలాన్ని బట్టి సంతానము యొక్క బలం ఆధారపడి యుంటుంది. మేధస్సు, ఓజస్సు, తేజస్సు, బలము వీటిలోనే ఉంటుంది. జీవుడు శుక్ర కణంద్వారా స్త్రీ గర్భంలోని శోణితంలో ప్రవేశిస్తాడు. ఇదీ అదీ రెండూ సర్పాకారంలో ఉంటాయి. రెండూ పెనవేసుకొని ఉంటాయి. రెండు పాములు పెనవేసుకొన్న విగ్రహము గుడిలో చెట్టుక్రింద పెట్టి ఉంచుతారు, చూడండి. ఆ రెండూ కలిపితే అది సుబ్రహ్మణ్య స్వామి ఆకారము. ఆ సుబ్రహ్మణ్యస్వామిని పూజిస్తారు – దేనికి? సంతానం కలగడానికి,

సంతానాభివృద్ధికి తరువాత జీవితంలో కలిగే అవాంతరాలు, విఘ్నాలు మనకు పట్టకుండా ఉండటానికి, భూత ప్రేత పిశాచ నివారణకు కూడా పూజిస్తారు. ఇవన్నీ చిన్న విషయాలు. పెద్ద విషయంలోకి వస్తే అతడే మనలోని కుండలినీ శక్తి. కుండలినీ చైతన్యంగా మనలో నిక్షిప్తమై ఉన్నది కుమారుడే. అది ప్రచోదనం చెందాలి అంటే నీవు సత్సంకల్పాన్ని ఆశ్రయించాలి. అతడు సంకల్పశక్తి. అందుకనే కుజుడు సరిగ్గా పనిచేస్తే అతడు అద్భుతమైన కార్యాలు చేస్తాడు.

"Positive Mars manifests very effectively." మాస్టర్ ఇ.కె. గారు వ్రాసిన 'Spiritual Astrology' లో 'Mars' అనే శీర్షికను తీస్తే మీకు అనేకమైన విషయాలు తెలుస్తాయి. మనలో యోగశక్తిగా ఉన్నటువంటి వాడు కూడా కుమారుడే కాబట్టి కుమార ఆరాధన మనలో ఉండేటటువంటి చైతన్యాన్ని ఊర్ధ్వగతి పట్టించగలడు. ఎంతవరకు పట్టించగలడు అంటే మనలో ఉండే షట్చక్రముల జీవ చైతన్యాన్ని వ్యాప్తి కావించి, అది ఒక తేజోమయమైన ఆకారంలో ఇలా ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేసి సహస్రారం చేరి, అక్కడ పైన పడగ లాగా విచ్చుకున్నట్టుగా కనిపిస్తాడు. బాగా ఆరాధన జరుగు తున్నట్లయితే నీ లోపలి నుంచి ఒక వెలుగు సర్పంలాగ లేచి నీ చుట్టూ ఒక పడగ ఉన్నట్టుగా ఉంటుంది.

కృష్ణుడు యమున దాటుతున్నప్పుడు శిశువుగా ఆయన యోగశక్తియే అట్లా పాము పడగగా విచ్చి వెనకాల ఉంది. విష్ణుమూర్తి వెనుక గొడుగువలె ఏర్పడి యున్నది కూడ అతని కుండలినీ చైతన్యమే.

దానిమీద నారాయణుడు విశ్రాంతి గొనటం, దానిని శివుడు మెడలో ఆభరణంగా ధరించటం, ఇలాంటివన్నీ వారి యోగస్థితిని తెలియ పరుస్తాయి. శివకేశవులు సాటిలేని యోగేశ్వరులు. శ్రీకృష్ణుడు సర్పంపై నాట్యంచేసే రూపం (కాళీయ కృష్ణుడు) కూడ అతని యోగేశ్వరత్వ మును వ్యక్తం చేస్తూ ఉంటుంది. యోగసాధకులు పై తెలిపిన దైవ రూపాలను ఆ విధంగా భావించాలి.

కుమారుని శక్తి అలాగే ఉంటుంది. మనలో అలా విజృంభించి నిన్ను సహస్రారం దాటించి, శివస్థానం చేర్చే శక్తి కలిగినవాడు కుమారుడు. అందుకని అతడు యోగానికి అధిదేవత. సకల సంపద లను కూడా ఇవ్వగలడు. కామమును సరిదిద్దగలడు. ఇతర విషయము లెలా ఉన్నా స్త్రీ పురుష విషయములలో అపచారాలు జరిగితే మాత్రము కొన్ని జన్మల పాటు కుమారుడు అనుగ్రహించడు.

అందుచేత కొన్ని జాతులలో ఈ వంశాల్లో ఇక పిల్లలు పుట్టరు. పిల్లలు పుట్టకపోవడం ఎందుకు జరుగుతుంది అంటే ఆ వంశంలో ఎక్కడో ఒక చోట అపచారం జరుగుతుంది. అందుకని పిల్లలు పుట్టరు. పుట్టినా ఏదో ఒక వైకల్యం లేదా మందబుద్ధి, బుద్ధిహీనత. పుట్టుకతోనే Congenital Mental Sickness ఉన్నవాళ్ళు పుడతారు. శుక్రకణం పవిత్రంగా ఉండాలంటే సంకల్పం పవిత్రంగా ఉండాలి. స్త్రీ, పురుష సంపర్కం పవిత్రంగా ఉండాలి. నిర్వహణం పవిత్రంగా ఉండాలి. దాన్ని బట్టి ఇవన్నీ ఏర్పడతాయి. గుర్తుపెట్టుకోండి.

# ⑧

## షడ్భుజ ఆరాధన :

ఇన్ని రకాలుగా ఈ కుమారశక్తి సృష్టిలో పనిచేస్తూ ఉంది. కుమారుణ్ణి సర్పముగా కానీ, వజ్రముగా కానీ, ఒక ఘనముగా (ఆరు ముఖములు కలిగినది) గానీ పూజించవచ్చు. అంటే క్యూబ్. దానికి ఆరు ముఖములు. పైన, క్రింద, నాలుగు ప్రక్కలా = 6. ఒక క్యూబ్ ఎటునుంచి అయినా ఒకేలా ఉంటుంది. ఎటు తిరిగినా ఒకేలా కనుపించేదే ఘనము. అదే కుమారుడు. పరిపూర్ణత అంటే అది. ఎక్కడున్నా కుమారుడు కుమారుడే! గోళము పరబ్రహ్మాన్ని సూచిస్తే ఘనము సృష్టిలో పరిపూర్ణతను సూచిస్తుంది. అవతరించిన పరిపూర్ణ తకు చిహ్నమే షడ్భుజము. అందువలనే షడ్భుజ ఆరాధన చాలా ప్రధానమై కూర్చుంది. ఈ షడ్భుజమే అన్నింటికీ తాళపు చెవి కూడా. ఈ షడ్భుజికి ఆరు ముఖాలలో ఒక్కొక్క ముఖానికి నాలుగు లంబ కోణాలు ఉంటాయి. ప్రతీ ముఖము చతరస్రం అగుటచేత నాలుగు లంబకోణములు ఉంటాయి. 4 లంబకోణములు ఒక ముఖముగా 6 ముఖములు ఉంటాయి. మొత్తం అవి 24 లంబ కోణములు. 24 కోణములు కలిగినదే సంవత్సర చక్రము. ఇది అవగాహన అవ్వాలంటే కుమారుని సహాయం అవసరం.

24 పక్షములుగా సంవత్సరము ఉన్నది. 12 పూర్ణిమలు, 12 అమావాస్యలతో కూడి 24 పక్షములుగా సంవత్సరము ఏర్పడు చున్నది. 24 పక్షములనగా అవి 12 మాసములు. 12 మాసములు 6 ఋతువులు. 6–12, 12–24. 24 తత్త్వాలను '12'గా దర్శించ వచ్చు. ఇంకా సూక్ష్మంగా చూస్తే '6'గా కూడా దర్శించవచ్చు. ఇంకా సూక్ష్మంగా చూస్తే 3గా దర్శించవచ్చు. ఇంకా చూస్తే 1గా దర్శించ వచ్చు.

1–3, 3–6, 6–12, 12–24. ఇట్లా 24 తత్త్వాలతో సృష్టి నిర్మాణం జరుగుతోందని గాయత్రి చెబుతుంది. అందుకని గాయత్రి మంత్రానికి తాళం చెవులు కుమారతత్త్వంలో ఉన్నాయి. అమ్మవారికి కూడా ఐదు కాదు, ఆరు ముఖాలు అని చెబుతారు. గాయత్రి షణ్ముఖి. షట్కుక్షి. పంచముఖి కాదు. ఆరోముఖం అటువైపు ఉంటుంది కాబట్టి కనబడదు. బ్రహ్మదేవుడికి నాలుగు ముఖాలైనా మూడే కనిపిస్తూ ఉంటాయి కదా! అలాగే అమ్మవారి ముఖాలు ఆరు. ముక్త (చంద్ర కాంతి), విద్రుమ (ఎరుపు), హేమ (పసుపు), నీల (నీలం), ధవళ (సూర్యకాంతి), ఛాయ (ఐదింటికి ఆధారం background).

సూర్య చంద్రాత్మకమైన కాంతుల ఆధారంగా త్రిమూర్త్యాత్మక మైన తత్త్వం పుడుతుంది. సూర్య చంద్రాత్మకం అంటే పురుష ప్రకృతులే. అవి ఆధారంగా ఎరుపు, నీలము, పసుపు. ఈ కాంతులు సూర్యచంద్రులు లేకపోతే లేవు. సూర్య చంద్రులనుండి పుట్టినవి మూడు కాంతులు, వాళ్ళే త్రిమూర్తులు. ఈ మూడు కాంతులకూ మూలం రెండు కాంతులు. ఈ రెండిటికీ మూలం, background

ఒకటి, ఉండీ ఉండనట్టుగా ఉంటుంది. నలుపు నీలం. అదే ఛాయా వర్ణం. అందరూ చెప్పరిది. శంకరాచార్యులవారు చెప్పారు.

మాస్టర్ ఇ.కె.గారు శంకరాచార్యులవారు చెప్పారోయ్! నీవు ఇలాగే గుర్తుపెట్టుకో! అని చెప్పారు. అమ్మవారికి 6 ముఖాలుంటాయి. 18 కళ్ళు ఉంటాయి అని చెప్పారు. ముఖానికి 3 చొప్పున 18 కళ్ళు ఉంటాయి. ఆ కళ్ళు 18 రహస్యాలు చెప్పేస్తాయి అని చెప్పారు. ఆ 18 రహస్యాలే 18 అధ్యాయములుగల 'భగవద్గీత'గా రూపొందింది. ఆ 18 రహస్యాలే 18 పర్వములుగల 'మహా భారతము'గా విస్తృతి చెందింది. 18 సంఖ్య 'జయము'నకు సంకేతము. యజము నిర్వర్తిస్తే జయము లభిస్తుందని మన వాఙ్మయము ఘోషిస్తోంది. యజము అంటే పరహిత జీవనము. స్వహితము నుండి జీవితము పరహితంలోనికి మారాలి. జీవితము యజ్ఞార్థమైతే జీవుడు విజయుడు అవుతాడు. 24 తత్త్వాలలో 18 రహస్యంగాను, 6 బాహాటంగాను ఉన్నాయని పురుషసూక్తం సూచిస్తోంది. ఆ 18 తెలియటానికి యోగ ప్రవేశం చేయాలి. అంతఃకరణ ప్రవేశం చేయాలి. అంతరంగంలో అన్ని రహస్యాలు వివరింపబడతాయి. కాబట్టి కుమార ఆరాధన అంతరంగంలో అంతఃకరణ దండంగా ధ్యానించాలి.

ఇట్లా ఆరు ముఖాలు అమ్మవారికీ ఉన్నాయి. కుమారునికీ ఉన్నాయి. కుమారుడు వేరు అమ్మవారు వేరు కాదు. ముందు చెప్పాను కదా! అమ్మవారు కుమారుణ్ణి 'నన్ను చూస్తే ఏమనిపిస్తోంది' అంటే 'నువ్వే నేనని' అనిపిస్తోంది అని చెప్పాడు కదా! అందుకే అన్నాడు. వారిరువురికీ 6 ముఖాలే. ఈ 24లోనూ అన్ని తత్త్వాలూ ఉన్నాయి.

పూర్ణిమ, అమావాస్య, నెలలు, ద్వాదశీ రాశులు, ఒక కాలచక్రం ఉన్నది (Cross). ఇంతకన్నా పెద్దవి ఎన్ని ఉన్నా formula ఒక్కటే అన్ని చక్రాలకీ. 12 రాశులూ ఒకటై, ఒకటి – మూడై, మూడు ఆరై, ఆరు– పన్నెండు అయ్యాయి. ఈ విధంగా కుమారుడు కాలజ్ఞానము కూడా ఇవ్వగలడు. సమస్త జ్ఞానమూ ఒసగ గలడు. అతణ్ణి ఘనముగా యంత్రముగా పెట్టుకొని ఆరాధన చేస్తారు క్రతువిద్యలో. అతణ్ణి షడ్భుజముగా పెట్టుకొని తంత్రములో ఆరాధన చేస్తారు. అతడిని రెండు తలల పాముగా కూడా ఆరాధిస్తారు. రెండు తలలు అంటే అతడు క్రిందికి పైకీ కూడా తిరుగగలడు. దేవతలందరూ క్రిందికి రాలేరు. అతడు అవతరించగలడు. మరల స్వస్థానమునకు కూడా వెళ్ళగలడు. భూమి వరకు కూడా దిగివచ్చాడు కదా! భూమియందు సనత్కుమారునివలె శంబళ గ్రామము నందు తన స్పర్శ భూమికి అందిస్తున్నాడు. అటువంటి వాడు కుమారుడు. ఇలాంటి కుమారుణ్ణి ఆరాధించడానికి చాలా పద్ధతులు ఉన్నాయి.

# 9

**శరవణభవ :**

సుబ్రహ్మణ్యం అనే పరమోత్కృష్ట స్థితి ఒకటి ఉంటే శివుడే ముఖ్యంగా మరొక విషయం చెబుతాడు. ఈ పుట్టిన వారందరికీ ముఖ్యంగా తక్కువగా కనిపించేది దర్భ కదా! కానీ శివుని విషయంలో అలా ఉండదు కదా! శివునికి అందరూ సమానులే. ఆయనది సమదర్శనం కదా! కనుకనే స్మశానంలోనూ ఉండగలడు. కైలాసం లోనూ ఉండగలడు. వెండికొండమీద కూడా ఉండగలడు. అందుచేత నా కుమారుడు మిమ్మల్ని అనుగ్రహించాలి అంటే 'శరవణభవాయ నమః' అనే మంత్రం చేసుకోండి అని చెప్పాడు శివుడు. దర్భల్లో పుట్టినవాడు అని తలుచుకోమని దర్భకు అంతటి ప్రాముఖ్యత ఇస్తాడు శివుడు. అందుకని 'శరవణభవ' అనేది 6 అక్షరములతో కూడిన మంత్రము. అది ఆరు కేంద్రములలో భావన చేయాలి. 'శ' నుండి 'వ' వరకు 'శరవణభవ' అనే ఆరు అక్షరాలను వరుసగా ఆజ్ఞ, విశుద్ధి, అనాహతము, మణిపూరకము, స్వాధిష్ఠానము, మూలాధారములందు ధారణ చేస్తూ ఒక వెలుగు స్తంభాన్ని వెనుదండంలోని సుషుమ్నగా దర్శనం చేయండి. ఇది ఒక అద్భుతమగు సాధన. అలా చేస్తే ఆరు ప్రజ్ఞాకేంద్రాలలోని మలినం తొలగి, ఆరు కేంద్రాలు సంధింపబడి,

ఒక వెలుగు మాలగా దర్శనమిస్తాయి. దానినే "పుష్కర స్రజము" అని, "మణిపూసల సూత్ర" మని, "వైజయంతి" అని అంటారు. ఇది ధరించిన వారికి అంతా జయమే! విజయమే! సుగ్రీవునికి లక్ష్మణునిచే రాముడు ఈ మాలనే ప్రజ్ఞాపరంగా అమరుస్తాడు. అప్పుడే సుగ్రీవునికి వాలిపై జయం కలుగుతుంది. ఇది ఒక రహస్యం. ఈ మాలాధారణమే సమస్త సాధనలకు ఫలశ్రుతి. దానినే వశిష్ఠ మహర్షి తన మంత్ర దండంగా ఏర్పరుచుకొంటాడు. అజేయుడై నిలుస్తాడు. ఈ దండమే కామధేనువు. అంటే సమస్త ధర్మకామములను ఫలింపచేస్తుంది.

'ఓం'కారమును ముందు, 'య'కారమును చివర చేర్చి ఓం 'శరవణభవా'య నమః అని ధ్యానం చేయండి. కాబట్టి 'ఓం శరవణభవ' అనేది మంత్రం. 'ఓం' అంటే శివుడు. 'శరవణభవ' అంటే కుమారుడు. ఈ ఆరు కేంద్రాలను రోజూ స్పృశించండి. ఈ యోగదండం అంతా కూడా శుభమైపోతుంది. సుబ్రహ్మణ్యం అంటే 6 అక్షరాలు ఉండవు. శరవణభవ అంటే ఉంటాయి. కార్తికేయ అంటే కూడా 6 ఉండవు. విశాఖ అంటే మూడు అక్షరాలే. స్కంద అంటే రెండే. ఏ ఇతర కుమార నామానికైనా సరే 6 అక్షరాలు ఉండవు. కుమారస్వామి అంటే 5. అందుచేత మంత్రం అంటే 'శరవణభవ' అనేది మంత్రం. అందుకనే ఆ మంత్రం చేసుకోమని చెబుతారు. మరి ఆ మంత్రం ఎలా చేసుకోవాలి? 6 కేంద్రాలు, 6 అక్షరాలు శబ్దం – ధ్వని చేస్తూ ఆ స్పృశిస్తున్నటువంటి భావనతో 6

కేంద్రాలలోనూ ధ్యానం చెయ్యాలి. అట్లా 6 సార్లు చెయ్యండి చాలు. యోగశక్తి పెరుగుతుంది. అలా పెంచుకోవచ్చు యోగశక్తిని.

ఈ విధంగా కుమారశక్తి గురించి చాలా చెప్పుకోవచ్చు. అది ఒక క్యూబ్ గా, ఒక triple cross గా, వజ్రంగా, శక్తిగా, సంకల్పశక్తిగా, నిర్వహణశక్తిగా, ఇచ్ఛా, జ్ఞాన, క్రియశక్తిగా కూడా చెప్పుకోవచ్చు. నిన్ను తల్లిదండ్రులతో కలిపేస్తాడు. ఎందుచేత అంటే అనుంగు బిడ్డడు అతడు ఇరువురికీ. శివుడికీ ప్రీతి, అమ్మవారికీ ప్రీతి. అన్నయ్యకీ ప్రీతి. అదొకటి గుర్తుపెట్టుకోండి.

గణపతి పూజ చేసేటప్పుడు మీరు కుమారస్వామిని కూడా స్తోత్రం చేస్తే గణపతి ఎక్కువ సంతోషిస్తాడు. తమ్ముడంటే ఆయనకు చాలా ఇష్టం. కృష్ణుడే కదా! కృష్ణుడు తెలిసినంత కుమారుడు తెలియడు. కానీ కుమారుడే కృష్ణుడు! అతడు గుహుడు!

ఇరువురూ చేసే పనులు ఒకటే. దుష్ట సంహారం చేస్తారు. రక్షణ ఇస్తారు. పోషణ చేస్తారు. అన్నిటికీ మించి యోగాన్ని ప్రసాదిస్తారు. ఆత్మ తత్వానికి దారి చూపిస్తారు. నిన్ను బ్రహ్మమునకు చేరుస్తారు. కుమారుడంటే గణపతికి ఇష్టం. ఎప్పుడూ ప్రక్కనే ఉంటాడు. గణపతిని పూజించేటప్పుడు కుమారుణ్ణి ముందు పూజిస్తే గణపతి సంతోషిస్తాడు. శీఘ్రంగా ప్రసన్నుడు అవుతాడు. అలాగే శివుణ్ణి పూజించేటప్పుడు నందీశ్వరుణ్ణి ముందు పూజించి శివుణ్ణి పూజిస్తే శివుడు ఎక్కువ సంతోషిస్తాడు. నందిని మరచి శివుణ్ణి పూజించకూడదు. రావణుడు అలాగే చెయ్యడం వల్ల దెబ్బతింటాడు. అలా వాహనాల్లా ఉంటాయే

అవి చాలా ప్రధానం. ఎందుకంటే అన్నింటికన్నా సన్నిహితంగా, భక్తి ప్రపత్తులతో ఉంటాయి కదా అవి. సాన్నిధ్యంలో ఉంటాయి అవి. అందుచేత వాటిని విస్మరించకూడదు. కుమార పూజ వల్ల గణపతి అనుగ్రహం, నందిపూజ వల్ల శివుని అనుగ్రహం లభిస్తాయి. శక్తివంతుడవు అవుతావు. దేహంలో ఉన్నటువంటి కార్యములు అన్నీ నిర్వర్తింప గలిగిన సమర్థత మనలో ఏర్పడుతుంది.

## శివతేజం :

Positive Mars, Negative Mars ఇట్లా ఉంటాయి. కుజ గ్రహం గురించి మనకు ఈ ప్రవచనం syllabus లో లేదు. నిజానికి కుజుడు కుమారాంశయే. కుమారాంశ భూమి పుత్రుడుగా కుజుడు. అందుకనే అంగారక గ్రహం భూమినుంచి పుట్టిందని చెబుతారు. క్రింది లోకములలో కుజుడే, పై లోకాలలో కుమారుడు. కృత్తిక మండలంలో కార్తికేయుడు. క్రింది లోకాలలో అజ్ఞానం ఎక్కువ, జ్ఞానం తక్కువ. అందుకే కలహాలు, కొట్లాటలు, యుద్ధాలు, హత్యలు, రక్తపాతాలు మొదలైనవి కుజుని కారణంగా జరుగుతాయి. పై లోకాలలో మనోవిజయం, కామవిజయం, త్రిగుణవిజయం, మాయామోహ విజయం కుమారుడు కలిగిస్తాడు. ప్రస్తుతానికి కుమార ప్రసంగమే. అతడి ఆరాధన వల్ల సకల సద్గుణాలే గాక సకల సమర్థత ఏర్పడు తుంది. అందుచేత అలాంటి కుమారుడు సృష్టికోసం శివతేజం నుండి దిగి వచ్చాడు. కుమార సంభవం వింటేనే మనకి చాలా మలినాలు తొలగిపోతాయి. పవిత్రత ఏర్పడుతుంది. కుమార స్మరణ చేతనే

అవన్నీ పారిపోతాయి. ఇన్ని విషయాలు చెప్పడంలో ఆ సమయంలో ఒక విషయం యందు ఒక మరపు వచ్చింది.

ఏమిటంటే శివతేజం భూమి మీద పడింది కదా!

భూమి మీద పడింది ఏమైంది. శ్వేత ద్వీపం అయ్యింది కదా! అంతే కాదు. అది కారణంగానే బంగారం పుట్టిందట భూమిమీద. అందుకని బంగారంలో శివతేజం ఉంటుంది. స్రావం అయ్యి కుమారుడు పుట్టినప్పుడు స్రావంలో నుండి భూమిమీద బంగారము, వెండి, రాగి పుట్టాయట. తేజము కుమారునిగా శ్వేతద్వీపంగా ఏర్పడితే తత్ స్రావము నుండి బంగారము, వెండి, రాగి భూమిమీద ఏర్పడి నాయని పురాణాలు చెబుతున్నాయి. అందుకనే దివ్య కార్యాలలో ఈ లోహములే వాడతారు. కారణం వానియందు శివతేజము వుంది కదా! వీటికి మాత్రమే పూజార్హత ఉన్నది. మిగతా లోహాలకు లేదు అని చెబుతారు. ఎందుకంటే వీటిలో శివశక్తి, తేజం ఉన్నది. అంటే అవి శివంకరము అంటే శుభంకరము అయినటువంటివి. మంగళ ప్రదము అని అర్థం. ఇక మిగతా లోహాలు పూజకు వాడకూడదు.

స్రావ మలినం నుండి మూడు లోహాలు పుట్టాయట! అవేమి టంటే ఇనుము, తగరము, సీసము. మనకి ఈ 6 చక్రాల్లో ఉండే ధాతువులు కూడా ఇవే చెబుతారు. మూలాధారంలో సీసం, తగరం, ఇనుము. ఇవి మణిపూరకం క్రింద ఉండే చక్రాలకి సంబం ధించిన లోహాలు. పై వాటికి సంబంధించినవి బంగారము, వెండి, రాగి. ఇవి కూడా ఈ తేజం నుండే పుట్టాయట భూమిమీద. వీటిల్లో 3

శివుని తేజస్సులోని శక్తిచే పుట్టినవి. స్రావం లోంచి పుట్టినవి చివరి మూడు. అందుకే ఇనుము వాడరు. ఇంటికి కూడా ఇదివరకు ఇనుము వాడేవాళ్ళు కాదు. ఇప్పుడంతా ఇనుముతోనే ఇళ్ళు కడుతున్నాము కదా! ఇనుముతో కట్టిన ఇంటికీ, చెక్కదూలాలతో కట్టిన ఇంటికీ ప్రభావంలో చాలా తేడా ఉంటుంది. ఇనుము ఇంట్లో ఉండేకన్నా పాకలో ఉండటం మేలని చెబుతారు తెలిసిన వాళ్ళు. పెంకుటిల్లు కూడా మంచిదే. ఇనుములో ఒక హృదయం పుట్టింది అన్నాడు ఒక కవి. ఇనుములో హృదయం పుట్టదు. ఏ పాషాణమో పుట్టాలి.

బంగారంలో పుడుతుంది హృదయం. వెండిలో పుడుతుంది తెలివి. బంగారంలో పుట్టేది ప్రాణము. వెండిలో పుట్టేది శుద్ధ చైతన్యం. రాగిలో పుట్టేది బుద్ధి, పవిత్రమైన మనస్సు. అందుకనే సన్యాసులు రాగిచెంబు పట్టుకుంటారు. బంగారం, వెండి, రాగి దానం చెయ్య వచ్చు. దైవకార్యాలకు ఆ మూడే వాడాలి. మిగతావి వాడకూడదు. రాగి అంటే తోముకోవాలి ఎక్కడ చస్తాం, గాలికే నల్లబడిపోతుంది. ఎందుకంటే గాలిలోనే మలినాలు ఉంటున్నాయి. వెండీ అంతే! అది కూడా రోజూ తోముకోవడం యోగం కదా! "మలినాలను తొలగించుకో, మంచిని పెంచుకో" అని చెబుతారు. ఇనుము, తగరం, సీసం వర్జనీయములు. వెండి, రాగి, బంగారం శ్రేష్ఠములు.

ఇలా మనకు ఈ కుమార సంభవం నుంచి ఎన్నో విషయాలు బయటకు వచ్చాయి. దర్భలు కూడా అందుకే వాడతారు. అన్నీ చాపలూ ఒకటే కాదు. దర్భచాపే శ్రేష్ఠం. ఇప్పుడు Plastic, Nylon చాపలు కూడా వస్తున్నాయి. మూర్ఖులకు ఎన్నో రకాలు ఉంటూ

ఉంటాయి. ఏదైతే ఏంటి అంటే నీకంతే. తూర్పు వెళదాం అనుకునే వాడు, పడమరకి వెళ్లేందుకు పనికొచ్చేవన్నీ పోగేసుకున్నా డనుకోండి. ఎలా వెళతాడు తూర్పుకి? కుదరదు కదా! నీవు వాడే పరికరాలు నీ ప్రయాణానికి ఉపయుక్తంగా ఉండాలి కదా. అలా లేకపోతే చేసే పనికి అవన్నీ అడ్డే.

కుమార సంభవం వల్ల యోగులకు మార్గం ఏర్పడింది. యోగ మార్గం ఏర్పడి పై లోకాల్లోంచి క్రింది లోకాల్లోకి రావడానికి, క్రింది లోకాల్లోంచి పై లోకాల్లోకి జీవులు వెళ్ళడానికి ఏర్పడిన మార్గం కుమారుడు. "I am the way" నేనే మార్గం అన్నాడు కదా ఒకాయన (Jesus). దానిని తెలిసినవాడు అలానే అంటాడు. ఎందుకంటే అతడు కుమారుడు కనుక! కుమారుడు ప్రతీవాడూ అలానే అంటాడు. అతడిని ఆశ్రయించడం సర్వశ్రేష్ఠం. అన్ని రకాలుగా ఇహంలోనూ పరంలోనూ పరిపూర్ణత ఏర్పరచడానికి అతని కన్నా మించిన శక్తి, మార్గము వేరొకటి లేదు. ఇదీ కొంత క్లుప్తంగా ఉన్న సమయంలో చెప్పుకోగలిగిన కుమార సంభవం. ఇందులోంచి ఇంకా చాలా వివరాల్లోకి వెళ్ళవచ్చు. అవి మీ మీ ఓపికల్ని బట్టి వెళ్ళండి.

రామాయణంలో బాలకాండలో ఉన్నది కుమార సంభవం. భవిష్యత్ పురాణంలో కొంత, స్కాంధ పురాణంలో కొంత, శివ పురాణంలో కొంత వివిధమైన చోట్ల ఉన్నది. ఇది సంక్షిప్తంగా మనకి వచ్చిన ఉపాఖ్యానము. సృష్టి అనేటటువంటిది వ్యాఖ్యానమైతే అందులో ఇది ఒక ఉపాఖ్యానము. సర్వసిద్ధులకీ ఇదే మార్గము. ఊర్ధ్వమునకు వెళ్ళవచ్చు, అధస్సునకు వెళ్ళవచ్చు. ఇహంలో పరం అనుభవించ

వచ్చు. పరాన్ని చేరవచ్చు. పరాన్ని క్రిందకి తీసుకొని రావచ్చు. Kingdom of God on Earth అనేది కుమారుని వల్లే సాధ్యం అవుతుంది. భూమిమీద స్వర్గం చూపించేది కుమారుడే. అలాంటి వాడు కుమారస్వామి!

కుమారుని గురించి మరికొన్ని విషయాలు. షణ్ముఖుడైన కుమారుని అంకె 6 (ఆరు). ఆరు ముఖములు కదా! అలాగే అతడు జన్మించింది కూడ షష్ఠినాడే! సుబ్రహ్మణ్య షష్ఠి మార్గశీర్షమాసంలో వస్తుంది. ఆనాడు మనము స్వామిని విశేషంగా ఆరాధిస్తాము. ఆజ్ఞా కేంద్రము నుండి మూలాధారం వరకు అతడు ఆరు(6) ప్రజ్ఞా కేంద్రములందు వ్యాప్తి చెంది ఉండటం కూడ అతని షణ్ముఖత్వమును సంకేతిస్తుంది. అంతేకాక మనలోని అరిషడ్వర్గములు- అంటే 1. కామము, 2. క్రోధము, 3. లోభము, 4. మోహము, 5. మదము, 6. మాత్సర్యములను హరించి, షడ్గుణములను ఆవిష్కరింపచేసే శక్తిమంతుడు అతడు. అతని శక్తి ఆయుధమును అందుకే పూజిస్తూ ఉంటాము. అహింస, దయ, దానము, సమబుద్ధి, వినయము, అనసూయత్వములను ఆరు సద్గుణములుగా ఆవిష్కరిస్తాడు.

మన స్వాధిష్ఠాన పద్మము ఆరు (6) దళములతో కూడివున్న దానిగా యోగశాస్త్రము తెలుపుతుంది. ఈ కేంద్రమందే మనలోని ఆవేశకావేశములన్నీ నివాస మేర్పరుచుకొని మన ప్రజ్ఞను, ప్రాణాన్ని కలుషితం చేసి మానవుని పశుప్రాయంగా చేస్తాయి.

కుమారుని ఆరాధనవల్ల ఈ మలినాలన్నీ క్రమంగా

నిర్మూలింపబడి మానవ ప్రజ్ఞ, ప్రాణములు స్వచ్ఛమై ఆనందాను భూతికి మానవుడు అర్హత సంపాదించుకుంటాడు. స్వాధిష్ఠాన పద్మ వివరం కోసం యోగ గ్రంథాలను పరిశీలించండి. లలితా సహస్ర నామమందు కూడ ఈ ప్రస్తావన వున్నది.

మరొక విషయం. ఆది కావ్యమైన రామాయణం కూడ ఆరు కాండలుగా వాల్మీకి మహర్షి అందించడంలో ఆంతర్యము ప్రతి మానవుడు రామునివలెనే సద్గుణముల నాశ్రయించి, కుమారునివలె వెలుగొందాలని. శ్రీరాముని యందలి గుణములన్నీ మానవుని దైవ కుమారునిగా మలచుటకే. రామలక్ష్మణులు స్కంద విశాఖులే! విశ్వామిత్ర మహర్షి, ఆంజనేయస్వామి రామలక్ష్మణులను స్కంద విశాఖులుగనే దర్శిస్తారు. ధర్మ సంస్థాపనకు, మానవులకు మార్గదర్శక మగు జీవనమును నిర్దేశించుటకు మానవునిగా దైవం అవతరించిన అపూర్వ ఘటన రామచరితం.

రామాయణం ఆరు కాండల కావ్యమే. ఆది కావ్యం. ఇతిహాసం. భూమిపై జరిగిన యథార్థ గాథ. అది నిస్సందేహం. ఆధునిక చరిత్ర ఒప్పుకున్నా, లేకున్నా రామాయణం ఇతిహాసమే!

**ఉత్తరకాండ :**

రామాయణము రామ సామ్రాజ్య పట్టభిషేకంతో పరిసమాప్తి అవుతుంది. ఉత్తర రామాయణము తరువాత చొప్పించారు. ఉత్తర కాండము వాల్మీకి కృతం కాదు. మాస్టర్ ఇ.కె.గారి మాటల్లో చెప్పాలంటే "ఎవడో రాసిందే ఉత్తర కాండ! అందులో వ్యాకరణం

తప్పులు కూడ ఉన్నాయి. అతడి పేరు కూడ వాల్మీకి కావచ్చు. అంత మాత్రంచేత రామాయణానికి 7 కాండలు ఏర్పడవు." నిజానికి ప్రతివాడు రామాయణాన్ని తమ ఇష్టానుసారం వ్రాయడంవలనే అనేక రామాయణాలు ఏర్పడ్డాయి. మాయ సీత, లక్ష్మణ రేఖ ఇత్యాది వన్నీ యితరుల కల్పితాలు. రామాయణం అంటే వాల్మీకి కృత రామాయణమే. ఆ ఇతిహాసమునకు ఆరు కాండలే వున్నాయి. ఎందుచేతనంటే అది కుమారతత్త్వంతో కూడిన కథ.

## దీక్షలు :

మరొక విషయం. దృఢ సంకల్పానికి కుమారుడు పెట్టింది పేరు. సిద్ధించేవరకు కలిగిన సంకల్పాన్ని నిర్విఘ్నంగా, నిరంతరంగా అనుస్యూతంగా నిర్వర్తించాలంటే కుమార ఆరాధన చేసుకోవాలి. దీక్షకు కుమారుడే ప్రసిద్ధి. అయ్యప్ప దీక్షలు మీ కందరికీ తెలియనివి కావు. నలుబది ఐదు రోజుల దీక్ష లేక మండల దీక్ష కుమార సంబంధమే.

45 రోజులు దీక్షగా ఒక సంకల్పం నిర్వర్తించుకోవటం ద్వారా మనలో క్రియాశక్తిని పెంపొందించుకోవచ్చు. క్రియాశక్తివలనే దక్షత కలుగుతుంది. దీక్ష వలన దక్షత! అట్టి దక్షతనిచ్చి తరింప చేసేవాడే కుమారుడు. భూమిపై ఒక ప్రణాళికను స్థాపన చేయాలంటే క్రియా శక్తి కావాలి. దక్షత కావాలి. దక్షత లేనివాడు ఏమీ స్థాపన చేయలేడు. దీనినే కుజ బలం అని కూడ అంటారు. 45 రోజులంటే మూడు (3) పక్షములు. అమావాస్య తరువాతి పాడ్యమి నుండి కాని, పౌర్ణమి

తరువాతి పాడ్యమి నుండి కాని సామాన్యంగా మండల దీక్ష ఆరంభిస్తారు. జీవితం పండాలంటే దక్షత, ధర్మము తోడు అవ్వాలి.

**మంగళవారం :**

కుమారుని 'మంగళు'డని కూడ పిలుస్తారు. దక్షతతో నిర్వర్తించటం వలన మంగళత్వం ప్రాప్తిస్తుంది. మంగళవారాన్ని జయ వారమని పిలవటంలో గల ఆంతర్యమిదే.

**నక్షత్రములు, మాసములు :**

కృత్తిక, విశాఖ నక్షత్రములు కుమార నక్షత్రములు. అతడు కార్తికేయుడు మరియు విశాఖుడు. ఈ నక్షత్రములలో సూర్య చంద్రుల సంచారాన్ని గమనించి, తదనుగుణంగా కుమారస్వామితో అను సంధానం చెందే ప్రయత్నం చేయండి. అలాగే వైశాఖ, కార్తీక మాసము లలో కుమార ఆరాధనం అత్యంత శ్రేష్ఠం.

మంగళవారం, షష్ఠి తిథి, కృత్తిక విశాఖ నక్షత్రములు, కార్తీక వైశాఖ మాసములు కుమార స్పర్శకు అనుగుణమగు కాలములని గుర్తించి ఆరాధన చేసుకోండి.

చెప్పబడిన యంత్రములను ఆరాధించటానికి నిష్ఠ కావాలి. అంతరంగ ఆరాధనకు ఏ నిష్ఠ అక్కర లేదు. భక్తిశ్రద్ధలు చాలు.

విజయవాడలో కుమారతత్త్వం వివరించుకోవటం అదృష్టంగా, అనుగ్రహంగా భావిద్దాం. వీలున్నంత ఆచరణకు పూనుకోండి. దానివలనే సిద్ధి.

*స్వస్తి!*

**DHANISHTA PUBLICATIONS**

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1 | Agni | E |
| 2 | A Clean Life | E/G/S |
| 3 | Adhyatmika Gigyasa | K |
| 4 | Amanaskudu | K/T |
| 5 | Ambareeshudu | T |
| 6 | Antardarsana Dhyanamulu | T/K |
| 7 | Anveshakudu | T |
| 8 | Asangudu | T/K |
| 9 | Aries | E |
| 10 | Ashram | E |
| 11 | Ashram Leaves | E/G/S |
| 12 | Ashram Regulation for Entry | E/G/S |
| 13 | An insight into the WTT | E |
| 14 | Atmasadhana Sutramulu | T |
| 15 | Avathara of Synthesis | E |
| 16 | Ayurvedic Principles of Daily Life | E/G/S |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 17 | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 18 | Book of Prayers | E |
| 19 | Cow | K/T/E/Hi |
| 20 | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 21 | Dharmavigrahudu – Sri Ramudu | T |
| 22 | Dhanakamuni Katha | T |
| 23 | Doctrine of Eternal Presence | E |
| 24 | Gayatri Mantra Avagahana | T |
| 25 | Geetopanishad - Gnana Yogamu | T |
| 26 | Geetopanishad - Dhyana Yogamu | T |
| 27 | Geetopanishad - Karma Yogamu | T |
| 28 | Geetopanishad - Sankya Yogamu | T |
| 29 | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 30 | Geetopanishad - Vijnana Yogamu | T |
| 31 | Good Friday | E/S |
| 32 | Healers Handbook | E |
| 33 | Health & Harmony | E/G |
| 34 | Hercules - The Man and the Symbol | E/G/S |
| 35 | Himalaya Guruparampara | T/Hi/K |
| 36 | Jupiter - The Path of Expansion | E/G/S |
| 37 | Just Adjust | E |
| 38 | Jyotirlinga Yatra | T |
| 39 | Kapila and Kardama | E/G/S |
| 40 | Katha Deepika | T |
| 41 | Lectures on Secret Doctrine - I | S/E |
| 42 | Lectures on Secret Doctrine - II | E |

| | | |
|---|---|---|
| 43 | Lectures on Secret Doctrine - III | E |
| 44 | Listening to the Invisible Master | E/S/K |
| 45 | Lord Maitreya – The World Teacher | E/S |
| 46 | Life and Teachings of Master Jupiter | E |
| 47 | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 48 | Mana Master garu | T |
| 49 | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 50 | Mars - The Kumara | E/G/S |
| 51 | Mercury - The Alchemist | E/G/S |
| 52 | Maria Magdalena | E/S |
| 53 | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 54 | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 55 | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 56 | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 57 | MASTER C.V.V. - Yogamu | T |
| 58 | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 59 | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 60 | Master CVV - Saturn Regulations | E/G/S |
| 61 | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 62 | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 63 | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 64 | Marana Rahasyam (Markandeya) | T |
| 65 | Master CSG | E |
| 66 | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 67 | Moon - The Key | E |

| | | |
|---|---|---|
| 68 | New Age Hospital Management | E |
| 69 | Nutrients For Discipleship | E |
| 70 | OM | T/K/E |
| 71 | Occult Meditations | E/G/S |
| 72 | Om Namo Narayanaya | E/G/S |
| 73 | On Change | E/S |
| 74 | On Healing | E |
| 75 | On Love | E/G/S |
| 76 | On Service | E/G/S |
| 77 | On Silence | E/G/S |
| 78 | PARIKSHIT-The World Disciple | E |
| 79 | Pranayamam | T |
| 80 | Prayers | E/G/S |
| 81 | RUDRA | E |
| 82 | Rukmini Kalyanam | T |
| 83 | Sai Sukthulu | T/K |
| 84 | Sai Ki Amruthavani | Hi |
| 85 | Sanghaneethi | T |
| 86 | Saraswathi-The Word | E/G/S |
| 87 | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 88 | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 89 | Shodosopachara Pooja - Avagahana | T |
| 90 | SOUND-The Key and its Application | E/G/S |
| 91 | Spiritualism-Business and Management | E/G |
| 92 | Spiritual Healing | S/G |
| 93 | Sri Dattatreya | E/G/S/T |

| | | |
|---|---|---|
| 94 | Srimadramayana Dharmakusumalu | T |
| 95 | Sri Guru Paadukastavamu | T |
| 96 | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 97 | SRI SASTRY GARU | T/K/E/S |
| 98 | Sri Krishna Namamrutham | T |
| 99 | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 100 | Sri Suktam | E |
| 101 | Steps of Silence | E |
| 102 | Sun that Iam | E/G/S |
| 103 | Temple and the Work | E |
| 104 | The Aquarian Cross | E/G/S |
| 105 | The Aquarian Master | E/G/S |
| 106 | The Doctrine of Eternal Presence | E |
| 107 | The Doctrine of Ethics | E/S |
| 108 | The Etheric Body | E/G/K |
| 109 | The Golden Stairs | E/S |
| 110 | The Path of Synthesis | E |
| 111 | The Splendor of Seven Hills | E |
| 112 | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 113 | THE TEACHER-Meaning and Significance | E |
| 114 | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 115 | The Teachings of Lord Kapila | E/G |
| 116 | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 117 | The Teachings of Sanath Kumara | E/G/S |
| 118 | The Theosophical Movement | E/G/S |

| | | |
|---|---|---|
| 119 | The White Lotus | E/S/K |
| 120 | The World Teacher | E |
| 121 | The Mysteries of Sagittarius | E |
| 122 | Time - The Key | E/G |
| 123 | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 124 | Varuna Graha Prabhavamu | T/K |
| 125 | VENUS-The Path to Immortality | E/S |
| 126 | Violet Flame Invocations | E |
| 127 | Vrutrasura Rahasyam | T |
| 128 | Wisdom Buds | E/S |
| 129 | Wisdom Teachings of Vidura | E/G/S |

**ONLY IN SPANISH LANGUAGE**

130 The Path of Meditation
131 The Sublimity of Work
132 The Teachings of Master Tibetan
133 Death and Re-incarnation
134 Importance of Moon Nodes
135 Spiritual Practices for Disciples I & II
136 The Science of Health and Cure
137 Om Namo Narayanaya
138 Hanuman and Ramayana
139 Significance of Ganesha

**ONLY IN RUSSIAN LANGUAGE**

140 Sun
141 Mars
142 Mercury

143 Jupiter
144 Venus
145 Saturn
146 Uranus

**OTHER BOOKS BY DHANISHTA**

| | | |
|---|---|---|
| 1. | Purana Purushuni Pooja Vidhanamu | T |
| 2. | Sri Anjaneya Pooja Vidhanamu | T |
| 3. | Sri Dattatreya Sodachopachara Pooja Vidhanamu | T |
| 4. | Sri Hanuman Chalisa | T |
| 5. | Srimad Bhagawad Geetha | T |
| 6. | Sri Mahalakshmi Pooja Vidhanamu | T |
| 7. | Sri Rama Pooja Vidhanamu | T |
| 8. | Sri Shiva Hrudayamu | T |
| 9. | Sri Shiva Pooja | T |
| 10. | Sri Soukumarya Satakamu | T |
| 11. | Sri Subrahmanya Swamy Pooja Vidhanamu | T |
| 12. | Sri Surya Pooja Vidhanamu | T |
| 13. | Sri Venkateswara Pooja Vidhanamu | T |
| 14. | Sri Saraswathi Pooja Vidhanamu | T |
| 15. | Sri Vinayaka Vratha Kalpamu | T |
| 16. | Sri Narayana kavachamu | T |
| 17. | Sri Vishnu Sahasra Namamu | T |
| 18. | Sri Sathguru Pooja Vidhanam | T |

---

**Please visit our website (www.dhanishta.org / info@dhanishta.org) for prices**

“శరవణభవ” అనేది ఆరు అక్షరములతో కూడిన మంత్రము. దానిని ఆరు కేంద్రములలో భావన చెయ్యాలి. ‘శ’ నుండి ‘వ’ వరకు ‘శరవణభవ’ అనే ఆరు అక్షరాలను వరుసగా ఆజ్ఞ, విశుద్ధి, అనాహతము, మణిపూరకము, స్వాధిష్ఠానము, మూలాధారము లందు ధారణ చేస్తూ ఒక వెలుగుస్తంభాన్ని వెనుదండంలోని సుషుమ్నగా దర్శనం చేయండి. ఇది ఒక అద్భుతమగు సాధన. అలా చేస్తే ఆరు ప్రజ్ఞాకేంద్రాలలోని మలినాలు తొలగి, ఆరు కేంద్రాలూ సంధింపబడి, ఒక వెలుగు మాలగా దర్శనమిస్తాయి. దానినే ‘పుష్కరస్రజము’ అని, ‘మణిపూసల సూత్ర’ మని, ‘వైజయంతి’ అని అంటారు. ఇది ధరించినవారికి అంతా జయమే! విజయమే!!

ధనిష్ఠ

ISBN 978-81-89467-78-4

9 788189 467784